
చీరకట్టిన ఆ సొగసు
వినయ్ కాటన్ చీరకే
తెలుసు.
vinay®
COTTON SAREES

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

విడిప్రతి వెల నాలుగు రూపాయలు!

సంపుటం 82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 31

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్లు : 75667, 61247, 61248

వీక్లీ పోస్ట్

ఎయిర్ బస్

2-3-90 'గౌతమి' సంచికలో ఎడిటోరియల్ 'ఎయిర్ బస్ విషాదాంతం' చదివి ఆ 'భయంకర ఎయిర్ బస్' లెప్పుడూ అవసరమైనా సరే ఎక్కరాదని నిశ్చయించుకున్నాను. నిజంగా మంచి మంచి టాపిక్స్‌ను మాకు 'ఎడిటోరియల్'గా అందించుతున్నారు.

ఇదే సంచికలో 'విద్యార్థులలో అశాంతి ఎందుకు' అనే శీర్షికలో మణిమాలగారు వ్యక్తం చేసిన అభిప్రాయాలతో నేను మనఃపూర్తిగా ఏకీభవిస్తాను.

"హల్లో డాక్టర్ నేనేంచేయాలి?" మా డాట్స్ చాలమటుకు క్లారిపై చేస్తోంది.

ఎస్. శ్రీనివాసరావు

విశాఖ.

సూపర్ హీరో

గతవారం పత్రికలో (2-3-90) "సూపర్ హీరో" సీరియల్ చాలా బావుంది. ముఖ్యంగా దమయంతి పాత్ర మలచినతీరు ధనాధన్‌గా వుంది. మన్నెం శారదగార్కి మీ (మా) పత్రిక ద్వారా మా అభినందనలు అందజేయగలరని ఆశిస్తున్నాం. ప్రతివారం పత్రికకోసం నిరీక్షిస్తున్నాం.

కామేశ్వరి, బాలాజీ, రాము

నిజామాబాద్.

* * * *

పత్రిక ఈ మధ్యకాలంలో చక్కగా రూపు దిద్దుకుంటున్నది. ముఖ్యంగా సూపర్‌హీరో సీరియల్ చాలాబావుంది. దమయంతి పాత్ర చక్కగా ఇంట్రస్టింగ్‌గా ఉన్నది. సినిమాలలో నటీమణుల సాధకబాధకాలని బాగా కళ్లకు కట్టినట్టు రచించారు.

ఆర్. భవాని

హైదరాబాద్.

కథలు


9-3-90 తేది సంచికలో కర్తవ్యానికి గండి కథలో జిల్లా విద్యాశాఖాధికారి నుండి శేషాద్రి ఉత్తరువు తెచ్చినట్లు రాశారు. జిల్లా విద్యాశాఖాధికారికి జూనియర్ కాలేజీలపై అధికారం లేదని గ్రహించాలి.

రాణించిన ప్రతిభ కథ కలియుగంలో ఇలాంటివి జరగవు.

– కె. రామారావు, హైదరాబాద్

(65 వ పేజీ చూడండి)

పదండి లోపలికి!



ముఖచిత్రం:
అందాల తార
రాధ
(46వ పేజీ చూడండి)

పై వారం:
మర్రిచెట్టు (దెయ్యం కథ)

ఒరులేయవి యొనరించిన నరవర యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఎడిటోరియల్ అడ్వయిజర్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ముద్రాపకుడు: ప్రచురణకర్త: శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ 23-3-1990 శక సం. 1911 చైత్రమాసం 2వ తేదీ

వేపపూవుగుత్తుల ముసిముసి నవ్వుల ఉగాది!

తెలుగువాడి ఉగాది సీదాసాదా పండుగ. గానా బజానాలు, ఖుసాపీనాలు అమితంగా లేనివేడుక. తెలుగువాడి ఉగాది జీవన రుచులకు ప్రతీక. అది ఒక ప్రకృతి సిద్ధమైన ఋతు ప్రహేళిక. కమ్మని వసంత కాలానికి అది ఒక ప్రాతిపదిక.


క్రొత్త అమావాస్యకు కొత్త చింతపండు, కొత్తబెల్లం, కోకిలమ్మ గానమాధుర్యానికి పులకించి రూపుకట్టిన కొత్త మామిడిపిందె, వేపచెట్టు చిందిస్తున్న ముసిముసి నవ్వులాంటి వేపపూగుత్తులు - ఇవన్నీ కలసిన ఉగాది పచ్చడి కేవలం రుచుల కలియికకాదు. అది ఒక నవజీవన సందేశం. సృష్టిస్థితి లయబద్ధమైన ఉనికికి నాంది సృష్టియే అయితే దానికి ప్రస్తావన వసంతమే! - అందుకే తెలుగువాడి ఉగాది క్యాలెండర్ కాగితాలమీద, పద్దుల పుస్తకంమీద చూపించబడే మార్పులాంటిది, "మార్క్" లాంటిది కాదు! అది ఒక వికసించే పువ్వులాంటి పండుగ!

ఆదాయ వ్యయాలు, రాజ్యపూజ్య అవమానాలు అంచనా కట్టుకొని పంచాంగ ఫలితాలు నమ్మినా నమ్మకపోయినా విని కొంగ్రొత్త కోర్కెల కేరింతలతో మనసులు ఊగే తూగుటూయల తెలుగువాడి సంవత్సరాది పండుగ!

'శుక్ల' నామ సంవత్సరం మన రాష్ట్రంలో తెలుగుదేశ ప్రభుత్వాన్ని గద్దెదింపింది. అడుగంటిపోయిందనుకున్న కాంగ్రెస్ ప్రతిష్ఠని మూడుపూలు ఆరు కాయలుగా చేసి సింహాసనంమీద కూర్చోబెట్టి ఆదరించింది. అయితేనేమి? హుకుం చెలాయించే పార్టీ మారింది కానీ ప్రజల జీవితంలో ప్రగతి కాంతులు నింపగల కొత్త మార్పులు చేయగల పరిస్థితులేవీ శుక్లనామ సంవత్సరాంతంలో ఒనగూడలేదు.

మార్చి నెలలోనే పిల్లలకి పరీక్షలు వీరప్రవేశం చేస్తాయి! మార్చి మొగలోనే మండుటెండలు దారికాస్తాయి. మార్చి నెలలోనే మంచినీటి "జలలు" యింకిపోనారంభిస్తాయి. వీటన్నింటికంటే ముందు ఎప్పటిలాగే విద్యుచ్ఛక్తి కోత; మంచినీటి కటకట. యివి కూడబలుక్కొని దైనందిన జీవితంమీద కొరడాదెబ్బలు కొట్టడం ప్రారంభిస్తాయి! పోయిన సంవత్సరం శుక్లనామ సంవత్సర ఉగాదికి స్వాగతం చెబుతూ - ప్రమోదూత అవతరించే వేళకి 'పవర్ కట్' పెట్టే రంపపుకోత నుంచి తప్పించుకుపోగలనని ఆశించిన తెనుగురైతు, ఆంధ్ర పారిశ్రామికవేత్త, తెలుగుమీడియం, ఇంగ్లీషుమీడియం, యీ రెండింటిలో దేన్ని ఎంచుకున్న విద్యార్థైనా భాషా భేదం లేకుండా ఆంధ్రప్రదేశ్ విద్యార్థి - అంధకారంలో కొట్టుమిట్టాడుతున్నారు! ఇది చాలక ప్రభుత్వం వడ్డించే రవాణా ఛార్జీల అదనపు భారాన్ని తలుచుకుని ముందే క్రుంగిపోతున్నాడు ఆంధ్రుడు. అయినప్పటికీ మానవుడు ఆశావాది! అందులోను తెలుగునాడు మహానటుడు। గిచ్చినా, గీరినా, మెచ్చినా, తిట్టినా గిలిగింతలు పెట్టినట్టు నవ్వగల ధీమంతుడు! అందుకనే ప్రమోదూతనామ సంవత్సరం ప్రమాదభూయిష్ఠంగా కాక ప్రమోదభరితంగా వుంటుందనే ఆశతో ఆవకాయ పెట్టుకోవడానికి అప్పుదొరుకుతుందనే నమ్మకంతో స్వాగత గీతికలు ఆలాపిస్తున్నాడు! ప్రభుత్వ విధానాలు "అల్లుడికి నెయ్యిలేదు, అల్లుడితో వచ్చినవాడికి నూనీలేదు" అన్న చందాన వున్నప్పటికీ ప్రజాస్వామ్య పరిరక్షకులైన మహాజనులందరూ క్రొత్త సంవత్సరాదికి కొత్త ఉత్సాహంతో స్వాగతం పలకాలని కోరుతూ వారికి పిరికిమందు పోయకుండా అభినందనలు అందిస్తూ 'ప్రమోదూత' సంవత్సరానికి ఎదురెళ్లి స్వాగతం చెబుతున్నాము! **[11-3-90]**

తెలుగువారి నిరంతర సేవలో మాకిది 82వ సంవత్సరం



బుద్ధవిగ్రహం నీటమునిగిన ఘటనపై అధికారులనుకలుసుకొని సహాయకార్యక్రమాల విషయమై ఆదేశాలిస్తున్న ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి.

తాజా కాలమ్

వీరాజీ

హైదరాబాద్ నగరం 400 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా చేసుకోవలసిన సంబరాలు- 350 టన్నుల బరువైన బుద్ధమూర్తి అయిదున్నర కోట్ల ఖర్చుతో జలసమాధి పొందడంతో ముందే కళంక భరితమైపోయాయి. ఏటా యీ హుస్సేన్‌సాగర్‌లో వినాయకచవితి నవరాత్రుల తరువాత పెద్ద పెద్ద ఓ బొజ్జ గణపయ్య బొమ్మలను తీసుకొచ్చి నిమజ్జనం చేస్తూ వుంటారు. ఎంత పెద్ద బొమ్మయినా 100 కిలోల్లోపే ఉంటుంది. కానీ ఈ ఏకశిలా బుద్ధభగవానుడు 350 టన్నుల బరువు, 23 మీ. ఎత్తు. ఇంత పెద్ద, ఇంత ఘోర విగ్రహ నిమజ్జనం హుస్సేన్‌సాగర్‌లో ఇంతవరకు జరగలేదు. ఇక ముందెప్పుడూ జరగదు. ఎన్టీఆర్ లెక్క ప్రకారం ఆరుకోట్లమంది ఆంధ్రులున్నారనుకున్నా యీ ప్రాజెక్టుకు అయిన ఖర్చు తలకో రూపాయి అవుతుంది. దానికోసం 'వర్రీ' పడక్కరలేదు. కాని యీ పాషాణ విషాదాంతంలో అసువులు బాసిన సామాన్యుల అకాల మరణ నేరం ఎవరూ పంచుకోలేరు. ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్-ట్రాజెడీగా మారిపోయిన యీ పాషాణ ప్రాజెక్ట్ వైఫల్యంమీద న్యాయ విచారణకు ఉత్తర్వు చేసింది. అదే విచారణకు- యీ ప్రాజెక్టుకు బాధ్యత తీసుకున్న 'ఎ.బి.సి. ఇండియా' సంస్థ, తదితర వర్గాలతోపాటు ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ కూడా నిందితుల జాబితాలో చేతులు కట్టుకుని నిలబడ్డప్పుడే యీ 'మహా పాషాణమూర్తి' క్రింద పడి నలిగిపోయిన నిర్దోషులకి ఆత్మ శాంతి లభిస్తుంది. ఆకాశమంత మనుష్యులు, కొండంత మనుషులు తమ తమ పేర్లు శిలాఫలకాల మీద చెక్కించుకొని ముందు తరాల దృష్టిలో అభినవ అశోక చక్రవర్తులనిపించుకోవటంకోసం వారి తలకు మించిన బరువు నెత్తుకొని అతి విషాద, విచిత్రమైన యీ సంఘటనకి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను కూడా కారణభూతులైనారు.

అసలు "రాయి" ఖరీదు 80 లక్షల రూపాయలు. దాన్ని నల్గొండ జిల్లాలోని 'రాయగిరి' నుంచి 'బండయాత్ర' చేయించుకొంటూ రాజధానికి లాక్కురావడానికి అయిన ఖర్చు దానికి రెట్టింపుకన్నా ఎక్కువ. కోటి డెబ్బై లక్షలట. దాన్ని టాంకు బండ్‌మీద

హుస్సేన్‌సాగర్ 'రాక్' ట్రాజెడీ !

అడ్డంగా పడుకోబెట్టి అనంతశయనస్వామి ఫక్కీలో శయన బౌద్ధ విగ్రహంగా చెక్కించినా బాగుండేపోయేది. కలుషిత జలాలకు పేరుగాంచిన హుస్సేన్‌సాగర్‌లో ఒక దిమ్మ కట్టి, నిటారుగా నిలబెట్టాలనుకొని కట్టిన జిబ్రాల్టర్ ప్లాట్‌ఫారం ఖరీదు 2 కోట్ల 32 లక్షలు. అహింసామూర్తి పేరిట యించుమించు రెండు సంవత్సరాలు పైబడి కొనసాగిన యీ పాషాణ పథకం నిష్కారణ నరబలి కోరింది. ఇలాంటి వ్యవహారాలని చూస్తున్నప్పుడే "బుద్ధదేవుని భూమిలోన పుట్టినావు, సహజమైన ప్రేమ నీలోనే చచ్చెనేమి?" అన్న కరుణశ్రీ పాట జ్ఞాపకానికి వస్తోంది. శివధనస్సునెత్తుకోలేక వెల్లకితలా పడ్డ రావణాసురిడి చందాన వున్న ప్రభుత్వ వ్యవస్థను చూసి నవ్వాలో, యేడ్వాలో తెలియటం లేదు. అసువులు బాసిన నిర్దోషుల కుటుంబాలకి ప్రపంచవ్యాప్తంగా సానుభూతి లభిస్తుంది. కానీ చెరువులో శయ్యాగతుడైన పాషాణ తథాగతునికి- కలుషిత జలసమాధి నుంచి విముక్తి ఎప్పుడు? రికార్డుబుక్స్‌లో చోటు దొరికేదెప్పుడు- మళ్లీ ఆ ప్రాజెక్టు(?)లో నలిగే అభాగ్యులెందరు?-

(11-3-90) *

కలియుగ ప్రారంభాదిగా


—అన్నంరాజు

మనకు చైత్ర శుద్ధపాడ్యమినాడు ప్రతి సంవత్సరం సంవత్సరాది పండుగ.

దీనినే ఉగాది పండగ అని కూడా అంటున్నాము. "యుగాది" పదము యొక్క రూపాంతరమే "ఉగాది". యుగమునకు ఆది కనుక యుగాది అనబడినది. ఈ దినము ప్రస్తుతము జరుగుచున్న కలియుగ ప్రారంభ దినముగా చెప్పుదురు.

శ్రీకృష్ణుడు ద్వాపరయుగము చివర భాగంలోని వాడు. ఆయన 125 సం. 7మా. 8 దినములు జీవించెనని చరిత్రకారులు నిర్ణయించారు. ఆయన జీవిత పరిసమాప్తియే ద్వాపరయుగాంతము. ఆ మరునాడు కలియుగ ప్రారంభ దినము. శ్రీకృష్ణ నిర్యాణము తరువాత అనగా కలియుగారంభ కాలములో ధర్మరాజు పరిపాలనము కొనసాగినది. ఆ తరువాత పరీక్షిన్మహారాజు కలిపురుషుని పారద్రోలి ధర్మము నాలుగు పాదముల నడపెనుట జగద్విదితము.

కలియుగ ప్రమాణము 4,32,000 సంవత్సరములు. అందు ప్రథమ పాదము 1,08,000 సం.లు. ప్రథమ పాదములో ఇప్పటికి జరిగిన కాలము 5090 సం.లు మాత్రమే. ఇప్పటి ప్రమోదూత సంవత్సరము 5091వది. మన భారతీయ కాలగణనమును గుర్తించక 5 వేల సంవత్సరములనాడే మానవుడు పుట్టెనని పాశ్చాత్య చరిత్రకారులు కొందరు వాకొనుటయు, పాశ్చాత్య వ్యామోహమున తేలియాడుచున్న కొందరు భారతీయ చరిత్రకారులు దానిని ఆమోదించుటయు జరుగుచున్నది. ప్రాచీన స్వీయ సిద్ధాంతమును అంగీకరింపకుండుట, ఆత్మగౌరవమును చంపుకొనుటయే!



భారతీయ కాలగణనము సరియైనదని సహృదయులగు పాశ్చాత్య చరిత్రకారులు ఆమోదించియుండుట మనం గమనించదగియున్నది. "ఈ కలియుగ ప్రారంభ కాలాన్ని ప్రఖ్యాత ఫ్రెంచి జ్యోతిష్కుడైన 'లాకైవా' ఆధునిక సైన్సు లెక్కలపై గణితం చేసి కలియుగం ఫిబ్రవరి 18న క్రీ.పూ. 3102 గురువారం రాత్రి గం. 2-30 ని.కు ప్రారంభమైనదని ఋజువు చేసినట్లు డా. వేదవ్యాస్ తెలిపారు." (ఆంధ్రపత్రిక 1989 జూన్ 1వ తేదీ).

క్రీ. పూ. 3102+క్రీ.శ 1989=5091 సం.లు. కనుక కలియుగం ప్రారంభమై 5091 సం. అయినట్లు ధృవపడుచున్నది. సహృదయులగు పాశ్చాత్య చరిత్రకారులు, జ్యోతిష్కులు చేసిన గణనమునకున్నూ, అనూచానంగా వస్తున్న భారతీయ పంచాంగ గణనమునకున్నూ సరిపోయినది గదా! ప్రమోదూత నామ సంవత్సర పంచాంగములలో "కలిగతాబ్దాః 5091" అనియుండుట గమనార్హము.

వర్తమాన కాలంలో ప్రపంచమందంతట ఏకీకృతంగా నున్న సంవత్సరాది జనవరి ఒకటవ తేదీ. కాని ప్రపంచంలోని అన్ని దేశాలలో వారి వారి సాంప్రదాయమును బట్టి ఉగాది పండుగ వేరు వేరు దినములలో జరుపుకొంటున్నారు.

మన భారతదేశంలోనే అయిదు విధములగు వత్సరమానములు అమలునందున్నవి.

1. చాంద్రమానవత్సరము: చైత్రశుద్ధ పాడ్యమి నుండి 12 మాసములు లెక్కింపబడుచున్నవి. ఇందు 354 దినములుండును.

2. సౌరమానవత్సరము: సూర్యుడు మేషరాశిలో ప్రవేశించినదాది 12 రాసులు 12 మాసములుగా లెక్కింపబడుచున్నది. దీనియందు 365 దినములుండును.

3. బార్హస్పత్యమానవత్సరము: మేషాదిరాశుల యందు బృహస్పతి (గురువు- నక్షత్రము) గమనమునమసరించి గణించునది. దీనిలో 361 దినములుండును.

4. సావనమానవత్సరము: నెలకు 30 దినముల వంతున లెక్కింతురు. ఈ సంవత్సరమునందు 360 దినములుండును. యుగమన్వంతాది విభాగక్రమము తెలుసుకొనుటకుపయోగించును.

5. నాక్షత్రమానవత్సరము: అశ్వని మొదలగు 27 నక్షత్రముల యందు చంద్రుని గతిననుసరించి లెక్కింపబడును. ఈ 12 మాసములలో 324 దినములు మాత్రముండును.

కాని విస్తారంగా మనదేశంలో అనుసరించుచున్నవి మొదటి మూడు మానములు.

"అస్మిన్ దేశేలోకవ్యవహారార్థం చాంద్రమానాబ్దోగ్రాహ్యః, శేషాచలస్య దక్షిణదేశే సౌరమానాబ్దోగ్రాహ్యః, వింధ్యస్యోత్తర దేశే బార్హస్పత్యమానాబ్దో గ్రాహ్యః"-

తిరుమల-తిరుపతి కొండలు, వింధ్య పర్వతములు, హిమాలయ పర్వతములు సరిహద్దులుగా మన పూర్వులు గైకొనిరి. తిరుపతి కొండలకు దక్షిణముననున్న దేశమున సౌరమానము, వింధ్య-హిమాలయములకు మధ్యనున్న ఉత్తరహిందూ దేశమునందు బార్హస్పత్యమానము, తిరుపతి కొండలు-వింధ్య పర్వతములకు మధ్య నున్న మన ప్రాంతమునందు చాంద్రమానము వ్యవహరింపబడుతున్నది.

భూమి, సూర్యుని చుట్టివచ్చుటకు 365 దినముల 6 గంటలు పట్టుచుండుటచే 4 సంవత్సరముల కొకరోజు (4 X 6గం=24గం.) ఫిబ్రవరి నెలకు కలిపి 29 దినములు (లీపు సంవత్సరము) ఏర్పరచి లెక్కకు సరిపెట్టుకొనుచున్నారు. అప్పటికిని నిమిషములు మిగిలిపోవుచునే యున్నవట. అట్లే చాంద్రమానములో దినములు తక్కువ అగుచుండుటచే మూడు సంవత్సరములకొక అధిక మాసమును నిర్ణయించుకొని చాంద్ర-సౌరమానాబ్దములను క్రమపరచుచున్నారు. సూర్య సంక్రమణము జరుగని నెల అధికమాసమగును.

మన ఉగాది పండుగ వెళ్లిన సుమారు వారం, పదిరోజులకు దాక్షిణాత్యులకు ఉగాది పండుగ వచ్చును. అదియే సూర్యుడు మేష రాశియందు ప్రవేశించు దినము-ఆనాటి నుండి వారికి ప్రమోదూతనామ సంవత్సరము! బార్హస్పత్యమానమునుసరించి ప్రస్తుతము వృషనామసంవత్సరము జరుగుచున్నది.

వస్తున్న పండుగ ఉగాది!

సత్యనారాయణరావు

దీని తరువాత చిత్రభానువత్సరము ఉత్తరదేశమున వ్యవహరింపబడును.

ప్రతి సంవత్సరము ఇంగ్లీషు క్యాలెండరు ప్రకారము జనవరి 14వ తేదీన, భారతీయ గణకమునననుసరించి అగు మకర సంక్రమణము జరుగుటను బట్టి ప్రాచ్య పాశ్చాత్య గణకము లేకీభవించుట గమనింపవలసి యున్నది.

ఉగాది విధులు

ఉగాదినాడు మనకు కొన్ని విధులు సాంప్రదాయసిద్ధంగా వున్నవి.

"బ్రాహ్మీముహూర్తే ఉత్థాయ, దంతధావన పూర్వకం, స్నానాది విధివత్కృర్యాత్ వర్ణాచార సారతః, వస్త్రై రా భరణై ర్దేహ మలం కృత్య తతశ్శుచిః, విఘ్నేశం భారతీం ఖేటాన్ దైవజ్ఞం బ్రాహ్మణాన్ గురుం సంపూజ్య, వత్సరఫలం శ్రుత్వా సమ్యక్ ఫలం లభేత్-"

"చైత్ర శుక్ల ప్రతిపత్తిధిః వత్సరాదిః తైలాభ్యంగనం, నూతన వస్త్రధారణం, నింబ కుసుమ భక్షణం, పంచాంగ శ్రవణం, ప్రపాదానం, వసంతనవరాత్రారంభః"

సంవత్సరాది పండుగనాడు తెల్లవారు జామున 4 గంటలకు సూర్యోదయమునకు ముందు (5 ఘడియలు=2 గంటలు వేళ బ్రాహ్మీముహూర్తము, 3 ఘడియలు =1 గంట 12 నిమిషములు ముందు ప్రాతఃకాలము) నిద్రలేచి, కాలకృత్యములు తీర్చుకొనవలయును. తలంటుస్నానము చేయవలెను. తమ తమ ఆచారము, సాంప్రదాయముననుసరించి క్రొత్త బట్టలను ధరించి, ఆభరణములుమున్నగు వానితో అలంకరించుకొనవలెను. శుచియై విఘ్నేశ్వరుని, సరస్వతీదేవిని, దైవజ్ఞులను, బ్రాహ్మణులను, గురువులను పెద్దలను పూజించవలెను, గౌరవించవలెను. వేప పూవు ప్రసాదమును భక్షించవలెను. పంచాంగ శ్రవణము చేయవలెను. ఉగాదినాడు వేపపూవు, చెఱకు ముక్కలు, మామిడి కాయముక్కలు కలిసిన ప్రసాదమును తీసికొనుట మన ఆచారము. వేప పూవు-చేదు, చెఱకుముక్కలు లేక బెల్లం-తీపి, మామిడి ముక్కలు-పులుపు ఇవి మూడును రుచులకు ప్రతీక-జీవితములో సుఖ దుఃఖములు, కష్టసుఖములు, మంచిచెడ్డలు సహజముగ నుండునని, వాటిని మనము సమదృష్టితో స్వీకరించవలెనని ఇది సూచించును. అంతేగాక, శాస్త్రవిజ్ఞానం (Science) ప్రకారము శరీరానికి (చేదు) వేప ఆరోగ్య రక్షణమునకు ఉపకరించును.

ధర్మ చలివేంద్ర ప్రారంభించవలెనని, బాటసారులకుగాని తదితరులకుగాని మంచినీటిని అందించవలెనని ఆర్య మతము.

చైత్ర శుద్ధపాడ్యమి నుండి వసంత ఋతువు ప్రారంభమగును. వసంతనవరాత్ర ఉత్సవములు తొమ్మిది దినముల పాటు చేయుచుందురు. ఈ ఉత్సవములు ఈ పాడ్యమి నుండి శ్రీరామ నవమి వరకు చేయుట ఆచారము. అవి యీనాడు ప్రారంభించవలెను.

ముఖ్య కార్యక్రమాలు

పంచాంగ శ్రవణము ఉగాది నాటి కార్యక్రమములలో ముఖ్యమైనది-తిథి, వార, నక్షత్ర, యోగ, కరణములు పంచాంగములు. వీనిని గూర్చి తెలియజెప్పునది పంచాంగము. ఉగాది నాటి సాయంకాలము ఒక దేవాలయమునందుగాని, సత్రమునందుగాని, పదిమంది చేరుతావులందు పంచాంగ శ్రవణము జరుపుట తెలుగునాట ఆచారము.

ఆ సంవత్సరమునకు రాజు, మంత్రి, సేనాధిపతి మున్నగు పాలకవర్గము, వారు నిర్వహించు శాఖలు, వారి వలన దేశానికి, ప్రజలకు-సామూహికంగాను, వ్యక్తిగతముగాను కలుగనున్న మంచిచెడ్డలు, వర్షప్రమాణము, ఆదాయ వ్యయములు, కందాయ ఫలములు, కటక సంక్రమణము-దాని ఫలితములు, గ్రహణములు, వస్తు విక్రయధరలు, గోచార ఫలములు, మూఢమియగు కాలములు, శుభ ముహూర్తములు మున్నగు విషయములు ప్రతి యొక్కరు తెలుసుకొందురు. యధాశక్తిగా దక్షిణ తాంబూలములను దైవజ్ఞునకు సమర్పింతురు. అబాల వృద్ధము ఎనలేని ఆనందమునననుభవింతురు.

ఉగాది పర్వదినమున పంచాంగ శ్రవణం చేసిన వారికి ఫలితం ఈ క్రింది విధముగా చెప్పబడినది.

శ్లో. శ్రీ కల్యాణ గుణావహం, రిపుహరం, దుస్స్వప్నదోషాపహం
గంగాస్నాన విశేష పుణ్యఫలదం, గోదానతుల్యం నృణాం
ఆయుర్వృద్ధిదముత్తమం, శుభకరం, సంతాన సంపత్ప్రదం
నానాకర్మసుసాధనం సముచితం పంచాంగమాకర్ణ్యతామ్!!

భావము: శుభప్రదమైన, కల్యాణప్రదమైన సద్గుణములను కలిగియుండునట్లు చేయును. శత్రువులను నశింపజేయును. చెడు కలల యొక్క దోషముహరించును. గంగానదియందు స్నానమాచరించినంత పుణ్యమునిచ్చును. గోదానమును చేసినంత ఫలితము నొసగును. ఆయుర్దాయమును పెంచును. శ్రేష్ఠత్వమునొందించును. శుభములనిచ్చును. సత్సంతానమును, సంపదను కలిగించును. అనేక విధములగు మంచి పనులను నెరవేర్చుకొనుటకు సాధనమైయుండును.

ఇంతవరకు మనకు చాంద్రమాన శుక్ల సంవత్సరము అమలునందుండి ఈ ఉగాది నుండి ప్రమోదూత సంవత్సరము జరుగనున్నదిగదా! గడచిపోవు సంవత్సరమునకు వీడ్కోలు జెప్పి, రానున్న సంవత్సరమునకు స్వాగతము పలుకుట కూడ మనకు ఆచారమే.

గతుల తారుమారుగజేసి గడచిపోవు
వత్సరముశుక్ల! వీడ్కోలు ప్రణతులివియే;
మోద మొసగు ప్రమోదూత! సాదరమిదు
స్వాగతము గొనుమమ్మ సుస్వాగతమ్ము!!



కె.వి. రమణమూర్తి

ప్రొద్దున్నే పేపర్ చూడడం నాకలవాటు. మూడేళ్ళ బట్టి అది నిత్యావసరమై పోయింది. ఎందుకంటే నేను డిగ్రీ పుచ్చుకుని మూడేళ్ళు కావస్తోంది.

ఉదయాన్నే కాఫీ తాగి, కుర్చీలో కూర్చుని, పేపర్ వచ్చిన వెంటనే 'వాంటెడ్ కాలమ్స్' చూడడం, ఏవైనా ఉద్యోగ ప్రకటనలు వుంటే, ఆశగా అప్లయి చేయడం, ఇంటర్వ్యూలకి పిలుపు వస్తే వెళ్ళడం, ఉద్యోగం రాకపోవడం నిరాశా, మళ్ళీ ఆశగా పేపర్ చూడడం అలవాటయి, దినచర్యలో ఒక భాగమయిపోయింది.

ఇవాళ 8 గంటలైనా పేపర్‌వాడు రాలేదు. రోజూ 6 గంటలవంగానే, తలుపు కొట్టి పేపర్ ఇచ్చి వెళ్తాడు. నాకంటే వాడే నయం. హాయిగా సంపాదించుకుంటున్నాడు. మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన నేను ఇటువంటి పనులు చేయలేను. ఎంత ప్రయత్నించినా నాకు తగిన ఉద్యోగం దొరకట్లేదు. ఉద్యోగానికి అప్లయి చేయాలన్నా, డబ్బు కోసం మా నాన్నని అడగాల్సిందే. ఆయనా పెద్ద జీతగాడు కాదు. నా తరువాత పెళ్ళి కావాల్సిన ఆడపిల్లలు నలుగురున్నారు. ఈ వయసులో కుటుంబ బరువు బాధ్యతలు వహించాల్సింది పోయి, ఆయననే అడిగి తీసుకోవడం చాలా సిగ్గుగా ఉంది.

"సార్, పేపర్"

ఉలిక్కిపడి ఆలోచనల్లోంచి బయటపడి పేపరందుకున్నాను. అలవాటుగా కళ్ళు 'వాంటెడ్ కాలమ్స్' వెంబడి పరిగెట్టాయి. ఓ మూలగా బాక్స్ కట్టిన ప్రకటన నన్నాకర్షించింది. "ఉద్యోగం లేక బాధ పడుతున్నారా? కొత్తగా పెట్టిన మా కంపెనీలో గుమాస్తాలుగా, ఆఫీసర్లుగా పని చేయుటకు ఉత్సాహ వంతులైన యువతీ యువకుల నుండి దర కాస్తులు కోర బడుతున్నవి. ఇంటర్మీడియెట్, డిగ్రీ చదివినవారు అప్లయి చేయండి. అప్లికేషన్‌తో బాటు రూ. 10 ఎం. ఓ. చేయండి".

ప్రకటన చూడంగానే ఉద్యోగం వచ్చినంత సంబరం వేసింది. మళ్ళీ ఉత్సాహం నీరుకారిపోయింది ట్రూ కాపీల కోసం డబ్బులు, సంతకాల కోసం ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణాలు, అక్కడి ఉద్యోగస్తులు చూపే నిరాదరణ గుర్తుకు వచ్చి. కాని వాళ్ళడిగిన అన్ని అర్హతలూ నాకున్నాయి. అప్లయి చేస్తే రాకపోదు.



* * * *

అప్లికేషన్ పెట్టి ఇరవై రోజులు అయింది. ఇంకా జవాబు రాలేదని పడక్కుర్చీలో కూర్చుని ఆలోచిస్తున్నాను. బయట ఎండ నిప్పులు చెరుగుతోంది అసమర్థుడి కోపంలాగా. మళ్ళీ ఆలోచనల్లోకి జారిపోయాను. పంచరంగుల స్వప్నాలు... ఉద్యోగం వచ్చినట్టూ, కష్టాలు తీరి సుఖంగా ఉన్నట్టూ.

"పోస్ట్"


పోస్ట్‌మన్ కేకతో తెలివి వచ్చింది. అతని కోసం చూస్తే తిరిగి వెళ్ళిపోతూ కనిపించాడు. క్రింద పడిన కవరు తీసి చూశాను. అడ్రస్ నా చేతి రాతే. సందేహంలేదు అది నేను అప్లికేషన్‌లో పంపిన కవరు. చించి చదివాను.

"మిస్టర్ రఘూ,

ఈ దేశంలో మీలాంటివారు చాలామంది ఉన్నారు. మాకు పదివేల అప్లికేషన్స్ వచ్చాయి. ఒకప్పుడు మేమూ మీలాంటి వారమే! ఆకలి, సంసార బాధ్యతలు మమ్మల్ని ఇలాంటి పనికి పురికొల్పాయి. మాకు ఇప్పుడు వచ్చిన మొత్తం డబ్బు లక్ష రూపాయలు. ఈ కంపెనీ ఎత్తేసి మరొక రాష్ట్రంలో పెడతాము. రిపోర్ట్ ఇవ్వడానికి ప్రయత్నించకండి. ఇప్పటికైనా తెలిసింది కదూ డబ్బు ఎలా సంపాదించాలో?"

"........"

సంతకం లేదు కింద. మోసం చేశారు. పిచ్చిగా నవ్వుకున్నాను. నేను పోగొట్టుకుంది పది రూపాయలే! కానీ ఈ దేశంలో కొంతమంది స్త్రీలు తమ శీలాన్ని కూడా పోగొట్టుకుంటున్నారు ఉద్యోగాల కోసం. కాని ఒకటే సందేహం; వాళ్ళు చెప్పినట్టు నేనెప్పటికైనా చేయగలనా అని!



వాత్సల్యపూర్ణ
హృదయానికే తెలుసు
బాబుకు
ఏం కావాలని!
Complan
పిల్లలు, ముఖ్యంగా శ్రమపడి, శ్రద్ధగా చదువుకోవాల్సిన సమయంలో ఆరోగ్యంగా, బలంగా వుండడం ఎంతో అవసరం. కాంప్లాన్‌లో 20% ప్రోటీన్లు—అత్యంత శ్రేష్ఠమైన పాల ప్రోటీన్లు కలవు.
వారికి కావలసిన పోషణను అందించే కార్బొహైడ్రేట్లు, క్రొవ్వు పదార్థాలు, విటమిన్లు మరియు ఖనిజపదార్థాలు మున్నగు 22 ఇతర అత్యావశ్యక ఆహారపదార్థాలను కూడా కల్గివున్నది కాంప్లాన్. నేటి నుంచే మీ పిల్లలకు రోజుకు రెండుసార్లు చొప్పున, ప్రతిరోజా కాంప్లాన్ ఇవ్వడం మొదలెట్టండి.
Complan
23
అత్యావశ్యక
పోషకాహారాలు
ఆరోగ్యబద్ధమైన పాళ్లలో
పాలు కలపనవసరం లేదు.
కాంప్లాన్®
సంపూర్ణంగా ఆరోగ్యబద్ధమైన ఆహారం.

GX/59/234 TEL



సీరియల్

సూపర్ హీరో



మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

దమయంతి మనసు మనసులో లేదు.

అలా అనిపించడం ఇదే మొదటి సారి ఆమెకు.

దిక్కుతోచనట్లు ఇల్లంతా కలయ తిరుగుతుంటే తమ్ముళ్లు, చెల్లెళ్లు వింతగా చూసారు.

వాళ్ళ చూపులకి దొరక్కూడదని పిలిచిన వాళ్ళనే మళ్ళీ పిలిచి నవ్వుతూ మాట్లాడింది. ముద్దులు పెట్టుకొంది. అక్క ప్రవర్తనకి ఆశ్చర్యపోతున్నారు వాళ్ళు.

"మన కుక్కపిల్ల జానీ ముద్దుగా వుంటుంది కదూ!" అనడిగింది ఆరోజే చూసినట్లుగా.

వాళ్లు అమాయికంగా చూశారు.

నిజానికి వాళ్ళ నుండి జవాబును ఆశించలేదు కూడ ఆమె.

మనసంతా వద్దనుకొన్నా సుధీరే నిండి పోతున్నాడు.

ఎందుకని?

తనుఎంతో మందితో నటించింది. ఎన్నెన్నో ప్రేమ సన్నివేశాల్లో నటనలో జీవించినట్లు నటించింది.

లైట్స్ ఆన్, ఫాన్స్ ఆఫ్ యాక్షన్ అనగానే ఆ పాత్రలో తాదాత్మ్యం చెంది నటించింది.

ఎంతో మంది హీరోలు తనకు తెలుసు!

కాని....సుధీర్‌తో నటిస్తుంటే అతని కళ్ల లోకి కళ్లు పెట్టి చూడలేకపోయింది.

అతను ముట్టుకుంటే ఒడలంతా పులకంచింది.

'అయ్ లౌయూ!' అంటే అది డైలాగ్‌లాగ కాక తనతో నిజంగా చెబుతున్నట్లే అనిపించింది.

ఏమిటిది, ఎందుకిలా అనిపిస్తోంది!

ధనాధన్ అన్న పేరుని సాధించుకొన్న తను సుధీర్ పేరు వినగానే వేడిసోకిన మైనంలా కరిగి పోతున్నదేమిటి?

ఏం జరుగుతోంది!

సుధీర్‌ని తను ప్రేమిస్తోందా!

సుధీర్ నిజంగానే తనని ఆరాధనగా చూస్తాడు.

ఆ కళ్లలో ప్రేమ తొణికిసలాడుతుంది.

తామిద్దరం కలిస్తే.....?

"అమ్మగారూ!"

దమయంతి ఆలోచనా స్రవంతికి ఆనకట్ట పడింది.

కోకిల నిలబడి వుందక్కడ.

"రాయుడు గారొచ్చేరమ్మా!"

దమయంతి విసుగ్గా చూసి "లేనని చెప్పలేకపోయేవా?"

"ఉన్నారని చెప్పేసేనమ్మా!"

"సర్లే! ఈసారి రాయుడు గారొస్తే నన్నగడక్కర్లేదు, లేనని చెప్పేసెయ్!" అంటూ హాల్లోకి నడిచింది దమయంతి.

"నమస్కారమమ్మా! మా సంగతి ఏం చేసేరు?" అన్నాడు రాయుడు.

దమయంతి చిరునవ్వుకొని తెచ్చుకొని "మా కోకిలని హీరోయిన్‌గా బుక్ చేసుకుంటానన్నారుగా!" అంది.

"మీరీసారి కాదంటే ఆపనే చేయాల్సి వస్తుంది- జోక్ కాదు. విజయేంద్ర కూడ కాల్షీట్సు ఇచ్చేడు. మీదే ఆలస్యం" అన్నాడు రాయుడు.

దమయంతికి విషయం అర్థమయ్యింది.

ఒకప్పుడు చిన్న పోర్షను అడిగితే తను కాస్తరంగు తక్కువగా ఉంటుందని "మా స్టూడియోలో మేకప్ డబ్బాలన్నీ అయిపోతాయి తల్లీ!" అని అవహేళన చేసిన రాయుడు విజయేంద్ర వలన తన కాల్షీట్సు కోసం పిచ్చికుక్కలా తిరుగుతున్నాడు. ఇప్పుడు తనుకాదంటే విజయేంద్ర కూడ నటించడు.

"ఏంటి తల్లీ ఆలోచిస్తున్నావు? రేటు హీరోయిన్‌తో సమానంగా ఇస్తాను 'ఊ' అను" అన్నాడు రాయుడు ఎక్కడలేని ఓర్పు తెచ్చుకొని.

"మీరు డబ్బిస్తానంటే కాల్షీట్లు సర్దగలనా?" అంది ఆలోచిస్తూ.

"పోనీ ఇంకేమైనా కండిషన్స్ ఉన్నా చెప్పు తల్లీ!"

"కుదరదులెండి"

"కుదుర్చుకొంటాను" అన్నాడు రాయుడు సహనంగా.

"సుధీర్‌ని హీరోగా బుక్ చేయండి"

రాయుడు దమయంతి మాటలకి నోరు తెరిచేడు తెల్లబోతూ.

"విజయేంద్ర మిమ్మల్ని హీరోయిన్‌గా గాని ముఖ్యమైన కీలకమైన పాత్రలోకాని బుక్ చేయమంటే-మీరు సుధీర్‌ని హీరోగా బుక్ చేయమని అడుగుతున్నారు. ఇదెక్కడి ధర్మం తల్లీ!" అన్నాడు బాధపడిపోతూ.

"అది ఆయనిష్టం-ఇది నా ఇష్టం. ఎవరిష్టాల్ని వాళ్లు ప్రకటించడంలో తప్పేముంది?" అంది దమయంతి ఖచ్చితంగా.

రాయుడు కొద్ది సేపు మాట్లాడలేక సోఫాలో ప్రాణం పోయినట్లు కూర్చున్నాడు.

"ఇప్పుడే, ఇక్కడే మీ నిర్ణయాలు చెప్పనవసరం లేదు. బాగా ఆలోచించుకోండి.

<u>ఇంతవరకూ సాగినకథ -: 9</u> కాంట్రాక్టరు గోపాలరావుతో వివాహమై మనస్పర్థలు కారణంగా విడిపోయిన ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నిఖిలేశ్వరి అనతికాలంలోనే బిజీ హీరో అయిన తన కొడుకు విజయేంద్ర విజయాలను చూసి మురిసిపోతుంటుంది. కుటుంబపోషణా భారం మీదపడి నటిగా మారిన దమయంతి సుధీర్‌కు సినిమా ఛాన్సు యిప్పిస్తుంది. స్టేట్స్ నుంచి వచ్చిన పీయూషను కలుసుకొనేందుకు విజయేంద్ర తహతహలాడుతుంటాడు. షూటింగ్ నిమిత్తం మద్రాసు వెళ్లిన విజయేంద్రను కలుసుకునేందుకు పీయూష-రజనిని తోడురమ్మంటుంది.

సుధీర్‌ని బుక్ చేస్తే నేను ఓ.కె." అంటూ సర్రున లోనికెళ్ళిపోయింది దమయంతి.

రాయుడు నిస్సత్తువగా లేచి వెళ్తుంటే డోర్ మూసింది కోకిల.

దమయంతి బెడ్ రూమ్‌లోకెళ్ళి వెంటనే-విజయేంద్రకి రింగ్ చేసింది.

విజయేంద్ర లైన్లోకి రాగానే జరిగిన సంగతంతా చెప్పింది దమయంతి.

"ఎందుకలా చేసేరు?" అనడిగేడు విజయేంద్ర ఆశ్చర్యంగా.

"కావాలనే. అతనెలామా సుధీర్‌ని బుక్ చేయడు. చేయలేదు. మీ కోసం నా దగ్గరకి వచ్చేడు. ఒకప్పుడు అతను చేసిన అవమానం నాకింకా గుర్తుంది. వేషం ఇవ్వకపోతే అది వేరే సంగతి. మాటలతో మనిషిని పాతాళంలోకి ఏ విధంగా కృంగతీయవచ్చో అతనికి బాగా తెలుసు. అందుకని!" అంది.

"సరే! దీని గురించి నేను ఏమీ అనుకోను. కాని రాయుడు పాములాంటి మనిషి. ఎక్కువగా అతనితో గొడవకి దిగడం మంచిది కాదు. రేపు నేను మద్రాసు బయల్దేరుతున్నాను" అన్నాడు విజయేంద్ర.

దమయంతి రిసీవర్ క్రెడిల్ చేసింది ఆలోచిస్తూ.

"అమ్మగారూ!"

దమయంతి కోకిల వైపు చూసింది.

"మీరు నిజంగానే రాయుడి సినిమాలో నటించరా!"

"నువ్వు నటిస్తావా?"

దమయంతి ప్రశ్నకి రక్కున నోరు మూసేసింది కోకిల.

తనంత కోపంగా మాట్లాడటం మంచి పద్ధతి కాదని కాస్త మొహంలోకి నవ్వు తెచ్చుకొని "నీకీ సినిమా రంగపు వ్యవహారాలు పూర్తిగా తెలియవు కోకిలా! ఆర్టిస్టుల చేత పని చేయించుకొని డబ్బు ఎగ్గొట్టే వాళ్ళు కొందరైతే-ఆర్టిస్టు పొలం పుట్రా అమ్మించి మింగేసి వాడి చేత అరువు చాకిరీ చేయించుకొని వాళ్ళని ఎడ్రస్‌లేకుండా చేసే వాళ్ళు కొందరు. దురదృష్టవశాత్తు వాళ్ళు సంఘంలో పెద్ద మనుషులుగా కీర్తింపబడుతుంటారు. నమ్మి ముందుకి నడిస్తే అన్నీ గోతులే!" అంది.

కోకిల జవాబు చెప్పలేదుకాస్సేపు.

అయిదు నిముషాల తర్వాత మెల్లిగా అంది "నేను....నేను అందుకే మా ఊరెళ్ళిపోవాలని నిశ్చయించుకొన్నాను. మీరు డబ్బిప్పిస్తే....."

"నిజంగానా?" ఆశ్చర్యంగా అడిగింది దమయంతి.

"నిజమే అమ్మగారూ! నేనీ రంగంలో నిలదొక్కుకోలేను. మా ఊళ్ళో మాది మంచి



కుటుంబమే! అన్నిటికీ చెడి ఇక్కడ దేనికి నేను!" అంది కోకిల.

"సరే! లెక్క చూసి ఇస్తాము" అంటూ లేచి డబ్బు తెచ్చి ఇచ్చింది దమయంతి.

కోకిల లెక్క చూసుకొంటుంటే "నీకివ్వాల్సిందానికన్నా ఎక్కువే ఇచ్చేను. జాగ్రత్తగా వెళ్ళు. కావాలంటే నేనొచ్చి రైలెక్కిస్తాను" అంది దమయంతి.

"వద్దమ్మా! నేను జాగ్రత్తగానే వెళ్తాను" అంటూ దమయంతికి నమస్కరించి, బట్టలు సర్దుకొని బయల్దేరింది కోకిల.

*** *** *** *** ***

జీన్స్ ప్యాంటు, టైట్ బనీను, విరబోసుకొన్న జుట్టు, చెవులకి ముడేసినట్లు కాటుకతో దిద్దిన కళ్ళు, ఎర్రగా కారుతున్నట్లు పెదవులకి లిప్‌స్టిక్ వేసుకొన్న కోకిలని మొదట గుర్తుపట్టలేకపోయేడు రాయుడు.

"నమస్కారమండి. నేను కోకిలని" అంది కోకిల.

"నమస్కారం. ఏంటిలా వచ్చేవు!" అన్నాడు రాయుడు విసుగ్గా.

"హీరోయిన్‌గా వేషం ఇస్తానన్నారుగా. అందుకే వచ్చేసేను. ఆ దమయంతికి నేనెక్కడ పైకొస్తానోనని కుళ్లు" అంది కోకిల అక్కసుగా.

రాయుడు నివ్వెరపోయేడు.

వెంటనే తేరుకొని "నువ్వు ముందు పైకి లే!" అన్నాడు కోపంగా. కోకిల భయంగా లేచి నిలబడింది.

"నీకు వేషమొకటే తక్కువ. పద బయటకి" అన్నాడు గుమ్మం వైపు వేలు పెట్టి చూపిస్తూ.

"మీరు....మీరే కదా మా అమ్మగారితో ఒకటికి రెండు సార్లు అన్నారు. మీ మాటలు నమ్మి పని మానేసి ఆవిడిచ్చిన జీతంతో ఈ బట్టలుకొనుక్కొని వచ్చేను. ఇప్పుడెక్కడికి పోవాలి!" అంది కోకిల ఏడుపు గొంతుతో.

"సరాసరి టేంక్ బండ్ కెళ్ళి హుస్సేన్ సాగర్‌లో దూకు. నీలాంటి వాళ్ళకి వేషాలివ్వడానికేనా నేను కంపెనీ పెట్టుకున్నాను? రేపొద్దున్న మీ అమ్మగారిలానే ఫోజులు కొడుదువుగాని!" అన్నాడు రాయుడు కసిగా.

కోకిల వస్తోన్న కన్నీళ్లు బలవంతాన ఆపుకొంటూ వీధిలో కొచ్చి నిలబడింది.

'ఇప్పుడేం చేయాలి! రాయుడు నిజంగానే అన్నాడనుకొని కొండంత ఆశలు పెట్టు. కొని దమయంతితో తెగతెంపులు చేసుకొనొచ్చింది. ఇప్పుడే మొహం పెట్టుకొని తిరిగి ఆ ఇంటికి వెళ్ళగలదు!'

వెంటనే ఆమెకు విజయేంద్ర గుర్తుకొచ్చేడు.

రోడ్ సైడ్ రోమియోలను హడలెత్తించే సంచిలో సర్పాలు !

పాము కనిపిస్తేనే చాలు ఒక అంగ వెనక్కి తీసుకుంటాం. అలాంటిది ఓ యువతి పాముల్ని హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుని తిరగడమంటే నిజంగా వింతలో వింతే. నమ్మేట్టు కూడా ఉండదు! కానీ కుమారి మంజూసింగ్ (28) తన హ్యాండ్ బేగ్‌లో ఎల్లవేళలా ఒక సర్పాన్ని వుంచుకుంటుందట. అమ్మాయిల్ని ఏడిపించే రోడ్ సైడ్ రోమియోలు ఆమె దరిదాపులకు కూడా వెళ్లరు. తను బేగ్‌లో వుంచుకోవడమే కాదు, ప్రతి అమ్మాయి తన హ్యాండ్‌బేగ్‌లో ఒక పాముని వుంచుకుంటే ఆకతాయి పిల్లల అఘాయిత్యాల నుంచి తమను తాము రక్షించుకోవచ్చు అని సలహా ఇస్తున్నారు మిస్ మంజూ.

కుమారి మంజూసింగ్ ప్రభుత్వంచే గుర్తింపబడిన హెర్పటాలజిస్ట్ (పాముల పరిశోధకురాలు.) ఆమె చేసిన సేవలకుగాను ప్రపంచ వన్యమృగ నిధినుంచి ఆమె గుర్తింపు పొందింది. ఆమె బొంబాయిలోని యునైటెడ్ డాటాబేస్ (యు.డి.ఐ)లో ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పని చేస్తున్నారు.

ఢిల్లీలో తన కనుభవానికి వచ్చిన ఒక సంఘటనే ఆమె పత్రికా విలేఖరులకు ఇలా తెలియజేశారు. ఆమె ప్రయాణిస్తున్న సమయంలో పిస్తోళ్లు చేతుల్లో వుంచుకుని కొందరు మోటారుసైకిళ్లపై వచ్చి ఓవర్ టేక్ చేసి ఆమెని అటకాయించి బేగ్ తెరవమని దబాయించారట. పర్సు తెరవడమే పాములు తొంగిచూసేసరికి దాడి చేయాలని వచ్చిన ఆ దుండగులు పిస్తోళ్ల క్రింద పడేసి ఒకటే దౌడు తీశారట.

కుమారి మంజుకి బేబీ మంజూగా వున్నప్పటినుంచే (4 ఏట నుంచి) పాములంటే ప్రాణమట. పెరిగి పెద్దయిన తరువాత ఉత్తరప్రదేశ్ అడవుల నుంచి పాముల్ని పట్టి వాటి గురించి అధ్యయనం చేయసాగారట. ఉత్తరప్రదేశ్‌లో పొలాల మధ్య తన తండ్రికి గల 22 గదుల స్వగృహంలో పలు రకాల పాములు కొన్ని బోనుల్లో, కొన్ని బయట స్వేచ్ఛగా తిరుగుతుంటాయట.

ఆమె 40సార్లు పాము కాటుకి గురై మూడుసార్లు హాస్పిటల్లో చేరాల్సి వచ్చింది. "మానవులు అనవసరంగా పాముల్ని చూసి భయపడతారు. ఒక కుక్కను పెంచగా లేనిది, ఒక పాముని ఎందుకు పెంచలేరు" అని ప్రశ్నిస్తున్నారు. పాముకి విషం అనేది

సూపర్ హీరో

అతను చెబితే ఏ ప్రొడ్యూసరయినా వింటాడు. దమయంతిని అతను బుక్ చేయమనబట్టేగా రాయుడు ఆవిడ ఇంటి చుట్టూ కాల్‌షీట్స్ కోసం కాళ్లరిగి పోయేట్లు తిరుగుతున్నాడు. దమయంతి తన కన్నా అందగత్తేం కాదు. విజయేంద్రే జయలతకి కూడా వేషాలిప్పిస్తున్నాడని కూడ విన్నది. అతనిప్పుడేం చెబితే అది చెల్లుతోంది. అతని దగ్గర కెళ్ళి మరోసారి బ్రతిమాలితే అతను జాలిపడకపోడు.'

అలా అనుకోగానే కోకిలకి బోల్డంత ధైర్యం కల్గింది.

వెంటనే ఆటో ఎక్కి విజయేంద్ర ఇంటికి చేరుకొంది కోకిల.

గూర్ఖాకి నచ్చచెప్పి లోపలికి అడుగు పెట్టేసరికి పి.ఏ. అడ్డం పడ్డాడు కోకిలకి.

కోకిల వేషం చూసేసరికి పి.ఏ. ప్రసాద్‌కి కొద్దిగా నవ్వొచ్చింది.

"ఏమ్మా, ఇలా వచ్చేవు. మీ అమ్మగారు పంపించిందా?" అన్నాడు కొద్దిగా వెటకారం మిళితమైన స్వరంతో.

"లేదు, నేనే వచ్చేను. విజయేంద్ర గారిని కలవాలి!" అంది కోకిల.

"ఇప్పుడా, ఆయన మద్రాసు బయల్దేరే హడావుడిలో వున్నారు. వీలుకుదర దు" అన్నాడు ప్రసాద్.

"ప్లీజ్, కొంచెం నేపేనండి. మా అమ్మగారు అర్జెంటుగా ఉన్నపళంగా ఉద్యోగం ఊడదీసి తరిమేసిందండీ!" అంది ఏడుపు గొంతు పెట్టి జాలిగా కోకిల.

"ఎందుకని?" ప్రసాద్ కొంచెం కుతూహలం ప్రకటించేడు.

"నిజం చెప్పమంటారా?"

"ఏం, అలవాటులేదా?"

"భలేవారు. నిజం చెప్పాలనే వచ్చేను. నాకేదైనా వేషం ఇప్పిస్తారా?" ఆశగా అడిగింది కోకిల.

"వేషానికేం, మా హీరోగారు తలచుకొంటే హీరోయిన్‌నే చేసేస్తారు. ఏంటి సంగతి?" అనడిగేడు పి.ఏ.

"రాయుడు గారొచ్చి మా అమ్మగారిని కాల్షీట్సు అడిగితే విజయేంద్రని తీసేసి సుధీ



ఆఫీసు టేబుల్ పై ఒక నాగుపాముతో
భారత యువ హెర్‌పటాలజిస్ట్ మంజాసింగ్

లేకపోతే అలాగే పెంచేవారేమో! ప్రాణమంటే అందరికీ తీపే!

"పాములకు బుర్రలేదు, జ్ఞాపకశక్తి లేదు, అలాంటప్పుడు అవి పగ పడతాయనుకోవడం మూఢత్వమే" అని ఆమె అభిప్రాయం. పాముల్ని రక్షించాల్సిన అవసరం ప్రభుత్వాన్కి ఎంతైనా ఉందంటున్నారు మిస్ మంజా.

ర్‌ని బుక్ చేస్తే ఇస్తానంది. ఆవిడని పైకి తీసుకు రావాలని ఆయన ఆరాట పడితే ఆ సుధీర్‌ని పైకి తీసుకురావాలని ఆవిడ తాపత్రయపడుతోంది. అది తప్పుకదా అన్నానని నన్ను వెంటనే బయటకి పొమ్మంది" అంది ఏడుపుగొంతుతో.

ప్రసాద్ ఆశ్చరయపోయేడా మాట విని దమయంతి మీద అకారణ ద్వేషముందతనికి.

"నిజంగానా, అంత పొగరు పట్టిందా మీ అమ్మగారికి!" అన్నాడు.

"పట్టదా మరి, మీ హీరో వున్న ప్రతి సినిమాలోనూ వేషం వేస్తుందాయె. ఆ మాట అన్నందుకు నాకీ గతి పట్టింది" అంది కోకిల బాధపడిపోతున్నట్లుగా.

ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకొన్నాడు ప్రసాద్.

"ఆయన బయల్దేరే హడావుడిలో వున్నారు. లోపల అతని ఫ్రెండ్ వున్నాడు. అయినా పంపిస్తాను. దమయంతి సంగతి పూర్తిగా చెప్పు! కావాలంటే ఏడ్చి మరీ చెప్పు. వేషం కూడ దొరుకుతుంది" అన్నాడు పి.ఏ.

తల ఊపింది కోకిల.

ప్రసాద్ అయిదు నిమిషాల్లో లోపల్నుండి తిరిగొచ్చి "రమ్మంటున్నారు. వెళ్లు. నే చెప్పింది గుర్తుంచుకో!" అన్నాడు.

కోకిల అలాగేనంటూ లోనికెళ్ళింది.

కోకిల వచ్చేసరికి విజయేంద్ర కరుణాకర్‌తో మాట్లాడుతున్నాడు.

కోకిల విజయేంద్రకి నమస్కరించి "నన్ను దమయంతి గారు తరిమేసేరు. నాకు మీరే గతి" అంది ఏడుపు గొంతుతో.

"ఎందుకని?" అన్నాడు విజయేంద్ర ఆశ్చర్యపోతూ.

"ఏం చెప్పమంటారు? ఈ మధ్య ఆవిడకి ఆ కొత్త నటుడు సుధీర్ పిచ్చి పట్టింది. మిమ్మల్ని తీసేసి అతన్ని హీరోగా బుక్ చేస్తేనే నటిస్తానని కండిషన్ పెడ్తోంది. ఉండలేక అలా చేయకూడదని అన్నందుకు నన్ను మెడ పట్టి బయటకి గెంటింది. నాకిప్పుడు బ్రతుకు తెరువు లేదు. తమరు నాకు ఏదైనా వేషం ఇప్పిస్తే నా బ్రతుకు నేను బ్రతుకుతాను. నాకు మీరే దిక్కు!" అంది కోకిల కన్నీళ్లు పెట్టుకొంటూ.

"నీకు ఇదివరకే చెప్పేను. నువ్వు తెరకు పనికిరావని. కావాలంటే డబ్బిస్తాను. వెంటనే మీ ఊరెళ్ళిపో!" అన్నాడు విజయేంద్ర విసుగ్గా.

"ఇంటికెళ్తే నన్ను చంపేస్తారు. నాకు మీరే దిక్కు. మీరు తలచుకొంటే ఏదో ఒక వేషం ఇప్పించగలరు. లేకపోతే నేనిక్కడే ఆత్మహత్య చేసుకోవాల్సి ఉంటుంది" అంది కోకిల దీనంగా.

విజయేంద్ర ఇబ్బందిగా మొహం పెట్టి ఏదో చెప్పబోతుండగా ఫోను రింగయింది.

అతను రిసీవర్ అందుకొని "హలో!" అన్నాడు.

"హలో నేను దమయంతిని" అంది అవతలి కంఠం.

"చెప్పండి" అన్నాడు విజయేంద్ర.

"రాయుడు వచ్చేడు. అతన్ని ఇబ్బంది పెట్టాలని నేను సుధీర్‌ని హీరోగా బుక్ చేయమని లేకపోతే నటించనని చెప్పేను. మీకు తెలుసుగా నన్నతను ఎంతో ఇన్సల్టు చేసేడు. పోతే మా ఇంట్లో కోకిల పనిమానేసి ఇంటికి వెళ్తానని చెప్పి రాయుడిగారి దగ్గరకెళ్ళి వేషం అడిగిందట. మీ దగ్గరకి గాని వస్తే మందలించి ఇంటికి పంపించండి" అని చెప్పింది దమయంతి.

"అలాగే" అంటూ ఫోను పెట్టేసి విజయేంద్ర కోకిల వైపు చూసి "మీ అమ్మగారు రమ్మంటున్నారు. ఇంటికెళ్ళు" అని చెప్పేడు.

"నేను వెళ్ళను. ఆవిడకి నేనెక్కడ హీరోయిన్ అయిపోతానో అని భయం. ఆవిడ దగ్గరిక ఛస్తే పని చేయను" అంది కోకిల స్థిరమైన కంఠస్వరంతో.

విజయేంద్ర ఆమె వైపు అసహనంగా చూసి "నీ మీద నీకు చాలా గొప్ప నమ్మకమున్నట్లుంది. వెళ్ళి నీ అంతట నువ్వే ప్రయత్నించుకో. ఒకరి ఉప్పు తిని చాడీలు చెప్పడం మానుకో. దాని వలన నీకే నష్టం వెళ్లు" అన్నాడు కోపంగా.

కోకిల కోపంగా బయటకి వెళ్ళిపోయింది

కరుణాకర్ కూడ లేచి నిలబడ్డాడు వెళ్తానంటూ.

విజయేంద్ర తలూపేడు సరే అన్నట్లుగా.

కరుణాకర్ బయటకొచ్చి చుట్టూ చూశాడు.

కోకిల నిలబడి వుందక్కడ. గబగబా ఆమె దగ్గరకి వెళ్ళి "నువ్వు నిజంగానే వేషం వేస్తావా?" అనడిగేడు.

"మీరు ప్రొడ్యూసరా?" ఆత్రంగా అడిగింది కోకిల.

"ఒక విధంగా అంతే! కాకపోతే మావి వీడియో సినిమాలు" అన్నాడు కరుణాకర్.

"వీడియో సినిమాలా?" అంది కోకిల

నిరుత్సాహంగా.

"వీడియో సినిమాలా అని చప్పరించేమకు. వీటికి ఫారిన్ కంట్రీస్‌లో కూడ యమ గిరాకీ వుంది. నువ్వు తారగా విదేశాల్లో కూడ తెలిసిపోతావు. అదృష్టం కలిసొస్తే వాళ్లు కూడ నిన్ను బుక్ చేసుకుంటారు" అన్నాడు కరుణాకర్.

"నిజంగానా?" ఆశగా అడిగింది కోకిల.

"ప్రామిస్. ఇష్టమైతే చెప్పు. నా దగ్గర తారలు లేక కాదు. బోల్డంత కాంపిటీషన్ వుంది. అయితే నటి కావాలని నువ్వు పడుతున్న ఆశ చూసి జాలిపడి చెబుతున్నాను" అన్నాడు కరుణాకర్ జాలి చూపిస్తూ.

"ఇష్టమే! హీరోయిన్ ఇస్తారా?"

"హీరోయినే! సినిమా అంతా నువ్వే వుంటావు"

కోకిల కళ్లు మెరిసేయి.

"ఎప్పుడు తీస్తారు సినిమా?" అనడిగింది.

"చెబుతాను. దానికి కొన్ని టెర్మ్స్ ఎండ్ కండిషన్స్ వున్నాయి నాతోరా ముందు" అంటూ ఆటో ఎక్కేడు కరుణాకర్.

కోకిల కూడ ఆటో ఎక్కగానే ఆటో కదిలిపోయింది.

15

"ప్రేమంటే ఏమిటి?" ఫ్లయిట్ మద్రాసు వైపు వెళ్తోంటే అడిగింది రజని.

పీయూష కళ్ళెగరేసి నవ్వి "ఏం కథ! అందులో కాని పడ్డావా?" అనడిగింది.

"లేదు. నువ్వు పడ్డావుగా. తెలుసుకుందామని!" అనడిగింది రజని నవ్వుతూ.

"అబద్ధం చెబుతున్నావు. ఏదో వుంది కథ!" అంది పీయూష అనుమానంగా చూస్తూ.

రజని తలదించుకొని "నావైపు నుండి ఏమీ లేదు. ఒకతను నన్ను ప్రేమిస్తున్నానని ఉత్తరం రాశాడు. నేను లేకపోతే బ్రతకలేడట!" అంది రజని.

"నిన్ను చూసా? లేక మీ నాన్న ఆస్తి చూసా?" అనడిగింది పీయూష.

"అదెలా తెలుసుకోవడం మరి!"

"మా నాన్న ప్రేమించి పెళ్లి చేసుకుంటే ఆస్తిలో చిల్లిగవ్వ ఇవ్వడు అని చెప్పు. అయినా పెళ్లి చేసుకుంటానంటే నిజంగానే ప్రేమించేడన్న మాట! ఇంతకీ ఎవరతను?"

"వీడియో షాప్ కరుణాకర్!"

"అతనా?" ఆశ్చర్యపోతూ అడిగింది పీయూష.

"ఏం, అతనంటే నీకిష్టం లేదా?" అనడిగింది రజని.

టిట్ ఫర్ టాట్-45 ఫలితాలు

"తోక లేదుగాని ఆంజనేయులంతటోడివి!"

*** రు. 25 బహుమతి పొందిన రిపార్టీ:**

"చూసి రమ్మంటారా? కాల్చి రమ్మంటారా? చెప్పండి!"

-సత్య, పి. (కొత్తవాడ)

*** రు. 15 బహుమతి పొందిన రిపార్టీ:**

"ఐనా సరే (దొంగ) ఓటువేసి రమ్మంటే బ్యాలెట్ బాక్స్ ఎత్తుకొచ్చా!"

-ఘంటసాల సోదరులు (రామవరప్పాడు)

మరి కొన్ని వాగ్బాణాలు

"అయినా 'లంక' దహనానికేం లోటులేదుగా!"

-కె. రాధ (టెక్కలి)

"పదవి లేదు కానీ ప్రైం మినిస్టర్ అంతటోడివి!"

-జి.వి. రామారావు (ఖమ్మం)

"ఏ ఎండకా గొడుగు పట్టడానికి తోకెందుకు స్వామీ! చేతులుంటే సరిపోలే!"

-ఎన్. రమేష్ బాబు (హైదరాబాద్)

"అయ్యా! లంకాదహనానికి తోకే అక్కర్లేదండీ!"

-కె.వెంకటరమణ (గవరకంచరపాలెం)

సూపర్ హీరో

"ఇష్టమంటే....సదభిప్రాయం లేదు"

"ఎందుకని? అతని గురించేమైనా తెలుసా?"

"తెలియదు. కాని మనిషి నిజాయితీ అయిన వాడిలా అనిపించలేదు. నా అభిప్రాయం కరెక్టు కాదో అవునో కూడ నాకు తెలియదు" అంది పీయూష.

రజని వెంటనే ఏం మాట్లాడలేదు.

"కోపం వచ్చిందా నా మాటలకి!" అనడిగింది పీయూష.

"లేదు కోపం తెచ్చుకోవడానికి నేను నీలా ప్రేమలో పడలేదు. కాకపోతే అతను తమాషాగా మాట్లాడుతాడు. మాటలతో ఇంప్రెస్ చేస్తాడు. అతన్ని చెడ్డవాడుగా అనుకోలేకపోతున్నాను" అంది రజని.

"నీ అభిప్రాయం కూడ సరైనదే కావొచ్చు. విజయేంద్ర గురించి హేళనగా మాట్లాడినందు వలన అయిండొచ్చు నాకు అలాంటి అభిప్రాయం ఏర్పడింది" అంది పీయూష.

రజని జవాబు చెప్పలేదు.

ఆలోచిస్తూ కూర్చుంది.

అతను రాసిన ఉత్తరం మనసులో మెదులుతోంది.

తను నిజానికి అందంగా వుండదు. తల్లిదండ్రుల నుండి సంక్రమించిన ఆస్తి అది. చిన్నతనంలో స్ఫోటకం రావడంతో ఆ అందం మరీ చెడింది.

అయినా తానెప్పుడూ అందం గురించి బాధపడలేదు కాని పీయూష విజయేంద్రని ప్రేమించిన దగ్గర్నుండీ ఏదో వెలితి భావం మనసుని ఆక్రమించి బాధిస్తోంది. ఒక్క పీయూషకే కాదు తన క్లాసులో చాలా మందికి ఎఫైర్స్ ఉన్నాయి. వాళ్ళ గొడవ ఎప్పుడూ

"నన్నుములగ చెట్టు ఎక్కించకండి బాబు! పడితే లేవడం కష్టం!"

-ఐ. ఇబ్రామెల్ (కాకినాడ)

"నామాల్లేకపోయినా 'రామ్మలోరే' మీరంటే...నాకే తోక లేదంటావా!"

-సాహితి (మద్రాసు)



లక్కీ పేర్లు

జయరాజు (పాల్వంచ), సి.హెచ్. సత్యనారాయణ (హైదరాబాద్), సి. రవితేజస్వి (చింతలూరు), వి. పద్మావతి (సికింద్రాబాద్), బి.ఎన్.వి. మల్లిఖార్జునబాబు (గుంటూరు), కె. కిషోర్ (ప్రొద్దుటూరు), సాయిశ్రీ (రామచంద్రపురం), బి. రాధాకృష్ణ (వరంగల్), ఎం.ఎస్. చక్రవర్తి (తెనాలి), ఎన్. హేమగిరిబాబు (తిరుపతి), బి.ఆర్. మూర్తి (మచిలీపట్నం), పి. నిర్మల (శ్రీహరికోట), జి.వి.యన్. పద్మావతి (తణుకు).

(73వ పేజీ చూడండి)

అబ్బాయిల గురించే! అదంతా వయసు ప్రభావం అని తనకీ తెలుసు. తన మనసు కూడ ఓ తియ్యని స్నేహం గురించి ఆశపడటం లేదని చెబితే అబద్ధమే అవుతుంది. తనకి పీయూష మంచి ఫ్రెండయినా పీయూష ధ్యాసంతా ఇప్పుడు విజయేంద్రే!

తనకెవరున్నారు తన వారే అని చెప్పుకోవడానికి!

డబ్బుంది, కార్లున్నాయి, పలుకుబడి వుంది-రకరకాల చీరలు, నగలూ వున్నాయి-కాని ఎవరు నువ్వేకావాలని అనలేదింత వరకు. బహుశ తన అనాకారి తనమే ఎవర్నీ తనకి దగ్గర కానివ్వడం లేదేమో! ఇన్నాళ్ళకు, ఈ కరుణాకర్ అనే వ్యక్తి తనకో ప్రేమ లేఖ రాశాడు. మొదట భయమేసినా అందులోని ప్రతి వాక్యం తన మనసులో హత్తుకుపోయింది.

వేడి తగిలిన హిమంకరిగి ప్రవహించినట్లు జడమైన తన హృదయంలో స్పందన మొదలైంది. మనసులో ఏవో ఏవో ఊహాలు, కోరికలు చిలిపిగా గిలిగింతలు పెడుతున్నాయి. ఎంత కాదనుకొన్నా, ఎంత లేదనుకొన్నా మనసంతా వెచ్చని హాయి ప్రాకి పరవశానికి గురి చేస్తోంది.

గమ్మత్తుగా తన ఆలోచనలంతా అతనే ఆక్రమించుకొంటున్నాడు. కళ్ళలో అతని రూపమే ప్రతిఫలిస్తోంది. వెంటనే వెనక్కు వెళ్ళి అతన్ని చూడాలని, మాట్లాడాలని ఆశ కల్గుతోంది!

రజని తన ఆలోచనల్లో తానుండగానే విమానం మీనంబాకం ఎయిర్‌పోర్టులో లేండయింది.

ఇద్దరూ విమానం దిగి బాగేజ్ కలెక్ట్ చేసుకొని రజని అక్కయ్య ఇంటి నుండి వచ్చిన కారులో ఇంటికి బయల్దేరేరు.

**** ***** ****

"ఛీ! ఛీ!" అంది కోకిల తత్తరపాటుగా కరుణాకర్ చెప్పిన ప్రపోజల్ విని.

కరుణాకర్ మెత్తగా నవ్వి "తప్పేం లేదు. ఇది వృత్తిపరంగా చూడటమే నువ్వు నేర్చుకోవాలి!" అన్నాడు నచ్చ చెబుతున్నట్లుగా.

"అయినా నేను చెయ్యలేను" అంది కోకిల మొండిగా.

"డబ్బంటే నీకు చేదయితే నేచెప్పేది ఏమీలేదు. పెద్ద తారలు కాక ముందు చాల మంది ఈ ఫిల్మ్స్‌లో నటించి పొట్టపోసుకున్నవాళ్ళే. ఇప్పటికీ రహస్యంగా కొంత మంది తారామణులు వీటిలో నటిస్తూనే వున్నారు. ఈ కాసెట్స్ సేల్స్ గురించి చెబితే నువ్వదిరిపోతావు. అంత డిమాండ్ వుంది వీటికి. బాగా ఆలోచించుకో. ఉత్త చేతులూపుకొంటూ ఇంటి కెళ్తావో-లేక బాగా గడించి మీవాళ్ల ముందు గొప్పదానిగా గుర్తింపబడతావో! నువ్వు కాదంటే నాకు చాల మంది ఉన్నారు నటించడానికి!" అన్నాడు కరుణాకర్ బెదిరిస్తున్నట్లుగా.

"కాని....."

"నో కానీస్, నో అర్ధణాస్! ఎస్ ఆర్ నో చెప్పేసి నా టైం వేస్టు చెయ్యకు. నువ్వు ఫీచర్ ఫిల్మ్స్‌కి, టి.వి. ఫిల్మ్స్‌కి పనికిరావు. విజయేంద్ర, దమయంతి చెప్పిన మాటే నేనూ చెబుతున్నాను. ఎందుకంటే మనిషి అందం అందరికీ మొహంలోనే వుండదు. ఎక్కడ అందం వుంటే అది బహిర్గతం చేస్తేనే నటులు పైకొచ్చేది. నీ శరీరం అందుకు పనికొస్తుంది కాబట్టి నిన్నిక్కడ దాక తీసుకొచ్చేను. నీ యిష్టం!" అన్నాడు కరుణాకర్ తాపీగా సిగరెట్ వెలిగించి.

కోకిల మెత్తబడినట్లు చూసింది.

"కాసెట్ మీద నాపేరు వేయరు కదూ!" అంది బ్రతిమాలుతూ.

"ఓ.కె. నువ్వేది వేయమంటే అదే వేస్తాం! ప్రపంచంలో పేర్లకేం కొదవ! హెలెన్ ఆఫ్ ట్రాయ్ అని వేయమన్నా నాకభ్యంతరం లేదు" అన్నాడు కరుణాకర్ భుజాలెగరేసి నవ్వుతూ.

కోకిల అంగీకారంగా నిలబడింది.

వెంటనే లైట్లు వెలిగేయి.

వీడియో కెమెరా పని చేయడం ప్రారంభించింది.


కోకిల కెమెరా ముందుకొచ్చింది భయంగా, సిగ్గుగా.

(ఇంకా ఉంది)

టానా - ఆంధ్రసచిత్రవారపత్రికల సంయుక్త సాహితీసంబరం పోటీలో బహుమతి పొందిన కథ

వాడే వీడు

—ఉత్పల వరదరాజా



"ఒరే కిట్టయ్యా! పట్నంలో జాగ్రత్తగా మసులుకో పొట్టకూటి బతుకు మనది. ఎవరితో గొడవలు పెట్టు కోకు ఆనందరావు చెప్పినట్టు యినుకో . నిన్ను బాగా చూసుకుంటాడు. కడుపు నిండా తిండి పెడతాడు! ఖాళీగా వున్నరోజు పట్నంలో సినిమా చూడొచ్చు. యాడికి పోయినా అర్దను కాగితం జేబులో పెట్టుకో. ఎవరన్న మాటంటే తలవంచుకో-చూడు! పట్నంలో చాలామంది రాళ్ల మేడల్లో వుంటారు. వాళ్ల మనసులు రాళ్లేరా" అన్నాడు రాజయ్య.

మూడు నెలల క్రితం కిష్టయ్య ఆనందరావు యింట్లో పనికివచ్చాడు.

రాజయ్యకు యింకా నలుగురు కొడుకులున్నారు. అతను తనను మర్చిపోవచ్చు. అసలు మర్చిపోయాడు అనుకున్నాడు కిష్టయ్య. తనను యిలా బ్రతిమాలి పంపినందుకు కిష్టయ్యకు కోపం వచ్చింది.

మూడు పూటలు తిండి, చేతికి పాతిక రూపాయలు యిస్తే తండ్రికి వంద పంపుతున్నా బండెడు చాకిరీ చేస్తూ. ఒకోసారి రాజయ్యమీద, తల్లిమీద కోపం ముంచుకువస్తుంది.

పల్లెటూరి జీవితంలో ఎంతో కాలం గడిచిపోయింది. వూరి చెరువు, దేవుడు గుడి, పచ్చని పంట పొలాలు, సినిమా కోసం మూడు మైళ్ల ప్రయాణం యివన్నీ అనుభూతులుగా మిగిలాయి.

తండ్రి 'రావు' గారి దగ్గర పాలేరు.

అందరూ కూలి పనులు చేసుకు బ్రతకాలి. నారు పోయడం, పొలం కాయటం, కోతలు కోయటం, తూర్పార బోయటం-

అదోరకమయిన వాతావరణం!

రావుగారి అల్లుడు ఆనందరావు.

పట్నంలో పనిమనుషులు దొరకలేదు. దొరికినా సక్రమంగా వుండరు. వున్నా సరిగా పనిచేయరు.

అందుకే రావుగారు అన్నారు 'ఒరే రాజయ్య-మీ కిష్టిగాడ్ని

శ్రీ ఉత్పల వరదరాజా 'వాడే వీడు' మినీ కథా రచయిత. వీరు పుట్టింది అల్లూరులో. పెరిగింది, విద్యాభ్యాసం, చిరుద్యోగం పొన్నూరులో. వివిధ పత్రికలలో సీరియల్ నవలలు, కథలు వచ్చాయి. ఆలిండియా రేడియోలో సీరియల్స్, నాటికలు, ప్రసంగాలు, కథానికలు, పాటలు ప్రసారం చేయబడ్డాయి. శ్రీ శక్తి మహిమలు, జై భద్రకాళి, దగాపడ్డ చెల్లెళ్లు, చక్రబంధం మొదలగు సినిమాలకు మాటలు, పాటలు వ్రాశారు. యువరచయితలను, కళాకారులను, వారిలో నిగూఢమై వున్న కళాశక్తికి రూపకల్పన చేయడం వారి ధ్యేయం.

"నాకు మొదటి నుండి అందిస్తున్న



ఆంధ్రసచిత్రవారపత్రిక వసడ ఆశస్సులను నేను మరువలేను. ఈనాడు నా మినీ కథకు ఇచ్చిన బహుమతి ద్వారా నన్ను ఎంతగానో ప్రోత్సహించినందుకు వారికి నా కృతజ్ఞతలు" అంటున్నారు.

పై వారమే టానా పెద్ద కథల పోటీ ఫలితాలు !

టానా-ఆంధ్రసచిత్ర వారపత్రికల సంయుక్త సాహితీ సంబరంలో బహుమతి పొందిన కవిత!



"అమ్మ" కవితా రచయిత శ్రీ శింగరాజు శ్రీనివాసరావు ప్రకాశం జిల్లాలోని పొదిలిలో నివసిస్తున్నారు స్టేట్ "బ్యాంక్ ఆఫ్ ఇండియా"లో క్లర్కు- కం- కాషియర్‌గా పని చేస్తున్నారు ఇది బహుమతి పొందిన వీరి తొలికవిత తీరిక వేళల్లో కవితలు వ్రాయడం, నాటకాలు వేయడం వీరిహాబీ. "తొలిసారిగా నాకు బహుమతి రుచి చూపిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక వారికి నా హృదయ పూర్వక ధన్యవాదాలు" అంటున్నారు

అమ్మ

-శింగరాజు శ్రీనివాసరావు

రుధిర ఖండానికి రూపునిస్తుంది
కానీ ఆమె శిల్పి కాదు!
మాంసపు ముద్దకు జీవం పోస్తుంది
కానీ తాను బ్రహ్మ కాదు!
మలమూత్ర మాలిన్యాలను మోస్తుంది
కానీ ఆవిడ ధరణి కాదు!
చేతి చొరవలను కాలితన్నులను సహిస్తుంది
కానీ యీమె శిల కాదు!
చిరంజీవులుగా దీవిస్తుంది
కాని తాను చిరాయువు కాదు!
కరుగుతూ వెలుగునిచ్చే
ఆ అమృతమూర్తిని
ఏమని పిలవాలి? మనం
దేవతయనా! - లేక
జీవితమనా!! ఏమని?
ఆమె అనుక్షణం మరువలేని
మధుర ప్రేమమూర్తి!
కనుకే ఆమె మనకు అమ్మ!! - అమ్మకు మరో పేరులేదు!

వంపరాదంట్రా పట్నం పనిచేసుకుంటాడు. పావలా డబ్బులు వంపుతాడు' అన్నాడు.

రాజయ్య భార్యతో అంటున్నపుడు తను వేదనపడ్డాడు.

అమ్మా నాన్నలను వదిలి వుండాలి.

పట్న జీవితం-

ఒక రకంగా భయంగా గుబులుగా ఆందోళనగా వుంది. రాజయ్య బ్రతుకుతెరువు చూసుకోవాలిరా కిష్టయ్యా అంటూ బలవంతంగా పట్నం పంపాడు.

* * *

'మీనాన్న దగ్గరికి వెళ్లివస్తావంట్రా' ఆనందరావు ఒకసారి అన్నాడు.

తలూపాడు తను. తన వూరు వెళ్లాలి.

రాజయ్యకు వుత్తరం వ్రాశారు. తన సొంతవూరు కిష్టయ్య బయలుదేరాడు. 'వారంరోజుల్లో వచ్చెయ్. అలాగే వుండిపోతావా?' ఆనందరావు ప్రశ్న.

'వత్తానండి' అన్నాడు కిష్టయ్య.

మూడు నెలల తరువాత వూరి పొలిమేరలో బస్ దిగాడు కిష్టయ్య.

అప్పటికి రెండు రోజులుగా వర్షం కురిసి వెలిసింది. నేలంతా చిత్తడిగా, బురదగా వుంది. చెప్పులు తీసి చేత్తో పట్టుకున్నాడు. నడుస్తు వుంటే కాలుజారిపోతుంది.

మూడు నెలల తరువాత వచ్చినా, మూడు సంవత్సరాల తరువాత వచ్చినట్లుంది తనకు.

వూరి చెరువు దగ్గరికొచ్చాడు.

ఎదురుగా దేవుడు గుడి మీద పావురాలు ఎగురుతున్నాయి.

చిన్నప్పటినుండి వాటిని అలా చూడటం కిష్టయ్యకు యిష్టం. గత జన్మస్మృతులు గుర్తుకు వచ్చినట్లు చూడసాగాడు.

యింటికి రావడంతో తండ్రి, తల్లి, తమ్ముళ్లు ఆప్యాయతగా కౌగిలించుకున్నారు.

యింటిముందు అంతా చిత్తడినేల.

బట్టలు విప్పాడు.

"ఎక్కడవుంచాలి?" యింట్లో తన బట్టలు తగిలించుకునే చోటులేదు.

వూరువాళ్లు వచ్చి పరామర్శించారు. తను ఎంతో గొప్పవాడయిపోయిన భావన వారిలో చోటుచేసుకుంది.

యింట్లో కూర్చున్నాడు.

పిడకల పొయ్యి, యిల్లంతా పొగమయం. కళ్లు మండుతున్నాయి. చిరాకేసింది కిష్టయ్యకి.

భోజనం వడ్డించింది తల్లి.

దంపుడు బియ్యం, ఒక గుడ్డు పెట్టింది.

ముద్ద మింగుడు పడలేదు. ఆనందరావు యింట్లో మూడు కూరలతో లేని రోజు వుండదు. తినబుద్ధికావడం లేదు. కంచం విసిరికొట్టాలనుకున్నాడు. వెరుగు లేదు. మజ్జిగలాంటి నీళ్లు పోసింది.

ఆ యింట్లో వుండలేకపోయాడు కిష్టయ్య! కాదు-యిమడలేకపోతున్నాడు.


గతంలోవున్న కిష్టయ్య వేరు. యిప్పుడు వేరుగా వున్నాడు.

మరునాడు బయలుదేరాడు. రాజయ్య అభిమానం, తల్లి ప్రేమ, అన్నదమ్ముల అనుబంధం కిష్టయ్యను ఆపలేదు.

కిష్టయ్య వెళ్లిపోతుంటే రాజయ్య 'అప్పుడే వెళ్లిపోతున్నావురా అయ్యా' అని మాత్రం అన్నాడు.

తిరిగి వచ్చిన కిష్టయ్యను చూసి 'కనిపించదు కాని వీడికి పనిమీద శ్రద్ధ ఎక్కువ' అనుకున్నాడు ఆనందరావు. అమాయకుడు!

●



గడియారాలు కాని కాలం


ఆమధ్య హైదరాబాద్, విజయవాడల నుండి వెలువడే ప్రముఖ దినపత్రికల్లో ఓ ప్రకటన చాలా మందిని ఆకర్షించింది. పాత గడియారాలు, వాచీలు సేకరించే పనిలో నిమగ్నమై వున్న ఓ బొంబాయి పార్టీ ఆ ప్రకటన ఇచ్చింది.

గడియారపు పాతదనాన్ని బట్టి దానికి వారు రేటు కడతామని, ఉదాహరణగా కొన్ని వివరాలు కూడా అందులో ప్రకటించారు. ఫలానా మోడల్‌లో వుండి, ఇంత పాత గడియారం అయితే ఇన్ని వేలు, అలాగే ఇన్నేళ్ల కిందటిదైతే ఇన్ని వేలు ఇస్తామని వారి ప్రకటన సారాంశం. వాళ్లాశించిన మేరకు వారెన్ని గడియారాలు సేకరించారో తెలీదుగాని, దాదాపు 5000 ఏళ్ల కిందటి నుంచీ మానవుడు చిత్రాతి చిత్రమైన గడియారాలు చేస్తూనే వున్నాడు.


కాలం ఎంత చిత్రమైనదో, కాలంతోపాటు మార్పు చెందుతూ వస్తున్న కాల సూచికలు కూడా అంతే చిత్రమైనవి.

అందుకే పాత గడియారాలకు అంత గిరాకీ వుంది. కాలగతిలో గడియారం పాతబడుతున్న కొద్దీ దాని విలువ పెచ్చుతుంది. అతిప్రాచీన కాలం నాటిది తమ వద్ద ఉందని చెప్పుకోవడం ఓ గొప్పతనం

ఇత్తడి ఫ్రేమ్‌తో వున్న గోడగడియారం. క్వార్ట్జ మూవ్‌మెంట్. హేబిటాట్ (లండన్)




దాదాపు 5000 ఏళ్ల నాటిదీ సూర్యగడియారం. 1 నిముషం ఎక్కువ తక్కువగా నడిచేది రోజా.



ఉష్ణశక్తి గడియారం. ఇది కూడా 5000 ఏళ్ల నాటిదే! 10 నుండి 20 నిముషాలు తేడా రోజుకు.



నీటి గడియారం. 5000 ఏళ్ల కిందట తయారైంది. ఇది కూడా రోజా 10-20 నిముషాల తేడా చూపేది.



ఇసుక గడియారం. దాదాపు 2500 ఏళ్ల క్రితం తొలిసారి తయారు చేశారు. కేవలం 30 సెకన్ల తేడా.

మారుతున్నాయి మారడంలేదు

-భాగవతుల సుబ్రహ్మణ్యం

మాత్రమే కాదు! ఆ కళాఖండాల గతికీ-గమనానికీ చారిత్రక సాక్ష్యం కూడా!...


కాలం అమూల్యమైనది. క్షణం చేజారితే తిరిగిరాదు. దేన్నయినా సంపాదించవచ్చు కాని, పోగొట్టుకున్న విలువైన సమయాన్ని తిరిగి పొందలేం! ఇంత విలువైన కాలాన్ని కొలవడానికి సాధనాలుగా పూర్వం నుంచీ రకరకాల గడియారాలు తయారు చేస్తూనే ఉన్నా మనిషికి తృప్తి తీరడంలేదు. ఇంకా కొత్తరకం గడియారాల తయారీకి సంసిద్ధుడవుతూనే వున్నాడు.

ఇసుకపాతర

గడియారాల చరిత్ర తవ్వితీస్తే ఇసుకపాతరలా ఎన్నో విశేషాలు బయల్పడతాయి. ఇసుక గడియారాలు, నీటి గడియారాలు, నీడ గడియారాలు నాటి నుండి నేటి క్వార్ట్జ్ గడియారాల దాకా దాదాపు 500 రకాల గడియారాలు తయారై ఉంటాయని ఓ అంచనా! ఎన్ని రకాల గడియారాలను తయారు చేసినా అన్ని కాలాన్ని ఖచ్చితంగా కొలవడానికే!

కాల సూచికలుగా తొలిరోజుల్లో ఝాములు, ఘడియలు, లిప్తలు ప్రమాణాలు. కాలక్రమేణా గంటలు, నిముషాలు, సెకన్లు కాలాన్ని కొలిచే లెక్కల్లో చోటు చేసుకున్నాయి.

గడియారాల చరిత్రంతా ఇక్కడ వివరించీ విసిగించే కంటే చిత్రమైన కొన్ని గడియారాల్ని మాత్రం ఇక్కడ కనువిందుగా ప్రదర్శించడమే మంచిది.



టర్కీ టేబుల్ వాచ్


స్విస్ సంస్థ డోక్సా తయారు చేసిన పాకెట్ వాచీ.




ప్రామాణిక కాల సూచిక ఈ శతాబ్ది ప్రారంభంలో తొలిసారిగా దర్శనమిచ్చింది.



మెరైన్ క్రోనోమీటర్ 18వ శతాబ్దిలో తయారైన ఈ గడియారం తేడా 0.1 సెకను.




ఖగోళ గడియారం. 1950లో ఎఫ్.ఫెడ్ ఛెస్ కోవ్ తయారు చేశారు 0.0002 సెకన్ల తేడా.




అటామిక్ బీమ్ సీసియం టైంస్టాండర్డ్. 1972లో తయారైంది. తేడా 0.0000001 సెకను మాత్రం.




ఆటోమేటిక్, క్వార్ట్జ వంటి ఆధునిక గడియారాలను సైతం సవాల్ చేస్తూన్న ఈ నీడగడియారం తూర్పు గోదావరి జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలో వుంది. దీన్ని 'పలభా యంత్రం' అని కూడా పిలుస్తారు. రాజమండ్రికి చెందిన పిడపర్తి కృష్ణమూర్తి దంపతులు దీన్ని రూపొందించారు. 1943 జూలైలో దీనిని ఏర్పాటు చేసి 1958లో పునర్నిర్మించారు. అన్ని కాలాల్లోనూ ఖచ్చితమైన సమయం చూపే ఈ గడియారం మన వేద పండితుల ప్రతిభకు తార్కాణం.




హైటెక్ డార్క్ రెడ్ మెటల్ గ్రిడ్ వాల్ క్లాక్. స్ట్రేంజ్ వేస్, (లండన్) క్వార్ట్జ చలనం.




ప్లయ్‌వుడ్‌తో చేసిన క్రికెట్ వాల్‌క్లాక్ బ్యాటరీతో నడుస్తుంది. ది డిజైన్ సెంటర్ షాప్ -(స్ట్రేంజ్ వేస్) అమెరికా వారి తయారీ.



యాంత్రిక చలనం కలిగి వున్న డ్రాయింగ్ రూం గడియారం. నాబ్స్ అండ్ నాకర్స్ (లండన్) తయారీ.





క్రోమియం ప్లేటెడ్ గడియారం. అందంగా, అతి మామూలుగా వుండే ఈ క్లాక్ క్రిస్టన్ తయారీ.



19వ శతాబ్ది నాటి బవేరియన్ కుక్కూ గడియారం. పక్షికూత దీని ప్రత్యేకత. డిజైన్లు లతలు చెక్కిన ఈ గడియారం 'లిబర్టీ'లోని పురావస్తు శాఖ సేకరణ. ●

ఆంధ్రప్రదేశ్‌కు స్థానం లభించింది...
భారతదేశపు ఆరోగ్యపటంలో...





MEDWIN
Hospitals

అంతేగాక అత్యంతాధునికమైన 9 ఆపరేషన్ థియేటర్లు, 8 పడకల ఎమర్జెన్సీ సెల్, 12 పడకల ఐ సి సి యు, ఒక పోస్ట్ ఆపరేటివ్ ఐ సి యు, ఒక డయాలిసిస్ యూనిట్ సరిగ్గా అయిదే అయిదు నిమిషాలలో ఫలితాలను తెలిపే ఇన్స్టెంట్ లాబొరేటరీ

తన విధి నిర్వహణలో పరిపూర్ణతను సంతరించుకోవడానికి మెడ్విన్ హాస్పిటల్స్ నాణ్యతా కంట్రోలు కార్యకలాపాలలో ప్రపంచ మేటి అయిన బోరింగర్ మేన్ (ప. జర్మని) సంస్థతో అనుబంధం పెట్టుకున్నది

పశ్చాత్త్రయంగా నిర్వహించబడే మెడ్విన్ హాస్పిటల్స్ అత్యంత విశ్వసనీయమైన రోగ నిర్ధారణ సేవలతో బాటు అన్ని శాఖలలోనూ వైద్య సంపోలు, శస్త్ర చికిత్సా సదుపాయాలను కూడా కల్పిస్తోంది

హాస్పిటల్ :

- 250 మంది రోగులకు అత్యంత సుఖప్రదమైన వసతి
- మొత్తం సెంట్రల్ ఎయిర్ కండిషన్ చేయబడింది
- 12 అంతస్తులలో 1.5 లక్షల చదరపుటడుగుల విస్తీర్ణం
- పేషెంట్ల ఆహ్లాదానికై ప్రతి రూములోనూ టెలివిజన్ సెట్
- హైదరాబాదు నగరపు నడిబొడ్డున నిర్మించ బడింది

ప్రత్యేకతలు :

న్యూరాలజీ, న్యూరోసర్జరీ, కాన్సర్, గుండె జబ్బులు, గుండె పునఃపరిరక్షణం శస్త్ర చికిత్స, శిశు వైద్యము, చిన్న పిల్లలకు శస్త్ర చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ, గాస్ట్రో ఎంటెరాలజీ, నేత్ర చికిత్స, శిశు వైద్యము, ఎముకల వైద్యము, ప్రసూతి వైద్యము, మూత్ర వ్యాధుల చికిత్స, నెఫ్రాలజీ, చెవి ముక్కు గొంతు జబ్బుల చికిత్స, దంత వైద్యము, చర్మ వ్యాధుల, మానసిక వ్యాధుల చికిత్స

శస్త్ర చికిత్సా విభాగాలు :

కొరొనరీ బైపాస్, ఓపెన్ హార్ట్ సర్జరీ, రీనల్ ట్రాన్స్ ప్లాంటేషన్, న్యూరో సర్జరీ, కార్డియో థొరాసిక్ సర్జరీ, చిన్న పిల్లల శస్త్ర చికిత్స, ప్లాస్టిక్ సర్జరీ

అంతర్జాతీయ ప్రమాణాలు గల సాధన సామగ్రి :

రేడియాలజీ & ఇమేజింగ్ విభాగము : C.T. స్కాన్, ఎక్స్‌రే యంత్రాలు, ఆటోమేటిక్ ఫిల్మ్ ప్రాసెసర్లు, అల్ట్రా సౌండ్ స్కాన్, C.T. గైడెడ్ బయాప్సీ.

క్లినికల్ విభాగము :

మామూలు పరీక్షా సాధనాలతో బాటు అత్యంతాధునికమైన హిటాచీ 704 ఆటో అనలైజర్, బెక్మెన్ ఎలెక్ట్రోలైట్ అనలైజర్, అయానైజ్‌డ్ కాల్షియం అనలైజర్, ట్యూమర్ మార్కర్ పరీక్షలు, ఆధునికమైన రేడియో ఇమ్యునో ఎస్సే ప్రయోగశాలతో బాటు అన్ని రకాల హార్మోను పరీక్షలు

పాథాలజీ :

కౌల్టర్ సెల్ కౌంటర్, ఆటోమేటిక్ టిస్యూ ప్రాసెసర్, మైక్రోటోమ్, ఇమ్యునో ఫ్లూరసెంట్ మైక్రోస్కోపు, సైటోస్పిన్

గుండెజబ్బుల విభాగము :

3 ఛానెల్ ఇ సి జి కంప్యూటరైజ్డ్ ట్రెడ్‌మిల్, కలర్ డాప్లర్, హోల్టర్ మానిటరింగ్ యంత్రము, కాథిటరైజేషన్ లాబొరేటరీ వీటితోబాటు ఉదరకోశ వ్యాధులకై వీడియో ఎండోస్కోప్స్, ఫైబ్రోప్టిక్ కొలనోస్కోప్స్, కాన్సర్ చికిత్సకై కోబాల్ట్ టెలెట్రాన్ సామగ్రి

అందరికోసం అనేక పథకాలు :

- ఆరోగ్య బీమా పథకం
- ఇమ్యునైజేషన్ కార్యక్రమాలు
- పీరియాడిక్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాలు
- వైద్య సేవలన్నింటినీ పూర్తిగా కంప్యూటర్ ద్వారా రికార్డు చేయడం
- ఉచిత ఆరోగ్య పరీక్షా వారాలు
- 24 గంటలూ తెరిచిఉండే మందుల షాపు
- ఆంబ్యులెన్సు సదుపాయం

వైద్య రంగంలో విశిష్ట స్థానాన్ని కలిగివున్న మెడ్విన్ హాస్పిటల్స్‌కు తన అనుభవజ్ఞులైన, అద్భుతమైన డాక్టర్ల బృందం ఎంతో గర్వదాయకం అలాగే ఆపత్స మయాలలో ఎవరికి ఎప్పుడు అవసరమవుతాయో తెలియని ఆకస్మిక సేవలందిస్తూ 24 గంటలూ పనిచేసే ఆసుపత్రి యంత్రాంగం

పైగా యీ సేవలన్నీ మంచితనంతోనూ, మానవత్వం తోనూ రంగరింపబడి అంకిత భావంతో నిర్వహించ బడతాయి

మెడ్విన్ హాస్పిటల్స్

(జయ డయగ్నొస్టిక్ అండ్ రిసెర్చ్ సెంటర్ లిమిటెడ్ వారి విభాగం,)
రాఘవరత్న టవర్స్, చిరాగ్ అలీ లేన్, హైదరాబాద్ – 500 001.
ఫోన్స్ : 242971 ; 2, 3, 4, 5



లవ్ గేమ్



చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

ఓ అరగంట తర్వాత-

నవ్య-మీనాక్షి- పేరంటం నుంచి వచ్చారు.

ఇల్లంతా నిశబ్దంగా ఉంది.

హాల్లో కూడా ఎవరూ లేరు.

మీనాక్షి ఆశ్చర్యపోతూ

"ఏరే..ఎవరూ కనిపించరేం?" అంది.

నవ్య ఏదో ప్రమాదాన్ని శంకించింది.

ఆమెకు మన్మథరావు నైజం తెలుసు. శ్రీమతి ధైర్యం తెలుసు. అందుకే వాళ్లిద్దర్నీ ఒంటరిగా ఉంచి వెళ్లడానికి సాహసించింది.

కాని...

ఎంతయినా శ్రీమతి ఆడది.

ఎంత ధైర్యమున్న లేడైనా- పులిముందు తిరుగుబాటు చేయలేదు. కంగారుగా గదులన్నీ వెదకసాగారిద్దరూ.

చివరకు-స్టోర్ రూం పక్కగదిలో-

కుర్చీలో తలవెనక్కి పెట్టి సీలింగ్ కేసి చూస్తూ కూర్చున్నాడు మన్మథరావ్. శ్రీమతి ఐస్ క్యూబ్స్ దూదిలో పెట్టి- అతని ముక్కుమీద నోటిమీద అద్దుతోంది.

మీనాక్షిని కంగారు పెట్టింది ఆ సన్నివేశం కాదు.

మన్మథరావ్ ముక్కు బెలూన్లా ఉబ్బి అందులోంచి గడ్డలుగా పడుతోంది రక్తం. అతని ముందు పళ్లు ఊడిపోయి -ఆ ఖాళీ ప్రదేశమంతా ఎర్రగా కనిపిస్తూ-

తెల్లటి షర్ట్ నిండా నెత్తుటి మరకల్తో-

మీనాక్షి గుండె పగిలింది. విసురుగా వెళ్లి భర్త భుజాలు కుదుపుతూ అంది-

"ఏవిటండీ ఈ ఘోరం... ఏమైంది?"

ఆమె కుదుపుకు అతని ముక్కు కదిలి బాధగా-

"అబ్బ ఉండవే- వెధవగోల...." అన్నాడు.

"ఏమైంది శ్రీమతి-" నవ్య అడిగింది.

శ్రీమతి నవ్వి చూయింగ్ గమ్ నమల సాగింది.

వాళ్లిద్దరి చూపులూ కలిసి ఏవేవో మాట్లాడుకున్నాయి. నవ్యకర్థమైంది.

"నువ్వన్నా చెప్పు తల్లీ! ఏమైంది?" ఏడుస్తూ అడిగింది మీనాక్షి.

"ఏంలేదండీ-బాత్ రూంలో స్నానం చేద్దామని బయల్దేరారు. ఏమైందో ఏమోపాపం కాలుజారి ఇందాక మనం చూశాం చూడూ బ్యాట్ కి తగిలిన టెన్నిస్ బాల్ లా వేగంగా వెళ్లి గోడకు కొట్టుకున్నారు. ప్రాణం లేని గోడ దానికి తప్పుకోవాలని తెలీదు గదండీ- అలాగే నిల్చుండిపోయింది. పాపం- ప్రాణమున్న ఈయన ముక్కు ప్లస్ ముందు పళ్లు రెండూ పగిలి-పచ్చడై విరిగిపోయాయి....." అంది శ్రీమతి.

ఆమె మాటలు వింటున్న మన్మథరావు కసితో పళ్లుకొరకబోయి జివ్వుమని లాగడంతో ఆప్రయత్నం మానుకుని మనస్సులోనే కసిగా తిట్టుకున్నాడు.

"బాధగా ఉందాండీ-" అతని తలమీద చెయ్యేసి అంది మీనాక్షి. కెవ్వుమన్నాడు మన్మథరావ్.

"పాపం తలను గూడా ముద్దెట్టుకుందండీ-ఆ జాలిలేని గోడ" అంది శ్రీమతి. అతనికి శరీరం మీదున్న గాయాల బాధకంటే శ్రీమతి మాటలు చిత్రవధ చేస్తున్నాయి.

"అయినా నేనడిగితే రెండు సార్లు స్నానం చేశానన్నారు. మళ్లీ ఇంతలోనే స్నానానికెందుకెళ్లారు.?" అడిగింది మీనాక్షి.

"ఒళ్లు కావ్వెక్కి-" అతనికే వినిపించేలా అంది శ్రీమతి.

విల విలలాడాడు మన్మథరావ్.

"డాక్టర్ దగ్గరకెళ్దాం- ఏవిటే అలా దిష్టిబొమ్మలా చూస్తూ నిలబడ్డావ్- అవతల మనిషి అంత బాధపడుతుంటే ఎలా నిల్చోబుద్ధవుతుంది నీకు?" నవ్యమీద విరుచుకుపడింది మీనాక్షి.

"ఏమైనా మీ మాంగల్యం గట్టిది" అంది శ్రీమతి.

"అవును తల్లీ- అంతా ఆ వరలక్ష్మి వ్రత మహత్యం...." చేతులు జోడిస్తూ అంది మీనాక్షి.

నవ్య డాక్టర్ కి ఫోన్ చేసి వచ్చింది.

జరిగే తంతును నిశబ్దంగా గమనిస్తున్నాడతను.

"దుర్గేది?" నవ్య అడిగింది.

శ్రీమతి నవ్వుతూ-

"మీ బావగారు సెంటర్ కెళ్లి సిగరెట్లు తీసుకుని ఓ గంట తర్వాత రమ్మని పంపించారు-" అంది.

ఆవేశంతో -అసహ్యంతో ఆమె ఒళ్లు జలదరించింది.

ఓ పది నిముషాల్లో డాక్టరొచ్చాడు.

ముక్కు ఫ్రాక్చరయిందనీ-పళ్లురెండు విరగడం మూలంగా కొద్దిరోజుల పాటు ఘన పదార్థాలు తినకూడదనీ కేవలం ద్రవ పదార్థాలు అదికూడా వేడివి-చల్లటివి తాగకూడదనీ చెప్పి- ముక్కుకి-తలకి బాండేజీ కట్టి వెళ్లిపోతూ అన్నాడు.

"ఏమైనా నలభైఐదేళ్లు వచ్చాయి. కుర్రాడిలా కాకుండా కొంచెం జాగ్రత్తగా తిరగడం అలవాటు చేసుకోండి-"

ఇంతవరకూ సాగినకథ -: 8 పెళ్లయిన భార్యాభర్తలు ఆనందలోకాల్లో విహరించే మధురాతి మధురమైన తొలిరోజు అనుభవాలను చవిచూడాలనుకున్న స్వాగత్ కు భార్య నవ్య నుంచి ఊహించని వ్యతిరేకత ఎదురవుతుంది. ఏడాది తర్వాత విడాకులు తీసుకోవాలన్న నిర్ణయానికి కట్టుబడి వేరే కాపురం పెడ్తాడు స్వాగత్. తన స్నేహితురాలు శ్రీమతి సహాయంతో స్వాగత్ ను ఏడిపించాలనుకుంటుంది నవ్య. స్వాగత్ తన భర్త అని శైలజ చెప్పటంతో అతనికి విడాకులివ్వటానికి మంచి క్లూదొరికిందని శ్రీమతి-నవ్యకు ధైర్యం చెప్తుంది.

మన్మథరావ్ ఉన్నపళంగా లేచి- డాక్టర్ బట్టతల మీద బలంగా రెండిచ్చుకుందామ నుకున్నాడు.

"చూడండీ.....ఇంత సేపూ మీపతి దేవుడికి ఉపచారాలు చేసి అలసిపోయాను. కాస్త పతి సేవ చేసుకోండి. పుణ్యం వస్తుంది" మీనాక్షి ఐస్ దూది తీసుకొని- అతని పెద వుల మీద అద్దసాగింది. నవ్య శ్రీమతిని తన గదిలోనికి లాక్కెళ్లి తలుపువేసి అడిగింది.

"ఇప్పుడు చెప్పు . అసలేం జరిగింది.?"

శ్రీమతి తాపీగా చూయింగమ్ నోట్లో వేసుకొని చెప్పసాగింది.

"ఏముంది మామూలే-నన్ను చూసిన వెంటనే వాడిలో మార్పును గమనించాన్నేను ఎరవేశాను. చేపపడింది. ఈ మన్మధుడు నాతో కలిసి జలకాలాడాలని సరదాపడ్డాడు పాపం..."

"ఈజిట్?" కోపంగా అంది నవ్య.

"అవును-సరే పదమన్నాను. లొట్టలేసు కుంటూ నా వెనకే వచ్చాడు. నేను తిన్నగా బాత్రూంలోకి తీసుకెళ్లాను. అక్కడ వెకిలిగా నవ్వుతూ నా భుజం మీద చెయ్యేశాడు. అంతే నా హైహీల్ శాండిల్ తో కసిదీరా ముఖం చితకబాదాను. ఊహించని సన్నివేశం ఎదుర య్యేసరికి కనీసం తనను తాను రక్షించుకునే ప్రయత్నం కూడా చేసుకోలేక పోయాడు. నాలో ఆవేశం చల్లారి చూసేసరికి నేలమీద బోర్లాపడి మూలుగుతున్నాడు. వెంటనే పైకి లేపాను. రెండు పళ్లూ రాలి కిందపడున్నాయి. ముఖమంతా రక్తం!"

రెండు చేతులూ ఎత్తి నమస్కారం పెడుతూ అన్నాడు.

"మా ఆవిడక్కానీ- నవ్యకి కానీ ఈ విషయం చెప్పకు ప్లీజ్-"

నేను వెంటనే ముఖం కడిగి కుర్చీలో కూర్చోబెట్టి ఫస్ట్ఎయిడ్ మొదలుపెట్టాను. అదీ సంగతి!"

ఆనందంతో చేతులు కలిపి-



.....'ఈ ప్రమోద'

-"గతం గతః" అన్నారు
"వాస్తవం నిత్య సత్యమై" వర్ధిల్లుతూనే
ఉంటుంది ఎప్పుడూ....
నిన్ననాదిలేసి
నేటిని అనుసరిస్తూ
రేపుని ఉన్నతంగా దిద్దుకో...

ఉబుసుపోని ఆలోచనలకు
ముగింపు తెరవేసి

నిన్ను నీవు సవాలుగ తీసుకొని
వాస్తవ దృష్టితో ముందడుగు వేయి



జీవితమె నీకు వంగి సలాం కొడుతుంది

"చెడు వినకు, చెడుకనకు, చెడు అనకు"
-మహాత్ముని ఉవాచ
"నీతి వాక్యాలు" అనేవి ఎప్పుడూ
ఆదర్శవంతంగానే ఉంటాయి
కార్యరూపంలో ఆచరించినపుడే
అవి భవిష్యత్ జీవితానికి మార్గ
దర్శకాలవుతాయి
సత్సంకల్ప భావమూర్తితో
సదాశయాలకు ఊపిరిపోసి
ఎద ఎదలో మానవతను పాదుకొల్పి
సమతా విపంచి మీద
మమతాను రాగాలు పలికించి
సుస్నేహ సుగంధాలు విరజల్లి
ప్రతి జీవితమూ ఆనంద నవనందన
వనంలా వికసించి
మానవ జాతి మనుగడకే
ఓ కొత్త ప్రవచనమై
ఈ 'ప్రమోద'
వెలుగుదారి కావాలని
ఆశిస్తూ.....

-అవనిగడ్డ సూర్యప్రకాష్

"అబ్బ...ఇంతకాలానికి వాడికి బుద్ధివచ్చింది థాంక్స్ అండ్ కంగ్రాట్స్" అంది నవ్య.

"నేనే నీకు థాంక్స్ చెప్పాలి. చేతి దురద తీరి చాలా కాలమయింది. నీ పుణ్యాన ఆ ముచ్చట తీరింది-" అంది శ్రీమతి.

తలుపు చప్పుడవడంతో నవ్యలేచి తలుపు తీసింది.

మీనాక్షి ముక్కు ఎగబీలుస్తూ నిలబడి ఉంది.

"ఏమైందక్కా-" అంది నవ్య.

"మీ బావగారు వెంటనే బయల్దేరమంటున్నారే...వెళ్తున్నాం-" అంది మీనాక్షి.

"అదేవిటండీ... ఇంత హఠాత్తుగా ప్రయాణమేంటి?" అంది శ్రీమతి.

"వెళ్లాలమ్మా! అవతల అమ్మా నాన్న దిగులుపడుతున్నారట. అమ్మ ఆరోగ్యం బాలేదట. నాన్నకు బి.పీ ఎక్కువైందట. పిల్లలు నామీద బెంగెట్టుకున్నార్ట.. . వెళ్తాం తల్లీ!" అంది మీనాక్షి.

"మరి ఇంతకు ముందే అంతా బావున్నారు. ఎన్నిరోజులైనా ఉండమని అన్నారుగా... ఇంతలోనే ఏమైంది?" అంది నవ్య.

"నా ఆరోగ్యం బావుంది కదాని ఇంకా బాగుపడి- అందంగా కావాలని అలా అబద్ధం చెప్పారట..." సిగ్గుపడుతూ అంది మీనాక్షి.

అక్కను చూసి అరికాలిమంట నెత్తికెక్కింది నవ్యకు.

ఇలాంటి ఆడవాళ్లుండబట్టే స్వాగత్ లాంటి మగాళ్లు మన్మథరావ్ లాంటి మొగుళ్లు ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారు.

నవ్య, శ్రీమతి బయటి కొచ్చారు.

మన్మథరావ్ చేతిలో సూట్ కేసుతో రెడీగా ఉన్నాడు.

వీళ్లద్దర్నీ చూసి ముఖం తిప్పకున్నాడు.

ముక్కుమీద బ్యాండేజ్ తో -పెదవులు వాచిపోయి-నుదుటిమీద చిన్న బొప్పికట్టి- చాలా గమ్మత్తుగా ఉన్న అతన్ని చూసి

"యు ఆర్ లుకింగ్ సో ఫన్నీ-" అంది శ్రీమతి.

మన్మథరావ్ మాట్లాడలేదు.

"కోపంగా బుసకొట్టాలనుకుని-ముక్కు కలుక్కుమనడంతో ఆ ప్రయత్నం మానుకున్నాడు."

"అదేవిటండీ-పాపం ఇంత దెబ్బ తగిలి ప్రయాణం ఎలా చేస్తారు?" అంది శ్రీమతి.

"ఫర్లేదు-చేస్తాము-" అన్నాడు పెదవులు తాకించకుండా మాట్లాడుతూ"

నిముషాల్లో మీనాక్షి రెడీ అయివచ్చింది.

"స్వాగత్ గారొచ్చేంత వరకన్నా ఉండండి. కార్లో డ్రాప్ చేస్తారు" అంది శ్రీమతి.

"వద్దులే తల్లీ! ఏ ఆటోనో పట్టుకుని వెళ్తాం-" అంది మీనాక్షి.

ఆమెకు పిల్లలు బెంగపెట్టుకున్నారన్న విషయం విన్న దగ్గర్నుంచీ కంగారుగా ఉంది. క్షణ క్షణానికీ పిల్లలు గుర్తొచ్చి దుఃఖం ముంచుకొస్తోందామెకు.

"భోంచేసి వెళ్లక్కా-" అంది నవ్య.

"వద్దులే-పెధవ భోజనం. ఆలస్యమైపోతుంది. అవతల పిల్లలు...." అంది ముక్కు ఎగబీలుస్తూ.

ఇక ఆమెను ఆపడం దేవుడి తరం కూడా కాదని అర్థమైంది నవ్యకు.

"పద...పద..." అన్నాడు పెదవులు తాకించకుండా మన్మథరావు.

సరిగ్గా అప్పుడొచ్చాడు సూర్యం.

భుజానికి ఎయిర్ బ్యాగ్ తగిలించుకుని నవ్వుతూ నిలబడిన అతన్ని చూసి-

"హాయ్ స్మార్ట్! వెల్ కం-" అంది శ్రీమతి.

అతన్ని చూడగానే శ్రీమతిలో కలిగిన ఉత్సాహం-బావమరిదిలో చూసిన ఎగ్సైట్ మెంట్- ఈ రెండూ మన్మథరావుని మానసికంగా కుంగదీశాయి.

"ఏమైందక్కా....బావగారికేమైంది?" కంగారుగా అడిగాడు సూర్యం. చిరాగ్గా ముఖం తిప్పకున్నాడు మన్మథరావ్.

"నథింగ్ టు వర్రీ యంగ్ మాన్! చిన్న యాక్సిడెంట్!" అంది శ్రీమతి

"ఏమైంది?బస్ లోంచి పడ్డారా?" ఆత్రతగా అడిగాడు.

"అబ్బే-మిస్ చేతిలోంచి జారిపడ్డారు-" అంది శ్రీమతి.

అంటే?"

"పెధవబాత్రూం నాయనా- కాలుజారి పడ్డారు.-" అంది మీనాక్షి దిగులుగా.

"రా సూర్యం లోపలకిరా-"అంది నవ్య.

సూర్యం లోపలికొచ్చాడు.

అక్కడున్న సూట్ కేసును చూసి ఆశ్చర్యంగా-

"ఇదేవిటి? ఎవరు ప్రయాణమవుతున్నారు?" అన్నాడు.

"మేమేరా? అమ్మకూ నాన్నకూ ఆరోగ్యం బాగాలేదట గదా- పిల్లలు కూడా బెంగెట్టుకున్నారట కదా-" ముక్కు ఎగబీల్చుతూ అంది మీనాక్షి.

"వాళ్ల గొడవకేం గానీ-నువ్వు మాత్రం వెంటనే బావగారితో కలిసి వెళ్లడం మంచిది"- అన్నాడు సూర్యం.

"ఎందుకు? ఏమైంది?" అంది మీనాక్షి.

"ఏమైందో బావగారు చెప్పలేదా?"

మన్మథరావ్ పరిస్థితి ఇరకాటంలో పడింది.

బావమరిదిని కసితీరా శపిస్తున్నాడు.

ఊళ్లో తన లీలా విలాసాలు లిస్ట్ చదువుతాడు కాబోలు.

ఎలా? ఎలా ఈ గండం నుంచి బయటపడేది?

దొంగ చూపులు చూస్తూ నిలబడ్డాడతను.

"మీ వాచీ ఉంగరం ఏమయ్యాయి బావగారూ.... బాత్రూంలో జారిపడ్డాయా?" అడిగాడు సూర్యం.

గతుక్కుమన్నాడు మన్మథరావ్.

అయితే రాజమండ్రి ఎయిర్ బస్ విషయం వీడికి తెలిసిపోయిందా? భగవంతుడా నాకేది దారి!

"నిజమేరా...నేను గమనించనేలేదు. ఏవయ్యాయండీ వాచీ ఉంగరం?" అంది మీనాక్షి.

"ఏవీ కాలేదు లేవే... వరద బాధితుల సహాయం కోసం.. విరాళం ఇచ్చానంతే..." అన్నాడు పెదవులు తాకించకుండా.

"మీ విరాళం పాడుగానూ-ఇవ్వాలనుకుంటే ఓ పది రూపాయలు ముఖాన కొడితే పోయేదానికి- నిక్షేపంలాంటి వాచీ ఉంగరం ఇస్తార్టండీ-" కోపంగా అంది మీనాక్షి.

"పోన్లేవే ఎదవగొడవ..." చికాకుపడ్డాడు.

"మరి ఆ వాచీ ఉంగరాలు నేను టూటౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చేతికి చూశానే...." అడిగాడు సూర్యం.

గుండె ఆగిపోయినంతపనయింది మన్మథరావ్‌కి.

అంటే వీడికంతా తెలిసే లాయర్ లెవెల్లో ప్రశ్నలేస్తున్నాడు.

"అలాగా-హిడియట్ -పోదు కొట్టేశాడన్నమాట...." అన్నాడు కోపంగా.

"అంటే అక్కడ కూడా బాత్రూంలో స్నానం చేయబోయారా పాపం..." అంది శ్రీమతి జాలిగా.

"హాత్రూంలేదూ-ఎహీలేదు-నువ్ నడుస్తావాలేదా?" కోపంగా అన్నాడు.

"వెళ్దురు గానీ కూర్చోండి బావగారూ-నేనిప్పుడే వచ్చాను గదా- కాసేపు సరదాగా

లవ్ · గేమ్

కబుర్లు చెప్పుకుందాం ం-" అన్నాడు సూర్యం.

"నీ సరదా పాడుగాను- అవతల పిల్లలు బెంగపెట్టుకున్నారని నేను చస్తుంటే- సరదా ఏవిట్రా-బోడి సరదా-" చిరాగ్గా అంది మీనాక్షి.

"పిల్లలకేం క్షేమంగాఉన్నారక్కా. నువ్వేం కంగారుపడకు. అమ్మ వాళ్లని కంటికి రెప్పలా చూసుకుంటోంది." అన్నాడు సూర్యం.

"హుం!" అని విసురుగా అని హాల్లోకి వెళ్లిపోయాడు మన్మథరావ్.

"ఏవిట్రా-అసలేం జరిగింది?" అంది నవ్య.

సూర్యం మన్మథరావ్ ఎడ్వెంచర్స్ అన్నీ వివరంగా చెప్పాడు.

అంతా విని మీనాక్షి అపరకాళిలా విజృంభించింది.

ఇంత వయసొచ్చాక ఇవేం బుద్ధులీయనకు? ఛీ...సిగ్గుండక్కర్లా? ఏళ్లు రాగానే సరా? బుద్ధి పెరగొద్దూ-అందుకే దేవుడు ఇలా శిక్షించాడు అవునూ- ఇప్పుడనుమానం వస్తోంది... అసలు నిజంగా ఈయన బాత్రూంలోంచి జారిపడ్డారా లేక...." అంటూ విసురుగా హాల్లోకి వచ్చింది. అక్కడ మన్మథరావ్ లేడు.

ఆశ్చర్యపోతూ-"ఏడీ పెద్దమనిషి-ఎటు పోయాడు?" అంది.

అంతా హాల్లోకి వచ్చారు.

"కంగారుపడకక్కా-బావగారు అలిగి వెళ్లిపోయారేమో-నువ్వు తిరిగ్గా రేపెళ్దువుగానీ-"

సరిగ్గా అప్పుడే-

స్వాగత్ మన్మథరావుని వెంటబెట్టుకుని వచ్చాడు.

"హాయ్! ఈ రోజు నా జన్మ తరించింది-" అన్నాడు సూర్యం.

"ఎందుకని పాపం?" అన్నాడు స్వాగత్.

"ఇద్దరు బావల్నీ ఒకేసారి చూసుకునే భాగ్యం కలిగినందుకు" అన్నాడు నవ్వుతూ.

"అవునోయ్- మీరంతా కలిసి మా బ్రదర్‌ను ఒక్కడ్నే చేసి వెళ్లగొట్టేస్తున్నారట... ఏవిటంత ధైర్యం?" అన్నాడు స్వాగత్ నవ్వుతూ.

"బర్డ్స్ ఆఫ్ సేమ్ ఫెదర్"- అంది నవ్య శ్రీమతి చెవిలో.

కళ్లతో మందలించింది శ్రీమతి.

"అయినా నీ పిచ్చి కాకపోతే- ఆ బాత్రూంలోకి ఎందుకెళ్లావ్ బ్రదర్- మన బాత్రూం ఉందిగా-" అన్నాడు స్వాగత్.

బిక్కచచ్చిపోయాడు మన్మథరావు.

నవ్య స్వాగత్‌ని చూస్తుంటే- ఆవేశం పట్టలేక పోతోంది. లీనాబ్యూటీ పార్లర్‌లో ఆ అమ్మాయి గుర్తొస్తోంది.

ఎంతందంగా నటిస్తున్నాడు?

ఎంతందంగా వంచిస్తున్నాడు?

పగలంతా దాంతో షికార్లు కొట్టి- దానితో గడిపి- రాత్రికి ఇంటికి వచ్చి తనమీద ప్రయత్నాలా?

ఛీ...ఛీ... పశువుకి ఇతనికి తేడా లేదు.

"బై దిబై కంగ్రాట్స్‌యోయ్ సూర్యం. ఛాంపియన్ అయ్యావుగదా? కానీ చాలా గొప్పగా ఆడావ్" అన్నాడు సూర్యం చేయి పట్టుకుని.

"థాంక్స్- బైదిబై... మీరెక్కడ చూశారు ఆట" అడిగాడు సూర్యం.

"లీనా బ్యూటీ పార్లర్‌లో..." కసిగా చప్పన అంది నవ్య.

దెబ్బతిన్నట్టు చూశాడు స్వాగత్.

ఆ వెంటనే పెద్దగా నవ్వి-

"బ్యూటీ పార్లర్‌కి- టెన్నిస్ కోర్టుకి తేడా ఏవిటోయ్-" అన్నాడు.

ఓ క్షణం ఆలోచించి-

"తెలీదు-" అన్నాడు సూర్యం.

"అయితే ఇక్కడ చెప్పడం బావుండదు. రాత్రి పదింటికి మేడమీదకు రా చెప్తాను-" అన్నాడు స్వాగత్.

"అది సరేగానీ- ఇంటికొచ్చిన అతిథులకు

భోజనం పెట్టకుండా గుమ్మంలోనే మాట్లాడడం మీ సాంప్రదాయమా?" అన్నాడు సూర్యం.

"మైగాడ్- బావమరిది వనిపించావ్... పద..పద..భోజనాలు చేసేద్దాం.." అంటూ లోపలికొచ్చాడు.

ఆ రాత్రి భోజనాలయ్యాక- అందరూ హాల్లో కూర్చున్నారు.

"థాంక్యూ వెరీమచ్ మిస్టర్ స్వాగత్- మీ ఆతిథ్యానికి నా కృతజ్ఞతలు-"

"అదేవిటి? అప్పుడే వందన సమర్పణ చెప్పేస్తున్నారు?" అన్నాడు ఆమెనే రెప్ప వాల్చకుండా చూస్తున్న సూర్యం ఆమె తనని చూసేసరికి చప్పున తల దించుకున్నాడు.

చిన్నగా నవ్వి అంది శ్రీమతి.

"యస్ మిస్టర్ స్వాగత్- నాకు ఇల్లు దొరికింది. మా పొన్నమ్మ ఫోన్ చేసి చెప్పింది."

"కంగ్రాట్స్- అయితే మీరూ ఓ ఇంటి వారన్నమాట" అన్నాడు స్వాగత్.

"అంత తొందరేమొచ్చిందే నీకు? అయినా ఇక్కడే ఉండొచ్చుగా? వేరే ఇల్లెందుకు నీకు?"

"షటప్! కొత్తగా పెళ్లయిన మొగుడూ పెళ్లాల మధ్య పుడకలా నేనెందుకు? ఏ వంటావ్ యంగ్‌మాన్?" అంది.

సూర్యం తడబడి-

"యస్సెస్- అవునవును-" అన్నాడు.

కసిగా ఆమె తొడమీద గిల్లింది నవ్య.

కెవ్వుమంది శ్రీమతి.

"ఏమైంది?" కంగారుగా అడిగాడు స్వాగత్.

"మీ శ్రీమతి నాకిచ్చిన బహుమతి-" అంది నవ్వుతూ.

లవ్ గేమ్

"సారీ శ్రీమతి నాది కాదు-" అన్నాడతను.

"మరి" ఆశ్చర్యంగా అంది శ్రీమతి.

"శ్రీమతింకా ఎవరిదీ కాలేదు మేడమ్!" అన్నాడు నవ్వుతూ.

"ఓహ్! యు ఆర్ ఫన్నీ-" అంది పెద్దగా నవ్వుతూ శ్రీమతి.

పది నిమిషాల్లో బేగ్ తీసుకుని రెడీ అయింది శ్రీమతి.

నవ్య ఆమెను చాటుగా బ్రతిమాలుతూనే ఉంది. గదిలోకి తీసుకెళ్లి చెప్పింది శ్రీమతి.

"చూడవే స్టుపిడ్! ఇలా మనిద్దరం కలిసి ఉంటే మన ప్రయత్నాలమీద అతని కనుమానం వస్తుంది. అందుకే మనం వేరు వేరుగా ఉండి మన పథకాన్ని అమలు చేద్దాం- ప్రతి రోజు నీకు నేను ఫోన్ చేస్తుంటాను. వీలైతే ప్రతి రోజు ఏదో ఒక టైంలో మనం కలుసుకుని చర్చించుకుందాం. సో డోంట్ వర్రీ...బీ బ్రేవ్.... "

నవ్య దిగులుగానే ఒప్పుకుంది.

ఇంతకాలం మీనాక్షి- శ్రీమతి ఉండడంవల్ల తనకి ధైర్యంగా ఉంది. రేపెవరూ లేకుండా ఇంత పెద్ద ఇంట్లో తానూ- అతను. ఏ క్షణం ఎలాంటిదో ఎవరూ ఊహించలేరు.

అందుకే భయపడుతోందామె.

"ఈ ఇంట్లో మొత్తం ముగ్గురు మగాళ్లున్నారు. యామై కరెక్ట్..." అంది శ్రీమతి బాగ్ తగిలించుకుంటూ.

"యస్..." అన్నాడు స్వాగత్.

"అందులో ఒకతను డేమేజ్ అయి మంచం పట్టాడు-"

"సోవాట్- ఇంకా ఇద్దరమున్నాం. మీకే విధమైన సహాయం చేయగలరో అడగండి-" అన్నాడు స్వాగత్.

"ఏమీలేదు. నన్ను మా యింటివరకూ డ్రాప్ చేయగల మగధీరుడెవరా అని చూస్తున్నాను-" అంది నవ్వుతూ.

ఆమెను పక్కన కూర్చోబెట్టుకుని సరదాగా కబుర్లు చెప్పకుంటూ డ్రాప్ చేయవచ్చునన్న ఉద్దేశ్యంతో.

"అయాం రెడీ!" అంటూ ముందుకొస్తాడనుకొన్న స్వాగత్.

"సారీ మేడం... ఈ రోజు చాలా అలసిపోయాను. డ్రైవింగ్ చేసే ఓపిక లేదు-" అన్నాడు.

నవ్య, శ్రీమతి చూపులు కలుసుకున్నాయి.

శ్రీమతి చూయింగ్ గమ్ తీసి నోట్లో వేసుకుంది.

"మీ కభ్యంతరం లేకపోతే నేను డ్రాప్ చేస్తాను-" అన్నాడు సూర్యం.

గదిలో పడుకున్న మన్మథరావ్ హృదయం బాధగా మూలిగింది.

"ఈజిట్? కానీ ఓ రిక్వెస్ట్..." అంది శ్రీమతి.

"చెప్పండి-"

"కోర్టులో టెన్నిస్ ఆడినంత రాష్‌గా డ్రైవ్ చేస్తే నేను రాను-" అంది.

రెండు క్షణాలు ఆగి అన్నాడతను.

"రాష్ డ్రైవింగ్ వల్ల నాకూ నష్టమే. ఎందుకంటే మీ బాధే నా బాధ గనుక-"

ఒకే ఒక్క క్షణం అతని కళ్లలోకి చూసిందామె.

ఏ భావమూ కనిపించలేదామెకు. చాలా

రేఖ వివాహం!



'సావన్ బాధోం' (శ్రావణ మేఘాలు) హిందీ సినిమాతో దక్షిణాపథం నుంచి 14 సంవత్సరాల



పిన్న వయసులోనే దండయాత్ర చేసి నెంబర్‌వన్ హీరోయిన్‌గా, నటించిన ప్రతిసినిమాలోను పేరు, ప్రఖ్యాతులు బాగా సంపాదించుకున్న సినిమాతార 'రేఖ' అమితాబచ్చన్‌తో ఎన్నో హిట్ చిత్రాలు నటించింది 1970లో ఈమె అప్పటి హీరో వినోద్‌మెహతాను పెండ్లి చేసుకుందన్న పుకార్లు చాలా వచ్చాయి. దరిమిలా రేఖ వివాహం మీద అప్పుడప్పుడు సినిమా పత్రికలు రకరకాల వార్తలు వేస్తూనే వున్నాయి. కాని ఈ సారి మాత్రం ఢిల్లీ పారిశ్రామికవేత్త శ్రీ ముఖేష్ అగర్వాల్‌ను మార్చి 4వ తేదీ నాడు బొంబాయిలో గప్‌చిప్‌గా కొంత మంది అంతరంగిక మిత్రుల సమక్షంలో వివాహం చేసుకొని వెంటనే హనీమూన్ కోసం లండన్ వెళ్లినట్లు బొంబాయిలోని ప్రముఖ పత్రికలన్నీ వార్త వేయటంతో ఈ సారి ఆమె వివాహ వార్త నిజమేనని ఆమె అభిమానులు అనుకుంటున్నారు. రేఖ అలనాటి మేటి తెలుగు నటి పుష్పవల్లి కుమార్తె అని, యిప్పటికీ చక్కగా తెలుగులో మాట్లాడగలదని కొంత మందికే తెలుసు.

మనస్ఫూర్తిగా నిజాయితీగా స్వచ్ఛంగా అతని గుండె మాట్లాడినట్లనిపించింది.

అందరికీ పేరు పేరునా చెప్పి కారెక్కింది.

సూర్యం కార్ స్టార్ట్ చేశాడు.

కారు వేగంగా చీకట్లో కలిసిపోయింది.

స్వాగత్ నవ్యను చూసి అన్నాడు.

"వెరీ స్మార్ట్ గర్ల్!"

ఆమె ముఖం తిప్పుకుంది.

ఆ రాత్రి-

మంచాన్ని దూరంగా జరిపి పడుకున్న నవ్యను చూసి అడిగాడు స్వాగత్.

"అవునూ ఇందాక లీనా బ్యూటీ పార్లర్ అన్నావ్- ఏమిటి?"

మానిన గాయం రేపినట్టయిందామెకు.

విసురుగా ఇవతలికి తిరిగి- అతన్ని తీక్షణంగా చూస్తూ-

"ఏం... నీ రహస్యం ఎలా బయటపడింద్నాని ఆశ్చర్యంగా ఉందా?" అంది.

"రహస్యమేమిటి?" ఆశ్చర్యంగా అడిగాడు.

"ఏం నానోటితో చెప్పిస్తే తప్ప తృప్తిగా ఉండదా?"

"అసలు నువ్వెవరిగురించి మాట్లాడుతున్నావ్?"

"బయట అడ్డమైన తిరుగుళ్లు తిరుగుతూ ఇంట్లో శ్రీరామచంద్రుడిలా పోజ్ కొట్టే నీ గురించే-"

"నవ్యా..." అసహనంగా అన్నాడు.

"ఏం నేనుమాట్లాడింది అబద్ధమా? మగవాడి బుద్ధి కుక్కతోకలాంటిదని నిరూపించావ్. ఆ నాడు జరిగిన సంఘటన నుంచి ఈ నాటి వరకూ నీ నైజంలో మార్పులేదని-రాదని గొప్పగా రుజువు చేశావ్..."

ఆవేశంలో శ్రీమతి హెచ్చరికను కూడా మర్చిపోయి అరుస్తోందామె. అతనికేం అర్థం కాలేదు. లీనా బ్యూటీ పార్లర్‌కీ- తన శీలానికీ సంబంధం ఏవిటో తెలియలేదు. అసలా పార్లర్ ఎక్కడుందో కూడా తెలీదు తనకి-

"అసలేం జరిగిందో దయచేసి చెప్తావా?" తీక్షణంగా చూస్తూ అడిగాడు.

ఆమె ఓ క్షణం మాట్లాడలేదు. ఆవేశాన్ని అదుపుచేసుకుంటూ-

"శైలజ ఎవరు?" అంది.

"నా సెక్రటరీ!" శైలజ నవ్యకెలా తెలుసో అర్థం కాలేదతనికి.

"అంటే ఆఫీసులోనేనా- జీవితంలో కూడానా?"


"నవ్యా!"

"షటప్! పందెం కోసం పంతం కోసం నా మెడలో తాళి కట్టావ్. అవసరం కోసం దాన్ని చేసుకున్నావో- ఉంచుకున్నావో తెలీదు. మొత్తానికి పగలంతా దానితో కార్లో షికార్లు కొట్టి రాత్రయేసరికి బుద్ధిమంతుడిలా- నటిస్తూ- నన్ను గెలవాలని ప్రయత్నం. ఛీ!ఛీ!!"

ఉగాది

తెలుగు నాట వచ్చింది
తెలుగు సంవత్సరాది
ఉగాది
ఇది ప్రమోదూత నామసంవత్సరం
తెలుగు వారి సంబరం
గడపలకు మామిడాకుల
తోరణాలు గట్టే ఉగాది
పచ్చడి చేసి, దాన్ని
ప్రసాదంగా స్వీకరించి,
ఈయేడు తమ
జాతకమెలా ఉందోనని
పంతులు దగ్గరకు
పరుగులిడే ఓ
తెలుగు సోదర
సోదరీ మణు ల్లారా!
మీకివే నా నూతన
సంవత్సర శుభాకాంక్షలు!

-ఆర్. శ్యామల



"పల్లెపట్టున పంచాంగ శ్రవణం"
చిత్రం: పి. పి. నాయుడు

"అంటే శైలజను నేను చేసుకుని ఆమెను కారులో షికార్లు తిప్పుతున్నానా?"

"ఏం నిజం కాదా?"

"కాదు-"

"పచ్చి నిజం మిస్టర్ స్వాగత్. నా కళ్లతో నేను చూశాను."

"ఎక్కడ చూశావ్?"

"లీనా బ్యూటీ పార్లర్‌లో-"

"నన్ను కూడా చూశావా?"

"ఆమెనొదిలి నువ్వెక్కడికో వెళ్లుంటావ్. ఆ తర్వాత వచ్చి ఆమెను తీసుకుని ఊరిమీద పడుంటావు. ఆమె స్వయంగా చెప్పింది మిస్టర్ నువ్వు దాని మొగుడివని! ఇంకేం కావాలి రుజువు?"

అతనికి పరిస్థితి కొంచెం కొంచెం అర్థమవసాగింది.

సిగరెట్ తీసి వెలిగించాడు.

ఓ అయిదు నిమిషాలు ఆలోచించాక అతనికి విషయం అర్థమయింది. ఆ వెంటనే పెద్దగా నవ్వాడు.

కసిగా చూసిందతన్ని ఆమె.

"వెరీ గుడ్! నీ ఊహకు జోహార్లు. కాని మైడియర్ మిస్- నీ అంచనా తప్పు. ఆమెతో కలిసి నేను అసలింతవరకూ బయటికేవెళ్లలేదు!"

"కానీ ఈ రోజు వెళ్లావ్. నన్ను నమ్మించాలని వ్యర్థ ప్రయత్నం చేయకు-"

"నేను వెళ్లలేదని నిరూపిస్తే-"

"నిజంగా నువు నిరూపించగలిగితే- "

ఆవేశంతో ఊపిరి పీల్చి- క్షణమాగి-

"నువ్వంటే నాకెంత అసహ్యమో నీకు తెలుసు. నీ ఉనికినే భరించలేని ద్వేషం నాకు నీమీద. అందుకే అలా నువ్వు నిరూపించగలిగితే నేను నిన్ను ముద్దు పెట్టుకుంటాను-"

ముఖం మీద చెమట కారిపోతుండగా- కోపంతో పెదవులు వణుకుతుండగా మళ్లీ అందామె.

"అర్థమైందనుకుంటాను మిస్టర్! నేను చూసింది నిజమేనని నాకెంత గట్టి నమ్మకమో అర్థమైందనుకుంటాను-"

అతను ఆమెనే తదేకంగా చూసి తల దించుకుని-

"అర్థమైంది-" అన్నాడు.

"ఒకవేళ నువు నిరూపించలేకపోతే-" అందామె.

"నా పెదవుల్ని ముద్దాడడానికి సిద్ధపడిన నువ్వు నేను నిరూపించలేకపోతే నడి రోడ్డు మీద నీ చెప్పుతో నన్ను కొట్టు..చాలా.." అన్నాడతను.


"అలాగే- తప్పకుండా-" ఆనందంగా అందామె.

అతను నెమ్మదిగా వెళ్లి టేబుల్‌మీదున్న కాసెట్ తీసి- వీడియోలో పెట్టి అన్నాడు.

"నా ప్రవర్తనలో ఏ మచ్చా లేదని నీ ఊహలన్నీ అపోహలనీ ఇప్పుడు నేను నిరూపించబోతున్నాను-"

అతను వీడియో ఆన్ చేశాడు.

(ఇంకా వుంది)



సరి "కొత్త" శీర్షిక

హల్లో డాక్టర్! నేనేం చెయ్యాలి?



డా. కొత్త రవీంద్రబాబు

పి. కృష్ణకుమారి, పర్లాకిమిడి:–

నా వయస్సు 16 సంవత్సరములు. తెల్లబట్ట అవుతుంది.

డాక్సిఐ గొట్టం, టిన్‌డాకాప్స్ గొట్టం వారం రోజులపాటు ఉదయం సాయంత్రం వాడండి. తగ్గకపోతే లేడీ డాక్టరుకు చూపండి

రాధిక, కైకలూరు:–

మొటిమలు తగ్గి నల్ల మచ్చ లొస్తున్నాయి. జెబెక్స్ బిళ్ళల వలన ఏమైనా హాని జరుగు తుందా?

నల్లమచ్చలు క్రమేపీ తగ్గవచ్చు. జెబెక్స్ బిళ్ళల వలన హాని ఏమీ జరుగదు.

అభాగ్యురాలు, విజయవాడ:–

సన్నగా వుంటాను. వయస్సు 20 సంవత్సరాలు. ఏం చేయాలి.

పాలు, గుడ్లు, పళ్ళు తినండి రోజుకో స్ట్రాంబా బిళ్ళ రెజులివ్ బిళ్ళలు ఉదయం సాయంత్రం ఆరునెలల పాటు వాడి చూడండి. అదే పనిగా దిగులు పడినందు వలన మరింత నష్టం జరుగు తుంది.

కె. వి. ఎస్. రావు, నెల్లూరు:

(1) బ్రహ్మచర్యం వలన ఆయుష్షు పెరుగుతుందా?

(2) వైన్ తాగితే మంచిదా?

(3) బుగ్గలు లావవాలంటే ఏం చేయాలి?

(4) మణికట్టుమీద కాల్చితే పచ్చ కామెర్లు తగ్గుతాయా?

(5) కృత్రిమ స్త్రీ మర్మాంగం తయారు చేయగల్గితే స్త్రీతో పని ఉండదు గదా.

(6) వాక్యూం పంపు వలన అంగ పరిమాణం పెరుగుతుందా?

1) బ్రహ్మచర్యానికి ఆయుష్షుకు సంబంధం లేదు.

2) వైన్ తాగినందువలన ఏ ఉపయోగం ఉండదు.

3) బుగ్గలు లావవాలంటే కొవ్వు పదార్థాలెక్కువగా తినాలి అది ఆరోగ్యానికంత మంచిది కాదు.

4) మణికట్టు మీద కాల్చితే పచ్చకామెర్లు తగ్గవు.

5) పురుషునికి తృప్తి కల్పించే కృత్రిమ స్త్రీ అంగం పాశ్చాత్య దేశాలలో అమ్ముతారు. కాని మానవజాతి కొనసాగాలంటే ప్రపంచంమీద స్త్రీ పురుష లిరువురూ సహజీవనం చేయాలి

6) వాక్యూం పంపు వలన పురుషాంగ పరిమాణం పెరగడం అన్నది ఒక మిథ్య అమాయక యువకులను మోసగించే ఒక ప్రక్రియ.

టి. విశ్వనాథ్, న్యూ గాజుల్లంక:

ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌తో బాధ పడుతున్నాను.

మీకంటే అభాగ్యు లెందరో యీ ప్రపంచంలో వున్నారన్న విషయం తరచు గుర్తు తెచ్చుకోండి మీకు యిష్టమైన పనిలో నిమగ్ను లవండి. వికలాంగులు, నిరక్షరాస్యులు, నిర్భాగ్యులు, బాధాతప్తులు, అదృష్టహీనులకు సహాయ పడడంతో మీలోని ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్‌ను పోగొట్టుకో ప్రయత్నించండి లిబోట్రిప్ బిళ్ళ రాత్రి బీటాకాప్ 40 మిల్లి గ్రాముల గొట్టం ఉదయం రెండు నెలల పాటు వాడి చూడండి

కె. వెంకటేశ్వరరావు నాగాయలంక:

వయసు 19 సంవత్సరాలు. పొడుగు పెరగాలి.

రాక్సిన్ బిళ్లలు రోజు ఉదయం సాయంత్రం రెండేళ్లు వాడి చూడండి.

ఈ పిల్లకు పెళ్ళవుతుందా?

శారదా అశోకవర్ధన్

కొబ్బరాకులతో అందంగా తయారు చేయబడ్డ మంటపానికి పూలతో అలంకరణ దగ్గరుండి చేయిస్తున్న హేమసుందర్, శ్రీనివాస్ చెప్పిన మాటలు విని కుప్పగా కూలిపోయాడు.

మొగ పెళ్ళివారికి పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా పెద్ద సైజులో తయారు చేయించిన లడ్డూలు, సున్నుండలూ, బూందీ గంపలను లోపల గదిలో పెట్టడానికి వెళుతూ భర్తతో ఏదో చెప్పాలని మంటపానికేసి వొచ్చిన ప్రసూనాంబ భర్త చెమటలు కక్కుతూ అలా కుర్చీలో చతికిలబడడం చూసి కంగారుగా వొచ్చి శ్రీనివాస్ చెప్పిన వార్త విని, కళ్ళు తిరిగినట్టయి, అక్కడే కూర్చుండిపోయింది విద్యుద్దీపాల తోరణాలను ఇంటిచుట్టూ కట్టిస్తూన్న దినేష్ దూరం నుంచి ఈ దృశ్యాన్ని చూసి పరిస్థితేమిటో అర్థంకాక పరుగెత్తుకుంటూ వొచ్చి, శ్రీనివాస్ ద్వారా విషయాన్ని తెలుసుకుని నిశ్చేష్టుడైపోయాడు నిమిషాల్లో వార్త పందిరంతా పాకిపోయింది పన్నలో మునిగి సతమత మౌతూన్న వారంతా, మతిపోయిన వాళ్ళలా చలనం లేకుండా వుండిపోయారు గౌరీపూజ చేస్తూన్న అవంతి ఒక్కక్షణంలో పూజ ఆపేసి కొయ్యబారిపోయినట్టు కూర్చుంది!

నవ్వుల చిరుజల్లులతో నిండిన ఆ యిల్లూ ఆ పందిరీ, ఒక్కతృటిలో విషాదంతో అలుముకు పోయింది గుసగుసలు!

రుసరుసలు!

కనుబొమల ఎగరేతలు!

ఆశ్చర్యంతో తెరుచుకున్న నోళ్ళు!

బుగ్గ నొక్కుళ్ళు!

క్షణంలో వాతావరణం మబ్బు కమ్మిన ఆకాశంలా మారిపోయింది

"పెళ్ళికొడుకు కనబడడంలేదుట!" ప్రతీనోటా ఇదేమాట

సినిమాల్లోకూడా పెళ్ళికూతురు కనబడ్డం లేదని చెవులు కొరుక్కోవడం, పెళ్ళికొడుకు తాలూకు వాళ్ళు కోపంతో, పెళ్ళికూతురి వాళ్ళని నానా మాటలూ అనేసి కోపంతో పందిట్లోంచి వెళ్ళిపోవడం చూశాం కానీ పెళ్ళికొడుకు కనబడ్డం లేదని వొచ్చిన వార్తకి ఎలా రియాక్ట్ అవాలో, ఏం చెయ్యాలో తెలీక తికమక పడిపోయి షాక్‌తిన్నారు పెళ్ళికూతురి తల్లీ, తండ్రీ, అన్నదమ్ములూ, అందరూ!

"అయ్యగారూ! మంటపానికి పూలు చుట్టడం పూర్తయింది మా డబ్బు ఇప్పించండి" అని పనివాళ్ళు అడిగేదాకా ఈ లోకంలోకి రాలేదు హేమసుందర్, ప్రసూనాంబ ఈ వార్త వినగానే, దీపాలు పెడుతూన్న ఎలక్ట్రీషియన్ కుర్చీలు తెచ్చిన పర్నిచరు షాపతను కూడా, వాళ్ళ డబ్బులు కూడా ఇచ్చెయ్యమని అడిగారు

"ఉండండి ఇస్తాం ఎమిటా తొందర? ఎక్కడికీ వెళ్ళిపోవడం లేదుకదా మేము" గదమాయించాడు పెళ్ళికూతురు అన్నయ్య శ్రీనివాస్

"ఏమండీ! కార్డులు పంచేశాం ఒక పక్కన వంటలయి పోతున్నాయి టిఫినూ, కాఫీలూ రెడీ కూడా అయిపోయాయి ఇప్పుడు టైము మూడు గంటలయింది! ముహూర్తం నాలుగూ పన్నెండు నిమిషాలకు! అప్పుడే మనం పిలిచిన వాళ్ళంతా పెళ్ళికి రావడానికి తయారవుతూ వుండొచ్చును! ఏ మొహం పెట్టుకుని వాళ్ళనందరినీ పలకరిస్తాం? వొచ్చిన వాళ్ళకి ఏం చెబుతాం? ఈ ఏర్పాట్లకీ వాటికీ ఎంత డబ్బు ఖర్చయింది? అటు డబ్బు పోయి, ఇటు పరువూ పోయి, ఏమిటండీ ఇలా జరిగింది? ఇక మన అవంతికి పెళ్ళవుతుందా? ఎవరు చేసుకుంటారండీ దాన్ని?" ఏడుస్తూ నెత్తి



నోరూ కొట్టుకుంటూ పిచ్చిదానిలా అయిపోయింది ప్రసూనాంబ

ఈ వార్త మోసుకొచ్చిన పెళ్ళికొడుకు మేనమామ, పినతండ్రీ, ఆ దృశ్యాన్ని చూసి కళ్ళొత్తుకున్నారు పెళ్ళికొడుకు తమ్ముడు దేవేందర్ ఏడుపు మొహం పెట్టాడు కాస్సేపటికి తేరుకుని గడియారం చూస్తూ హేమసుందర్ వంక చూశాడు "అంకుల్! ముహూర్తానికి ఇంక అరగంట వుంది! మిమ్మల్ని చూస్తూ వుంటే నా గుండె తరుక్కుపోతోంది అన్నయ్య ఎందుకిలా చేశాడో అర్థం కావడంలేదు ఇంతకు ముందే అతడు ఎవరినైనా ప్రేమించివున్నా, ఈ పెళ్ళి ఇష్టం లేకపోయినా, ముందే చెప్పేసి వుంటే పోయేది అంతేకాని పిరికివాడిలా ఇలా సమయానికి పారిపోవడమూ, మిమ్మల్ని ఇబ్బంది పెట్టడమూ నాకు ఏ మాత్రం నచ్చలేదు అతడి తరపున నేను క్షమాపణ చెప్పుకుంటున్నాను

ఐ. యామ్ వెరీ సారీ" అన్నాడు

హేమసుందర్, ప్రసూనాంబా అతనికేసి దీనంగా చూశారు

"అంతా మా ఖర్మ బాబూ" అంది ప్రసూనాంబ నెత్తికొట్టుకుంటూ

"మీ కభ్యంతరం లేకపోతే ఇదే ముహూర్తానికి మీ అమ్మాయిని నేను చేసుకుంటాను" అన్నాడు దేవేందర్

అతడి మాటలకి అందరూ అతనికేసి చూశారు ఎవ్వరికీ నోట మాట రాలేదు మామూలుగా అయితే, మరో అరగంటలో ఈ అమ్మాయి అతనికి వదినగారై వుండేది వొదిన తల్లితో సమానం అంటారు కానీ ఇప్పుడీమె ?" ఆలోచించలేక కళ్ళు తిరిగినట్టయితే, మోకాళ్ళమీద గడ్డాన్ని ఆనించి ఆలోచిస్తూ కూర్చున్నాడు హేమసుందర్‌గారు

ప్రసూనాంబ నోట మాటరాక, అవుననాలో కాదనాలో అర్థం కాక, అరగంట క్రితమయితే, మరిదిగా ఆమె కాళ్ళకి దండంపెట్టి నిల్చునే వ్యక్తిని ఇప్పుడు భర్తగా భావించి అతడికి దండం పెట్టాలని ఎలా చెప్పాలో అర్థంకాక, అయోమయంలో పడిపోయి స్తంభించి పోయింది ఆమె

పరిస్థితిని అర్థం చేసుకున్న కొందరు సరాసరి ఈ సమస్యని అవంతికే వొదిలేశారు

అవంతి కాస్సేపు బాగా ఆలోచించి తన భావాలను వ్యక్తం చేసింది

"చూడండి! 'బర్త్ ఈజ్.. ఆక్సిడెంటల్!' అన్నారు పెద్దలు! ఒక పిల్లాడు ఈ దేశంలో పుడితే ఇండియన్ అయ్యాడు మరో దేశంలో పుట్టుంటే ఆ దేశస్థుడయి వుండేవాడు అలాగే ఈ ప్రాంతంలో పుడితే మన భాష మాట్లాడుతాడు. మరో ప్రాంతంలో పుడితే ఆ భాషే మాట్లాడుతాడు. అలాగే మనింట్లో పుడితే మనకులం మరో ఇంట్లో పుడితే వారి కులం! అలాగే 'మేరేజెస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్!' అంటారు ఈ పెళ్ళి అనుకున్న విధంగా జరిగుంటే అతను నాకు మరిదై వుండేవాడు లేద. కనుక, ఇప్పుడితడు అందరిలాగే ఏమీకాడు కనుక, ఈ ముహూర్తానికి నా పెళ్ళి నిస్సందేహంగా ఇతడితో కానిచ్చెయ్యండి! ఇదొక పెద్ద సమస్యగా, నేను మీకు భారంగా కాకూడదు" అంది

అందరి హృదయాలూ తేలికపడ్డాయి

ప్రసూనాంబ సంతోషంతో కూతుర్ని కౌగిలించుకుంది


"అమ్మా! తొందరపడి ఏ నిర్ణయమూ తీసుకోకమ్మా బాగా ఆలోచించుకుని చెప్పు నువ్వు మాకేమీ భారం కావు' అన్నారు హేమసుందర్‌గారు కంఠువాతో కళ్ళొత్తుకుంటూ

"ఆలోచించుకునే చెప్పాను నాన్నా! మిగతా కార్యక్రమం కానివ్వండి" అంటూ గౌరీ పూజలో నిమగ్నమైంది అవంతి

"బాబూ! దేవేందర్! అమ్మాయి ఒప్పుకుంది' అన్నారు హేమసుందర్ దేవేందర్‌తో

"వెరీగుడ్!" అని "అంకుల్! ఒక్క రిక్వెస్టు! మిగతా విషయాల్లో తేడా ఏమీ లేదు కాకపోతే మీరు నాకొక మోటార్ సైకిల్ కొనివ్వాలి! అదొక్కటే అన్నయ్యతో మీరొప్పుకున్న వాటికన్నా నేను అదనంగా అడుగుతూన్నది ఏమీ అనుకోకండి' అన్నాడు

హేమసుందర్ గుండెల్లో రాయి పడింది. ఇప్పటికే ముప్పై వేలూ, ఇరవై తులాల బంగారం, బట్టలూ,



కె.వి. కృష్ణారావు, హైదరాబాదు.

టి.వి.లో రచయితలకి అన్యాయం జరుగుతోంది. నిర్మాతలు మోసం చేస్తున్నారు... దీనికి పరిష్కారం సూచించగలరా ?

* రచయితలని ఎవరు ఎక్కడ మోసం చేయడంలేదు కనుక-టి.వి.లో అన్యాయం జరిగిపోతోందని బాధపడిపోతున్నారు ? బినామీ నిర్మాతలు ఫ్రీగా రాయించుకుని ఎప్రూవ్ చేయించుకుని-సీరియల్స్ నిర్మించేస్తున్నారనీ, వారికి-అలా చేయగల నేర్పు చొరవా వుండడమే అందుకు కారణం అనీ, సబ్జెక్టు చూసి కాక ఇతర లాంఛనాల ప్రాధాన్యంవల్ల ఒక వావీవరసాలేని సీరియల్స్ వస్తున్నాయనీ చెప్పుకుంటున్నారు. నాకు ఆ అనుభవం లేదు ! రచయితలే తమ రచనలని టి.వి.వారికి పెట్టి ఎప్రూవ్ చేయించుకుని-తరవాత నిర్మాతలకి అమ్ముకోవడం- ఒక పద్ధతి-ధైర్యం వుంటే-నిర్మాణం చేబట్టి నిరూపించుకునే ప్రయత్నం చేయడం-మరొకపద్ధతి. ఎవరేనా నిర్మాత అడిగేదు అంతే చాలునని సబ్జెక్టు రాసియివ్వకుండా వుండడం నేర్చుకోవాలి...ఎన్నాళ్లు రచయితల మీద బడి యీ పేరసైట్లు బ్రతుకుతాయి? ...చూద్దాంమరి యీ కొత్త ప్రసార మంత్రి

ప్రశ్నావళి

కాస్త తెలుగొచ్చిన వ్యక్తి కద? ఎలాంటి 'విషయాలు' టి.వి.లో వస్తున్నాయో చూడరా ? ఎవరైనా చెప్పరా ?!

డి. హరనాథ్, వరంగల్.

మనిషికి తనపై నమ్మకం లేనప్పుడే దేవుణ్ణి నమ్ముతాడు?

* తనపై నమ్మకం లేనివాడిని దేవుడు కూడ నమ్మడు. స్వశక్తికి దైవబలం సమకూరాలన్న ఆశ అది - అంతే. వినలేదా-తనపని తన ప్రయత్నం తాను చేసుకున్న వాడికే దైవం కూడా చేయూత నిస్తాడని.

స్నేహం కన్న మిన్న లోకాన లేదురా అంటారు. నిజమే. కాని అది డబ్బు విషయం వచ్చేసరికి - అది మారిపోయే అవకాశం వుంది. అలా జరగడానికి కారణం?

* డబ్బుకీ - స్నేహానికి ముడిపెట్టడమే.

గొట్టాపు దుర్గారావు, గోపాలపురం

ఆడపిల్ల యింటికి శ్రీ మహాలక్ష్మి లాంటిది. మరి మగవాడు!

- కె. రామలక్ష్మి

* శ్రీ మహాలక్ష్ముడు! (మహాలక్ష్మి కంటే గొప్ప. కట్నం తెస్తాడు కదా!)

కడార్ల రాజేందర్, జగిత్యాల

మీ భవిష్యత్తులో మరుపురాని సంఘటన ఏది? పెళ్లిమాత్రం కాదండోయ్!

* 'భవిష్యత్తు'లో మళ్లీ పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం లేదయ్యా రాజేంద్ర! 'ఒన్ మాన్ ఒన్ ఉమెన్' వాదిని నేను!!

ఇంటర్ ఫస్టు యియరు చదువుతున్నా, తరవాత ఏం చెయ్యాలి?

* ముందీ పులుసుతో యీ ముద్ద దిగని య్యవయ్యా! ఇంటర్ అయ్యాక ఆలోచించు

శ్రీ కొండ నవీన, గూడూరు

శ్రమకు తగ్గ ఫలితం ఏ దేశంలోనైతే పొందకల్గుతారో అట్టి దేశం నా మాతృ దేశంగా భావిస్తాను.

* మరైతే యింకా గూడూరులోనే వున్నా వేంభాయీ - బయలుదేరు! (ఎటొచ్చీ అలాంటి దేశం ఎక్కడా లేదని వర్తమాన చరిత్ర కోడై కూస్తోంది.)

డి.యస్.ఎమ్. రావు, మడిచర్ల.

శుభంగా శోభనం గదిలో, శోకంగా భర్తపో యాక, శృంగారంగా సినిమాల వర్షం పాటలో తెల్లచీర కడతారెందుకూ ?

* సింపుల్. ఆడదాని శరీరంపై లోకువ.

మహమ్మద్ రఫీ, శ్రీకాకుళం

వరకట్నం చావులు తగ్గాలంటే?

* అబ్బాయిలకీ అమ్మాయిలకీ కాస్త పౌరుషం పెరగాలి. చదివి సంపాదన ప్రారం భించాకగాని వివాహ ప్రసక్తి తలపెట్టకూడదు. స్వంత కాళ్లమీద నిలబడలేని వాళ్లు - తల్లి తండ్రులచాటు వాళ్లు. వాళ్లది ఆధారపడే స్థితి కనుక అడిగే హక్కు వుండదు.

మీ సమాధానాలు చదివి చైతన్యవంతు లైన వారిలో నేనొకణ్ణి. నిజంగా కట్నం లేకుండ పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకు న్నాను. ఒక్క షరతు. పెళ్లికి మీరు వస్తారా?

* ఎవరు రాకపోయినా అని నిర్ణయిం చుకోవాలి. కట్నం వద్దనుకున్నాను - అని తరవాత దెప్పి చంపడం, 'నేను కనుక యింత త్యాగం చేసి పెళ్లి చేసుకున్నాను - పడి వుండు' అన్న ధోరణి ప్రదర్శించడం కూడా చాలాచోట్ల చూసిన మనిషిని. అంచేత నా కిలాంటి బుల్లి బుల్లి షరతులు కూడా పెళ్లి విషయంలో యిష్టం వుండదు.

సిహెచ్. రామారావు, సికింద్రాబాదు

నిజమైన జీవితం దేన్లో వుంది కె.రా.?

* లాఫ్టర్ లవ్ అండ్ వర్క్, రా.రా!

డి.వి.ఆర్. రావు, విజయవాడ

ఈ స్త్రీల పరిస్థితిపై మీ అభిప్రాయం చెప్పండి - అన్నీ వుండి గౌరవం లేకుండా ఎలా బ్రతుకుతున్నారు?

* రావుగారు, స్త్రీ జాతి చరిత్ర చరిత్రలోనే అతి దారుణమైన నియంతృత్వం - చరిత్రలో యిటువంటి స్థితి - ఎవరూ ఎప్పుడూ చూసి వుండరేమో - బహుశా తెలిసీ వుండదు! ఒక బలహీనపువర్గం - ఒక బలమైన జాతిపై యిటువంటి నియంతృత్వం చెలా యించకల్గడం - అది కొనసాగుతూరావడం చాలా భయంకరమైన సత్యం . స్త్రీని అబలగా నిరూపించాలన్న తాపత్రయం దేనికోసమో?!

○

అలమార, మంచాలూ, డైనింగ్ టేబులూ, కుర్చీలూ టీపాయ్, కలర్ టీ వీ. ఇవన్నీ ఇవ్వడానికి తాతలు దిగొచ్చారు ఇతగాడు కొత్తగా మోటారు సైకిలు కూడా అడుగుతున్నాడు అంటే కనీసం మరో ఇరవై వేలు' ఎక్కణ్ణుంచి తేవాలి!"

గుడ్లు తేలేసి గుటకలు మింగుతూ కూలబడ్డారు హేమసుందరు గారు చీరకొంగు నోట్లోకి అడ్డు పెట్టుకుని, వెక్కి వెక్కి ఏడ్చింది ప్రసూనాంబ శ్రీనివాస్, దినేష్‌లు ఈ దృశ్యాన్ని చూడలేక, ఈ సంఘటనలకి తట్టుకోలేక చాటుగా ఒక మూల కూర్చున్నారు విధిని నిందిస్తూ

"పద. మామయ్యా ఎళదాం!" అన్నాడు దేవేందర్ తిరుగుముఖం పడుతూ.

"ఆగండి! మోటారు సైకిల్ ఒక నెలలోగా కొనిస్తాను ఇవి చేతులు కావు, కాళ్లు కాదనకు బాబూ!" బతిమిలాడారు హేమసుందర్‌గారు

"నాకు 'సుజుకి' మోటారు సైకిల్ ఎల్లాటుమెంటు వొచ్చిందండీ! ఒక వారంలోగా డబ్బు కట్టి తీసుకోవాలి" సణిగాడు దేవేందర్

"ఎలాగో చూసుకో బాబూ! లేకపోతే కట్నం డబ్బుల్లోంచి కొనుక్కుని ఏదో చెప్పే లోపలే, "ఆ డబ్బు ఏనాడో పెళ్లి కర్చులకే అయిపోయింది" వెనక్కి మళ్ళుతూ అన్నాడు దేవేందర్.

"బాబూ! నా మాట మన్నించు! ఏదో ఏర్పాటు చేసుకో! ఒక నెలలో డబ్బిచ్చేస్తాను" దేవేందర్ చేతులు పట్టుకుని బతిమిలాడు తూన్న తండ్రిని చూసి,

"నాన్నా! ఆడపిల్లని కన్నంత మాత్రాన ఆత్మాభిమానం చంపుకుని అలా కాళ్ళు పట్టుకుని బతిమిలాడఖ్ఖర్లేదు ఈ పెళ్లి నేను చేసుకోను!" నిశ్చలమైన కంఠంతో గట్టిగా చెప్పేసింది అవంతి ఆమె కోపంతో ఊగిపోతోంది దేవేందర్ వైపు అసహ్యంగా చూసింది ఆ చూపులు 'ఛీ!' అన్నట్టుగా వున్నాయి

ఈ పిల్లకు పెళ్ళవుతుందా?

"అమ్మా! ఏమిటిది?" కూతుర్ని వారించ బోయారు హేమసుందరు గారు

"నాన్నా! అతడు గుణంలేనివాడని నిరూపించాడు ఇతడు డబ్బు మనిషి నని ఋజువు చేసుకున్నాడు ఇటువంటి వారితో వియ్యమందడం మీకు అప్రతిష్ఠ! నాకు తలవంపు! అతణ్ణి వెళ్లిపొమ్మనండి ఈ పెళ్లి ఈ రోజు జరగడం లేదని వొచ్చిన వాళ్లకి చెప్పించండి!

నాకు ఉద్యోగముంది! నా బతుకు నేను బతగ్గలను జీవితంలో పెళ్లొక్కటే ముఖ్యం కాదు పెళ్లి అవసరమే కానీ ఇలా గుణహీనులనీ, డబ్బు మనుషులనీ, ఎవర్నో ఒకర్ని కట్టుకుని, కళ్ళు మూసుకుని కాలం గడిపే కాలం మారింది! ఆడపిల్ల గొడ్డు లాంటిది కాదు నోరు మూసుకుని పడుండడానికి! పెళ్లి నా కెంత అవసరమో అతనికీ అంతే అవసరం! నా ఇష్టం వొచ్చిన మనిషి, నాకు నచ్చినప్పుడు పెళ్లి చేసుకుంటాను లెట్.. హిమ్ గో' అంటూ ఉరుములా అరిచిన అవంతిని చూస్తూ బొమ్మల్లా నిలిచి పోయారు అందరూ

ఆమె గిరుక్కున వెనక్కు తిరిగి లోపలికి వెళ్లిపోయింది

అవమానంతో తల తిరిగి పోతూ వుంటే తలవంచుకుని వెళ్లిపోతున్న దేవేందర్‌ని అందరూ జంతువుని చూసినట్టు చూసేరు

పెళ్లికి వొస్తున్న వాళ్లందరికీ అవంతి స్నేహితులే అక్కడ రాసి పెట్టిన బోర్డుని చూపించారు 'పెళ్లి కాన్సల్ అయింది సారి ఫర్ ది ఇన్‌కన్‌వీనియన్స్' అని!

ఆ రోజు అక్కడి కొచ్చిన వాళ్లంతా అవంతి ధైర్యాన్నీ ఆలోచనల్నీ మెచ్చుకున్న వాళ్లే!

"సహన శీలుడికి ఆగ్రహం వొస్తే తట్టు కోవడం కష్టం అంటారు కానీ "ఆడపిల్ల ఆగ్రహిస్తే! ఇలా అవినీతికి ఎదురు తిరిగితే! మరో దుర్గావతారం!" అన్నారు కొందరు

'కన్యాశుల్కం' పీడ వొదిలింది 'వరకట్నం' వెడద పోవాలంటే, ఆడవాళ్లే ముందుకు రావాలి' అన్నారు కొందరు!

అవంతి తెలిగ్గా నిట్టూర్చింది! మర్నాడు తెరవబోయే యూనివర్సిటీ, స్పెషల్ కోర్సులూ, అప్లికేషన్సూ గురించి ఆలోచిస్తూ, తనకు ఉద్యోగంలో కూడా పనికొచ్చే కోర్సుల గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారుకుంది!

"దీనికింక పెళ్లవుతుందా?" ప్రసూనాంబ ఆలోచిస్తూ ఏ అర్ధరాత్రికో నిద్రలోకి జారుకుంది! కొన్ని వేల ఆడ గొంతుకలు వేసే ప్రశ్న ఇది!

* (సమాధానం సమాజమే చెప్పాలి, అంటే మీరే!)

○

ఈవారంలో మీ యోగం

23-3-1990
శుక్రవారం మొదలు
29-3-1990
గురువారం వరకు

మేషం: క్రమంగా 'శని', 'గురులు' అనుకూలింపనున్నారు. నూతన వ్యాపారం చేయాలని కొందరికి ఉబలాట, యింకా కాలం కలిసిరాలేదు. ఆరోగ్యరీత్యా ఒడిదుడుకులు రాకుండా చూచుకోండి. వృత్తివికాసం చెప్పదగిన అంశం స్త్రీలకు: శుభకరం, వృత్తివికాసం. కొందరకు నూతనోద్యోగం.

వృషభం: రాజకీయాలు మీకు అనుగుణంగా ఉంటాయి. శ్రమించి గెలుచుకొన్న అధికారాన్ని పోగొట్టుకోకండి. లేనిపోని వ్యవహారాలలో జోక్యం కలుగజేసికోరాదు, ప్రజాసేవకు అంకితం కావటమే శ్రేయస్కరం. ధనలోపం లేకుండా కాలం గడచిపోతుంది. స్త్రీలకు: సుఖశాంతులు, ఉద్యోగమందు పెంపు, స్వల్పాదాయం.

మిధునం: పదిమందిలో ప్రతిష్ఠయున్నది. పాత్రికేయులకు, పత్రికాధిపతులకు, పంపిణీదారులకు, ఆట పాటలందు ప్రావీణ్యత గలవారికి సకల విధాలా లాభదాయకమని, ఆరోగ్యమందు అభివృద్ధి చేకూరగలదని గ్రహించగలరు. స్త్రీలకు: నూతన వ్యక్తుల పరిచయం, నూతనాంశాలు గ్రహించుటకు వీలు.

కర్కాటకం: వారమంతా యోగదాయకం. చుట్టుప్రక్కల వారి సహాయ సంపత్తులు ఏదో విశిష్టమైన కార్యాచరణమందు లాభమున్నదని ఆనందిస్తారు. ఒకానొక కుటుంబ వ్యవహారం శ్రమకరమైనా లాభదాయకం. స్త్రీలకు: వృత్తి యందు అనుకూలం. ఆరోగ్య వర్ధన సమయం, గ్రహించండి.

సింహం: వివిధ విషయాలు గ్రహించుటకు అస్కారం. బహుశుభదాయకం. ఆట పాటల్లో ప్రావీణ్యత గల వారికి చక్కని అవకాశాలు. రాజకీయంగా చక్కని అవకాశాలు. ఆనందదాయకం. ఆరోగ్యదాయకం. వస్త్ర, వాహన సేకరణకు అనుకూలం. స్త్రీలకు: నూతన వ్యక్తుల పరిచయం. బంధు సమాగమం.

కన్య: వ్యవహార రీత్యా అనుకూలం. ఈవారాన్నుండి మరి కొన్ని వారాలు 'శని' అనుకూలింపనున్నాడు. ఆరోగ్యం క్రమాభివృద్ధినందనున్నది. వృత్తి యందు మార్పు చెప్పవచ్చు. కొందరు 'ప్రమోషన్' ఆశింపవచ్చు. పత్రికారంగాన శ్రమించు వారికి మేలు. పాత్రికేయులకు లాభదాయకం. స్త్రీలకు: సుఖశాంతులు, ఆనందం, ఆరోగ్యమందు పెంపు.

ఆమని భామ

ఆమని భామా-ఇటురా-లేమా
కమ్మని పాటలు-యివె గైకొనుమా !!ఆమ!!

నీ ఆగమనం-జగతికి మోదం
నీ ఆశయమే-ప్రగతికి మార్గం
నీ ఆనందమె-కవిజన గానం
నీ అనురాగమె-జన సమ్మోదం !!ఆమ!!

చల్లగ విరిసెను-సన్నజాజులు
మెల్లగవిచ్చెను-మల్లెలు, మొల్లలు
ఘల్లని ఆడెను-వనమయూరములు
కొల్లగపండెను-తీయని మావులు !!ఆమ!!

తళ తళ మెరిసెను-తరుసంతతులు
కువకువ మ్రోసెను-పిక దంపతులు
నయగారముగా-నీవిటురాగా
నవగానములే-ఝుమ్మని మ్రోగా !!ఆమ!!

-పి.వి. సీతారామమూర్తి

తుల: 'శని, గురు, శుక్ర గ్రహాలు' అనుకూలురు. యోగాభివృద్ధికి మరేం కావాలి, వృత్తియందు అధికాదరణ యోగం. నూతన వృత్తి చేపట్టుటకు, ఎంతైనా అనుకూలమని, శుభసమయమని, చిత్ర రంగాన ప్రసిద్ధియున్నదని, గ్రహింపగల్గుతారు. స్త్రీలకు: మనశ్శాంతి.

వృశ్చికం: 'శని' ఆశీస్సులందుకొనుటకు, మీ పద్ధతి యోగాఢ్యం అగుటకు యింక కొన్ని రోజులున్నది. అబ్బా! పడ్డపాట్లు చాలునిపించి, ఈ వారమంతాయోగదాయకంగా, ఆనందదాయకంగా, విలువగల వస్తువులు కొనుగోలు చేయుటకు మేలుగా ఉండే సమయం. అలాంటి గ్రహస్థితి. స్త్రీలకు: సర్వవిధాలా మేలే.

ధనుస్సు: ఒకానొక కుటుంబ వ్యవహారం లాభదాయకం. శుభకార్యాలోచనలున్నాయి. కళారంగాన పరిచయం ఉన్నవారికిగాని, ప్రసిద్ధులకుగాని సదవకాశాలుంటాయి. ఎలాంటి విషయంలో కూడ యిబ్బందిరాదని గ్రహించాలి. స్త్రీలకు: ఉద్యోగావకాశాలు, కొందరకు వృద్ధి.

మకరం: పదిమందిలో ప్రసిద్ధి. చాల తక్కువకాలంలో 'శని' అనుకూలుడు కానున్నాడు. 'రవి' అనుకూలత, చెప్పదగిన ముఖ్యాంశం. ఉద్యోగవృద్ధి, వాహన సేకరణ, వ్యాపార నిమిత్తంగాని, చిత్రరంగ వ్యవహార నిమిత్తంగాని దూర ప్రాంతాలకు వెళ్లగలరు. కార్యసిద్ధి. ఆదాయవృద్ధి, శుభకార్యాలోచనలు. స్త్రీలకు:

కుంభం: 'గురు, శుక్ర, శని' గ్రహాలు అనుకూలురు. సభామర్యాదయున్నది. ఆరోగ్యవృద్ధి, అనుకొన్న విధంగా ధనాగమనం. వస్త్ర, వాహన సేకరణ అస్కారం. సభామర్యాద, చలనచిత్ర రంగానుకూలత. ఒక్కటేమిటి సర్వవిధాలా మేలే. స్త్రీలకు: ధనవృద్ధి, కుటుంబవృద్ధి, ధన, ధాన్యవృద్ధి.

మీనం: అవునన్నా కాదన్నా యోగాఢ్యమైన వారం. 'గురుడు' అనుకూలుడు. ముందుకు జరిగి జరిగి వెళ్లవచ్చు, వ్యాపారాన ముందుకు సాగవచ్చు, ఆదాయలోపం లేదు. స్త్రీలకు: కుటుంబానందం, వాహనయోగం, అలాగంటే కొత్త వాహనం కొనుగోలు చేయగలరనిభావం. గ్రహించండి.

-విద్వాన్ కోటసత్యరంగయ్య శాస్త్రి

ఢిఢీర్ ఉగాది పచ్చడి!

ప్రతాప వెంకటసుబ్బారాయుడు



ఉగాది వస్తోందంటే నాకెంతో భయం నిరుద్యోగిగానే క్రొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నానని. ఎన్నో ఆఫీసుల గుమ్మాలు ఆశతో ఎక్కాను. నిరాశతో దిగాను.

పోనీ ఏవన్నా వ్యాపారం చేద్దామంటే అప్లికేషన్‌లకే డబ్బు సర్దుబాటుకాని మధ్య తరగతి కుటుంబం మాది, ఇంక పెట్టుబడి ఎలా పెట్టగలము ? అని ఆలోచిస్తూ నడుస్తున్న నా భుజం మీద చేయివేసి "ఏరా ఇందాకణ్ణుంచి పిలుస్తున్నాను పలకవే !" అంటూ నవ్వేశాడు చలపతిరావు.

చలపతిరావు నా స్నేహితుడు, నా స్నేహితుడు అనటంకన్నా నా శ్రేయోభిలాషి అంటే బావుంటుంది. వాడి బుర్ర చాలా పెద్దది (ఆకారంలో కాదు, ఆలోచనలో).

'ఆలోచనల్లో వున్నాను, నీ మాట వినబడలేదురా' అన్నాను.

"ఏవన్నా విశేషమా?" అడిగాడు.

"ఆ, నిరుద్యోగిగా క్రొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టబోతున్నాను" నా మాటల్లో నిరాశ.

"ఉగాది నాడు నిన్ను వ్యాపారస్థుణ్ని చేయబోతున్నానురా" అన్నాడు.

"సర్లే, పెట్టుబడి పెట్టే సత్తా వుంటే నేనిలా ఎందుకుంటానురా" బాధగా అన్నాను.

"అబ్బే పెద్ద పెట్టుబడి ఏం పెట్టక్కర్లేదురా"

"ఇంతకీ ఏవిట్రా ఆ వ్యాపారం ?" నా ప్రశ్నలో ఆసక్తి.

"ఇన్‌స్టంట్ ఉగాది పచ్చడి"

"ఏరా, జోకా"

"జోక్ కాదురా, మామిడి ఆకులు, వేపపూత కూడా అమ్ముతున్న కరువు కాలంరా ఇది. నువ్వు ఉగాది పచ్చడి అమ్మడం విచిత్రమేం కాదురా! ఇది స్పీడు యుగంరా, సరుకులన్నీ తెచ్చుకుని ఉగాది పచ్చడి చేసుకునే టైము, ఓపికా అందరికీ వుండదురా! అంచేత నువ్వు ఉగాది పచ్చడిని గనక సీసాల్లోపోసి అమ్మితే ఇక నీ దశ తిరిగినట్టే, నా మాట నమ్ము" అన్నాడు.

వాడు చెప్పింది నిజమే ననిపించింది. చక్కటి సలహా నిచ్చినందుకు వాడికి కృతజ్ఞతలు చెప్పి ఆనందంగా ఇంటికి వెళ్లి మా కుటుంబ సభ్యులందరికి చెప్పాను నా 'ఉగాది పచ్చడి' వ్యాపారం గురించి.

నన్నందరూ అపహాస్యం చేశారు. తరువాత నా స్నేహితుడి లాగానే విడమర్చి విపులంగా చెప్పాక నన్ను మెచ్చుకున్నారు.

ఉగాది ముందు రాత్రి మా కుటుంబమంతా ఉగాది పచ్చడి తయారుచేయడం, సీసాల్లో నింపడం, లేబుల్ అంటించడం వంటి పనులతో తెగ బిజీ.

ఉగాది రోజు రాత్రి సీసాలన్నీ అమ్ముడుపోగా వచ్చిన లాభం చూసి నా తల తిరిగిపోయింది.

నేను నిరుద్యోగినని బాధపడుతూ కాలం గడపడం కన్నా, నాకు చేతనైన ఏ పనైనా చేసి తీరాలన్న పట్టుదల పెరిగింది నాలో. ఈ ఉగాది నన్ను నా కాళ్లమీద నిలబెట్టింది. నాలోని మార్పుకి కారణమైన నా స్నేహితుడు చలపతిరావు శ్రీకృష్ణపరమాత్ముడి ఫోజులో 'కాదేది వ్యాపారానికనర్హం' అంటున్నట్లుగా నా మనోఫలకంపై మెదిలాడు.

నేను మోకాళ్ల మీద కూర్చుని అర్జునుడిలా మనస్ఫూర్తిగా నమస్కరించాను నా స్నేహితుడికి.

సినిమా... సినిమా... -జి.వి.జి.

కృష్ణ "ప్రతాపరుద్రుడు"

"ఎన్ని అడ్డంకులెదురైనా అలనాడు ఆ ప్రతాపరుద్రుడు తన రాజ్యాన్ని ఎలా నిలుపుకున్నాడో- అలాగే ఈ ఆధునిక యుగంలో హీరో ప్రతాప్ తన కుటుంబాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా సమాజానికి ఎంతగానో ఉపకరించి, 'ప్రతాపరుద్రుడు' అనిపించుకుంటాడు," అన్నారు దుర్గా నాగేశ్వరరావు. ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో ఆర్. వెంకటేశ్వరరెడ్డి నిర్మిస్తున్న మురళీ ప్రొడక్షన్స్ "ప్రతాపరుద్రుడు" చిత్రంలో కృష్ణ, రాధ, రేణు, లక్ష్మీప్రియ, ఝాన్సి, దగ్గుబాటి రాజా, కోట శ్రీనివాసరావు, గిరిబాబు, అల్లురామలింగయ్య, నర్రా, త్యాగరాజు, గీతాసైన్, ధమ్ పాత్రధారులు. పి.సి.రెడ్డి కథకు సత్యానంద్ సంభాషణలకర్త. చక్రవర్తి సంగీతం, పుష్పాల గోపీకృష్ణ ఛాయ, త్యాగరాజన్ సాహసాలు, శివశంకర్ నృత్యాలు, మాధవరెడ్డి సంయుక్త దర్శకత్వం, అన్వేష్ సహకార దర్శకత్వం, అంకిరెడ్డి కూర్పు నిర్వహిస్తున్నారు.

"సూపర్ స్టార్"

"హీరో కృష్ణగారు ఒక విశిష్టమైన గౌరవ పాత్రలో దర్శనమిస్తారు," అన్నారు కాసుల గురుదేవ్. ఈయన స్వీయ దర్శకత్వంలో నిర్మించే గురుజ్యోతి ప్రొడక్షన్స్ "సూపర్ స్టార్" చిత్రంలో షణ్ముఖ శ్రీనివాస్, వేలు, నవతారలు కృష్ణప్రియ, గాయత్రీదేవి ఆదిగాగలవారు పాల్గొంటారు. కొండముది శ్రీరామచంద్రమూర్తి కథ, రాజ్-కోటి సంగీతం, సుధాకర్ ఛాయ, కోరాడ- ఆంథోనీ నృత్యాలు, గోపీనాథ్- సుధాకర్ సహకార దర్శకత్వం, మోహన్ ప్రొడక్షన్, జి.జి. కృష్ణారావు కూర్పు నిర్వహిస్తున్నారు.

"ఖైదీదాదా"

"ఫ్యామిలీ సెంటిమెంట్‌తో పాటు కమర్షియల్ ఎలిమెంట్స్ ఉన్నాయి," అన్నారు తాతినేని ప్రసాద్. ఈయన స్క్రీన్ ప్లే, దర్శకత్వంలో ఓ.వి. శేఖరరెడ్డి, టి. స్వరూప నిర్మించిన వీరబ్రహ్మేంద్ర కంబైన్స్ "ఖైదీదాదా" చిత్రంలో సుమన్, రాధ, వాణిశ్రీ, సత్యనారాయణ, సుధాకర్, బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, అన్నపూర్ణ, వరలక్ష్మి, బేబీ దివ్య పాల్గొన్నారు. మధు మాటలు, రాజ్-కోటి సంగీతం, కబీర్‌లాల్ ఛాయ, కె. రామలింగేశ్వరరావు శిల్పం, తార నృత్యాలు, రాజు సాహసాలు, మల్లికార్జునరావు- ఉదయకుమార్ ప్రొడక్షన్, నాయని మహేశ్వరరావు కూర్పు నిర్వహించారు. ●



నిరోషా, బాలకృష్ణ "నారీనారీ నడుమ మురారి"

కొత్త సీరియల్ ప్రారంభం!

హిట్ లిస్ట్

జి.వి.అమరేశ్వరరావు

"సర్! జయ భారతి సమాజ వికాస్ కేంద్రానికి ఎటువైపు వెళ్లాలో చెప్తారా!" బస్టాప్‌లో నిలబడి ఉన్న రామ్మూర్తిని పాతిక సంవత్సరాలలోపు వయస్సున్న యువకుడు అడిగాడు. అతడి ప్రక్కనే దాదాపు ఇరవై సంవత్సరాల వయస్సున్న యువతి నిలబడి ఉంది.

ఆ యువకుడు తొడుక్కున్న ఫీజ్ కాటన్ షర్ట్ పదిహేను రూపాయలకు మించి ఖరీదు చేయదు. చౌకరకం జీన్ ప్యాంటులోకి ఫీజ్ కాటన్ షర్టు టక్ చేశాడు. కాళ్లకు అరిగిపోయిన హవాయి చెప్పులు, షర్ట్ బటన్స్ ఫ్రీగా వదిలేయడంతో ఛాతీమీది నల్లని ఉంగరాల జుట్టుతోపాటు తెల్లటి యజ్ఞోపవీతం తుఫాను మబ్బుల్లో విద్యుల్లతలా కనపడుతోంది.

ఆ యువకుడు ప్రక్కనే 'మిడీ'లో ఉన్న అందమైన అమ్మాయిమెడలో స్టీలు చెయిన్ చివర్న 'క్రాస్' వేలాడుతోంది. ఆమె తెల్లటి నుదురు బోసిగా ఉంది.

కేవలం ఒక్క చూపులోనే వాళ్లిద్దరి మతాలు ఏంటో కనిపెట్టేశాడు రామ్మూర్తి.

"సర్ జయభారతి సమాజ వికాస్ కేంద్రానికి ఎటువైపు వెళ్లాలో చెప్తారా?"

ఆ యువకుడు మరొకసారి అడిగాడు.

రామ్మూర్తి ఉలిక్కిపడ్డాడు.

"ఈ ఏరియాలో జయభారతి సమాజ వికాస కేంద్రం లేదు. నవభారతి సమాజ వికాస్‌కేంద్రం ఉంది... మరి" అన్నాడు.

"నేను అడిగేది దాన్ని గురించే..... నవభారతి బదులు పొరపాటుగా జయభారతి అన్నానంతే"

రామ్మూర్తి చేయి పైకెత్తి చూపిస్తూ చెప్పాడు.

"నేరుగా వెడితే ఒక పోస్ట్ బాక్స్ కనపడుతుంది. ఆ పోస్ట్ బాక్స్ ఎదురుగా ఒక సందు ఉంటుంది. ఆ సందులోకి



వెళ్లగానే ఎడంచేతివైపు ఉన్న పచ్చరంగు మేడ ప్రక్కగా లోపలికి వెడితే కుడివైపు మూడో ఇల్లు. ఇంటి ముందు నవభారతి సమాజ వికాస్ కేంద్రం అనే బోర్డు కనపడుతూనే ఉంటుంది."

ఆ యువకుడు రామ్మూర్తికి థాంక్స్ చెప్పి తన ప్రక్కన నిలబడిఉన్న అమ్మాయి చిటికెన వేలు పట్టుకుని రామ్మూర్తి చూపించిన వైపు నడిచాడు!

నవభారతి సమాజ వికాస్‌కేంద్రం అనాధ శరణాలయాలు నడపడం, బీద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయడం, స్త్రీ సంక్షేమ పథకాలు చేపట్టడం వంటి పనులు చేస్తుంటుంది! ఈ పనులతోపాటు ఇటీవల ఆ సంస్థ కులాంతర, మతాంతర వివాహాలు కూడా చేస్తోంది. ఇలాంటి వివాహం చేసుకున్న వాళ్ళు ఆర్థికంగా వెనకపడినవారయితే.. .. వాళ్ళకు తాళిబొట్టు, కొత్త బట్టలు ఇచ్చి పెళ్ళి చేయడంతోపాటు కొత్త సంసారం పెట్టుకోవడానికి వెయ్యి రూపాయిల నగదు, కొన్ని వంట పాత్రలు కూడా నవభారతి సమాజ వికాస్ కేంద్రం ఉచితంగా ఇస్తుంది.

ఈ పనులన్నీ చేయడానికి నవభారతి సంస్థకు అనేక వ్యాపార సంస్థలతోపాటు సమాజంలో ఉన్నతస్థాయిలో ఉన్న వ్యక్తులు సాయం చేస్తుంటారు.

ఆ యువకుడూ, యువతీ, సమాజ వికాస్ కేంద్రపు అధ్యక్షుడు ప్రజాపతిని కలిశారు. ఆ ఇద్దర్నీ చూస్తూనే ఇదేదో మతాంతర వివాహం తాలూకు వ్యవహారం అని ప్రజాపతి గ్రహించాడు.

ఆ యువకుడు ప్రజాపతితో చెప్పాడు.

"నిన్నటి పేపర్‌లో మీ కేంద్రం గురించి పడిన వార్త చదివి వచ్చాను. నా పేరు

అనంత పద్మనాభశాస్త్రి.... ఈ అమ్మాయి పేరు ఎలిజిబెత్. .... నేనూ ఎలిజా ప్రేమించుకున్నాం... .. కాని....."

"మీ అమ్మా నాన్నా మీ ప్రేమ వివాహానికి అడ్డుపడుతున్నారా?" పద్మనాభ శాస్త్రి కాదన్నట్టు తల ఊపి చెప్పాడు.

"మా అమ్మానాన్నా నా చిన్నప్పుడే యాక్సిడెంట్‌లో మరణించారు.... అప్పట్నించీ నేను అనాధ శరణాలయంలో పెరిగాను. ప్రస్తుతం ఓ హోటల్‌లో సర్వర్‌గా పని చేస్తున్నాను. నెలకు జీతం మూడు వందలు ఇస్తారు."

హిట్ లిస్ట్!

"పోనీ ఆ అమ్మాయి తల్లితండ్రులు మీ పెళ్ళికి అడ్డుపడుతున్నారా?"

"లేదు... ఎలిజాకు కూడా తల్లితండ్రులు సంవత్సరం క్రితమే చనిపోయారు. ఇప్పుడు ఎలిజా తన మేనమామ గేబ్రియల్ ఇంట్లో పెరుగుతోంది."

"నువ్ చెప్పబోయేదేంటో నాకు అర్థం అయ్యింది. డానియేల్‌గారు మీ పెళ్లికి ఒప్పుకోవటం లేదు అవునా?"

"డానియేల్ కాదు సార్.... గేబ్రియేల్....గేబ్రియేల్‌గారు మా పెళ్లికి ఒప్పుకోవడం లేదు.' '

"మీ ప్రాబ్లం ఏంటో అర్థం అయ్యింది. మీ ఇద్దరూ మేజర్లే కదా"

అనంత పద్మనాభశాస్త్రి అవునన్నట్లు తలూపాడు. ఎలిజబెత్ తన ఒళ్ళో ఉన్న గులాబిరంగు ఫైలు తెరిచింది. అనంతపద్మనాభశాస్త్రి అందులో నుంచి-రెండు టెన్త్‌క్లాస్ సర్టిఫికెట్లు తీసి ప్రజాపతికి అందించి చెప్పాడు.



“పదోక్లాసు సర్టిఫికెట్లు సార్.... మేం మేజర్లేనని తెలియచెప్పే ఎవిడెన్స్.... మేం

ఇద్దరం పదోక్లాసు వరకూ కలిసి చదువుకున్నాం. ఆ సమయంలోనే మా ప్రేమకు



అంకురార్పణ జరిగింది."

"ఒకే టెన్త్‌క్లాసు చదివే సమయంలో మీరిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకున్నారా?..... మైగాడ్....."

ప్రజాపతి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు. అలా రెండు నిమిషాల సేపు ఆశ్చర్యపోయి టెన్త్‌క్లాసు సర్టిఫికెట్లు పరిశీలించి వాళ్ల మేజర్లేనని నిశ్చయించుకున్నాడు.

ఇద్దరి పేర్లూ రిజిస్టర్‌లో ఎక్కించుకున్న తర్వాత చెప్పాడు.

"ఎల్లుండి సాయంత్రం ఆరుగంటలకు మీలాగే పదిహేను జంటలు మతాంతర వివాహాలు చేసుకుంటున్నారు. సాంఘిక సంక్షేమ మంత్రిగారి ఆధ్వర్యంలో ఆ వివాహాలు జరుగుతాయి..... మీరు ఒక్క గంట ముందుగా రండి!"

అనంతపద్మనాభ శాస్త్రి ఎలిజబెత్తూ సంతోషంగా సరేనన్నట్లు తలలు ఊపారు. నమస్కరించి శెలవు తీసుకున్నారు.

* * * * * * *

నవభారతి సమాజ వికాస్‌కేంద్రం ఆధ్వర్యంలో ఆదర్శ వివాహాల ఉత్సవం అట్టహాసంగా జరిగింది. ఆ వివాహానికి పోలీస్ కమీషనర్ మాధవరావు, సాంఘిక సంక్షేమ మంత్రి ఆర్.కె.ఆర్. నగరంలోని అనేకమంది ప్రముఖులు హాజరయ్యారు. అనంతపద్మనాభశాస్త్రి, ఎలిజబెత్‌లతో కలిసి మొత్తం పదహారు జంటల పెళ్లిళ్లు జరిగాయి. పెళ్లిళ్ళకు ముందు సాంఘిక సంక్షేమ మంత్రి సుదీర్ఘోపన్యాసం చేశాడు. వివాహానంతరం సంక్షేమ కేంద్రం అధ్యక్షుడు ప్రజాపతి ఒక్కొక్క జంటనే వేదిక మీదికి పిల్చి వాళ్లు కొత్తకాపురం పెట్టుకోవడానికి అవసరం అయిన వంటసామాగ్రి, వెయ్యిరూపాయల నగదు ఉన్న ఎన్వొలప్ మంత్రిగారి చేతుల మీదుగా ఇప్పించాడు.

ఎలిజబెత్తూ, అనంతపద్మనాభశాస్త్రీ కృతజ్ఞతా సూచకంగా మంత్రిగారి పాదాలకు నమస్కరించారు.

హిట్ లిస్ట్!

కార్యక్రమం పూర్తి అయిన తర్వాత ఎలిజబెత్తూ, శాస్త్రి అటుగా వెడుతున్న ఒక ఆటో ఆపారు.

"ఉస్మానియా యూనివర్శిటీ" శాస్త్రి అడిగాడు.

ఆటో డ్రయివర్ వస్తానన్నట్టు తలూపి మీటర్ వేశాడు. శాస్త్రి, ఎలిజబెత్ కూర్చోగానే ఆటో కదిలింది.

కొద్ది నిముషాలసేపు ప్రయాణించిన తర్వాత ఆటో ఉస్మానియా యూనివర్సిటి క్యాంపస్‌లోకి ప్రవేశించింది.

లాండ్ స్కేప్ గార్డెన్ దగ్గిర అనంతపద్మనాభశాస్త్రి ఆటో ఆపించాడు. ఆటో ఫెయిర్ నాలుగు రూపాయల డెబ్బైపైసలు అయింది. శాస్త్రి పదిరూపాయల నోటు ఇచ్చి మిగిలిన చిల్లర తీసుకుని లాండ్‌స్కేప్ గార్డెన్‌లోకి అడుగుపెట్టాడు. ఎలిజబెత్ అతడిని అనుసరించింది.

ఇద్దరూ గుబురుగా పెరిగిన ఒ పొదచాటుకు వెళ్ళి కూర్చున్నారు....

తమను ఎవరూ గమనించడం లేదని గ్రహించగానే శాస్త్రి ఎలిజబెత్ ముఖాన్ని చేతుల్లోకి తీసుకుని ముద్దుపెట్టుకోబోయాడు వెంటనే ఎలిజబెత్ నేర్పుగా అతడు పెట్టబోయే ముద్దు నుంచి తప్పించుకుంటూ అన్నది.

"చూడు శివాజీ! నా దగ్గిరకాదు పిచ్చి వేషాలు..... ముందు డబ్బులు బయటకు తియ్.. ... అవతల మా బామ్మ నా కోసం ఎదురు చూస్తూ ఉంటుంది."

"అదికాదు రజనీ...." శివాజీ ఏదో చెప్పబోయాడు.

"ముందు డబ్బులు బయటకు తియ్...."

రజని ఆజ్ఞాపించింది.

శివాజీ కొద్ది సేపటి క్రితం తనకు సాంఘిక సంక్షేమ మంత్రిగారు ఇచ్చిన ఎన్వొలప్ జేబునుండి బయటకు తీసి రజనికి అందించాడు.

రజని ఎన్వొలప్ తెరిచి లోపలినోట్లు బయటకు తీసి లెక్కపెట్టింది.

అన్నీ యాభైరూపాయల నోట్లు.

మొత్తం ఇరవైనోట్లు, వాటిల్లో తను పదినోట్లు తీసుకుని మిగతావి శివాజీకి అందించింది. శివాజీ యాభై రూపాయల నోట్లను రెండుసార్లు లెక్కపెట్టి చెప్పాడు.

"ఆటోకు నాలుగు రూపాయల డెబ్బై పైసలు అయింది. అందులో లెక్క ప్రకారం నువ్వు రెండు రూపాయల ముప్పయ్యయిదు పైసలు ఇవ్వాలి."

రజని జాకెట్‌లోకి వేళ్ళు పోనిచ్చి ఓ చిన్న పర్సు బయటకు లాగి రెండు రూపాయల ముప్ఫయయిదుపైసలు శివాజీకి ఇచ్చి చెప్పింది.

"నా మెడలో వేలాడుతున్న ఏసుక్రీస్తు శిలువ ఆరురూపాయలయ్యింది. అందులో మూడు రూపాయలు మన ఒప్పందం ప్రకారం నువ్వు భరించాల్సిందే."

శివాజీ మారు మాట్లాడకుండా మూడు రూపాయల బిళ్ళలు రజనికి ఇచ్చి అన్నాడు.

"జేబులు కొడితే పోలీసుల మామూలు పోను మనకు మిగిలేది చాలా తక్కువ. ఇలాంటి కేసుల్లో డబ్బు మొత్తం మనదే అవుతుంది."

రజని అవునన్నట్లు తల ఆడించింది. ఆమె దృష్టి ఒక ప్రక్కగా ఉన్న వంటపాత్రల మీద పడింది.

రెండు గుంటగరిటలు, ఒక హస్తం గరిట, ఒక అట్లకాడ, ఒక పెనం, అన్నం వండుకునే గిన్నె ఒకటి, అదికాక కూర, పులుసు వండుకోవడానికి మరో రెండు గిన్నెలు.


సత్తుగిన్నెలు అవడంలో వాటి విలువ నూటయాభైరూపాయలకు మించదు.

"ఈ గిన్నెలు నేను తీసేసుకుంటా... వీటిగ్గాను ఓ వందరూపాయలు ఇస్తా..." రజని అన్నది.

"మరో యాభై ఇచ్చుకో.... అంతకు పైసా తగ్గినా నాకు గిట్టదు"

తను చెప్పిన రేటుకు శివాజీ ఇంకో యాభై ఎక్కువ అడుగుతాడని రజనికి తెలుసు. రజని నూటయాభై రూపాయలు శివాజీకి ఇచ్చింది.

ఇక మిగిలింది రోల్డుగోల్డు ఉంగరం. ఎందుకనో దానిని విడిగా అమ్మి పంచుకోవడం రజనికి మనస్కరించలేదు. రోల్డుగోల్డ్‌తో చేసిన ఆ వుంగరం ఇరవైరూపాయలకు మించదు. రజని ఓ పదిరూపాయల



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

మహిళా మండలి అధ్యక్షురాలు "రాధ"కి త్రిమూర్తుల భార్యలందించిన విలువైన (?) సందేశాలు- నారీ లోకానికే కాదు అందరికి నవ్వుల వెలుగులు- అడుగడుగునా కడుపుబ్బ నవ్వించే సంభాషణలతో శాంతికుమార్ అందించిన హాస్య నవల.

"నవ్వుల నదిలో..."

త్వరలో ప్రారంభం

వోటు శివాజీ చేతిలో పెట్టి ఉంగరం స్వంతం చేసుకుంది- అలాగే "యీ వుంగరం నాది వేసుంచుకుంటా.... పదిరూపాయలు నువ్వు తీసుకో...." అన్నాడు శివాజీ.

"సంధ్యాలో కొత్త సినిమా రిలీజ్ అయిందట.... కనీసం ఒక్క పర్సు దొరికినా చాలు" శివాజీ వెళ్లబోయే ముందు అన్నాడు.

"రేపు సాయంత్రం అయిదింటికల్లా సంధ్యా దగ్గిర ఉంటా...."

రజని చెప్పింది.

తర్వాత వాళ్ళిద్దరూ సిటీబస్సుల్లో ఎవ రెళ్ళకు వాళ్ళు వెళ్లిపోయారు.

* * * * * *

శరవేగంతో దూసుకువచ్చిన ఎర్రరంగు మారుతీకారు పోర్టికోలో ఆగింది. డ్రైవర్ శ్రీనివాస్ క్రిందికి దిగి వినయంగా డోర్ తెరిచాడు. అప్పటివరకూ సీటువెనక్కువాలి కళ్ళు మూసుకుని దీర్ఘమయిన ఆలోచనలో మునిగిఉన్న బిజినెస్ మాగ్నెట్ కాళీప్రసాద్ కళ్లు తెరిచాడు.

ఎర్రటి మంకెనపూవుల్లా నెత్తురు జీరలతో భయంకరంగా కనపడుతున్న ఆ కళ్ళలోకి చూడటం ఎవరికయినా అసాధ్యం.

కాళీ ప్రసాద్‌కు నలభై అయిదు [illegible] [illegible] ఉంటాయి. [illegible] ఒళ్లంతా కొవ్వుపట్టి ఆరడుగుల రెండు [illegible] ఎత్తుండే కాళీ ప్రసాద్‌ను చూడగానే ఇద్దమ్మానికి ప్యాంటూ, షర్టూ తొడిగి [illegible] నిపిస్తుంది.

తలనూ భుజాలనూ ఏకం చేస్తున్న [illegible] పాటి మెడ, బలిష్టంగా ఉక్కు స్తంభాలను గుర్తుకు తెచ్చే భుజాలు, వెడల్పాటి ఛాతి, చిన్న సైజు తారు పీపాలా ఉండే పొట్ట .. వీటన్నిటినీ కలిపి చూస్తే హెవీవెయిట్ మోషే పహిల్వాన్ గుర్తుకు వస్తాడు!

కాళీ ప్రసాద్ సీట్‌లో నుంచి క్రిందికి దిగగానే పార్క్ ఎబ్జార్బర్స్ నాలుగంగుళాలు పైకిలేచాయి. అప్పటివరకూ ఒక ప్రక్కకు ఒరిగి ఉన్న మారుతికారు యధాస్థితికి చేరుకుంది.

"యిదవది దీన్ని అమ్మిపారేసి ఇంపోర్టెడ్ విల్లీస్ జీప్ కొందాం అనుకుంటున్నా" శ్రీనివాస్‌ను ఉద్దేశించి చెప్పాడు కాళీప్రసాద్.

అలాగే అన్నట్లు వినయంగా తలూపిన శ్రీనివాస్ మనస్సులో అనుకున్నాడు.

"నీకు విల్లీస్ జీప్‌కాదు.... బుల్‌డోజర యితే సరిగ్గా మ్యాచ్ అవుతుంది."

కాళీప్రసాద్ తన భారీ శరీరాన్ని మోసుకుంటూ ముఖద్వారం వైపు కదిలాడు.

ముఖద్వారాన్ని ఆనుకుని ఉన్న పెద్ద హాలు... ఆ హాలుకు కుడివైపున ఉన్న విశాలమైన బెడ్‌రూంలో ఓ పాతిక సంవత్సరాల వయసున్న మెరుపు తీగలాంటి ఆడపిల్ల కాళీప్రసాద్ కోసం ఎదురుచూస్తోంది.

తెల్లటి ఏనుగుదంతాన్ని పాలతో కడిగి, తేనెతో పాలిష్ చేస్తే ఎలా ఉంటుందో అలాంటి మేనివర్చస్సు, నీలి వజ్రాల్లాంటి సోగ కళ్ళు, ఎర్రటి పెదాలు, కొనదేరిన నాసిక. గడ్డం మీద చిన్న నొక్కు.... శృంగార [illegible] వున్న స్తనద్వయం. చిక్కిపో యిన నడుం, అరటి బోదెల్లాంటి తొడలు. విశాలంగా ఇసుక తిన్నెలా పరుచుకున్న ఎత్తైన జఘనాలు... ఇలా వర్ణించుకుంటూ పోతే ఆ మెరుపు తీగ గురించి ఎంతయినా చెప్పవచ్చును.

కాళీ ప్రసాద్ గుమ్మంలో ప్రత్యక్షమవగానే ఆమె తను పడుకున్న హంస తూలికా తల్పాన్ని గుర్తుకు తెచ్చే డబుల్‌కాట్‌మీది నుంచి ఛంగున లేడిలా ఒక్క అంగలో పైకి లేచి... అదే వేగంతో ముందుకు పరుగెత్తింది.

కాళీప్రసాద్ తనవైపు దూసుకువస్తున్న మోహినివైపు లయబద్ధంగా కదులుతున్న ఆమె ఘనమైన స్తన ద్వయంవైపు తమకంగా చూశాడు. రివ్వున దూసుకువచ్చిన మోహిని కాళీప్రసాద్‌ను చేరుకుంటూనే అతడి మెడ చుట్టూ తామరతూండ్ల వంటి తన చేతులు వేసి ముఖాన్ని అతడి గుండెల్లో దాచుకుంది.

ఒక్కసారిగా రక్తపు ఉరవడి పెరిగిపోవడంతో కాళీప్రసాద్ ఆమెను రెండుచేతుల్తో దూదిబొమ్మలా ఎత్తుకుని మంచంవైపు నడిచాడు.

ఆ తర్వాత గంటసేపటి వరకూ ఆ ఇద్దరి బరువయిన ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో గది వేడెక్కింది.

తీరిన కోర్కెతో తన ఛాతీమీద తలపెట్టుకుని పడుకున్న మోహినితో తృప్తి పడిన స్వరంతో అన్నాడు కాళీప్రసాద్.

"నేను బిజినెస్ పనిమీద ఊరువెడుతున్నా.... మళ్ళీ ఎల్లుండి ఇదే సమయానికి వస్తా."

ఆ మాటతో మోహిని అతడి ఛాతీ మీంచి ఒక్క ఉదుటున లేచి కోపంతో దూరంగా జరిగింది.

కాళీప్రసాద్ నేలమీద పడిఉన్న తన దుస్తుల్ని అందుకుంటూ చెప్పాడు

"నీ మనస్సులో ఏం ఉందో నాక తెలుసు.... నేను ఇలా వచ్చి వెళ్ళిపోవడం నీకు ఇష్టంలేదు.... నన్ను శాశ్వతంగా వాడివి చేసుకోవాలనుకుంటున్నావ్" అవునా?

మోహిని అవునన్నట్టు తల ఊపింది.

"నీ కోర్కె తీర్చాలని నాకూ ఉంది.... కాని అందుకు పార్వతి అడ్డువస్తోంది."

పార్వతి కాళీప్రసాద్ భార్య.

"అయితే జీవితాంతమూ మనం సీక్రె



ట్‌గా కలుసుకుంటూ ఉండక తప్పదా? ఇలా నాలుగ్గోడల మధ్యా రహస్య జీవితం గడపడం నాకు పిచ్చెక్కిస్తోంది."

మోహిని కంఠంలో కోపం. కాళీప్రసాద్ అనునయంగా ఆమె భుజం మీద చేయి వేసి చెప్పాడు.

"నీ బాధ అర్థం చేసుకున్నాను కనుకనే పార్వతిని మన మధ్య నుంచి శాశ్వతంగా తొలగించే మార్గం ఆలోచించాను."

"అంటే...." భయంగా అన్నది మోహిని.

"ఆమెను సఫా చేయడానికి ప్లాన్ సిద్ధం చేశాను....." రెండు క్షణాల తర్వాత అడిగింది మోహిని.

"ఈ విషయంలో కురియన్ సహాయం తీసుకుంటావా?"

కురియన్, ఎర్రతేలు, నల్లముత్తు..... ఈ ముగ్గురూ కాళీప్రసాద్ అనుచరులు. తను ఏ పనిచేసినా కాళీప్రసాద్ కురియన్‌తో సంప్రదించి చేస్తాడు.

"అవును.... అందుకు తగిన ప్లాను కూడా కురియనే చెప్పాడు.... మరో కొద్ది రోజుల్లో నువ్వు నా భార్యవి కాబోతున్నావ్..... ప్రామిస్....."

కాళీప్రసాద్ మోహిని చేతిలో చెయ్యివేసి చెప్పాడు.

కాళీప్రసాద్ కనక ఒకసారి ప్రామిస్ చేశాడంటే ఆ పనిచేసి తీరుతాడని మోహినికి తెలుసు.

* * * *

సంధ్యాథియేటర్‌లో 'సవాలుచేసిన శవాలు' సినిమా ఆ రోజే విడుదల అయ్యింది. అయినా కౌంటర్స్ ఖాళీగా ఉన్నాయి. ప్రతి నాలుగైదు నిమిషాలకూ ఒక్కరొక్కరే వచ్చి టిక్కెట్లు కొనుక్కు వెడుతున్నారు.

థియేటర్ ముందు నిలబడి ఉన్న శివాజీ తన ప్రక్కనే ఉన్న రజనితో నిరాశగా అన్నాడు.

"పేరు చూసి ఇదేదో డబ్బింగ్ సినిమా అనుకుని మోసపోయాం.... డైరెక్ట్ టేక్ సినిమా అని తెలిస్తే వచ్చేవాడినే కాదు...."

"అదేం?" రజని ఆశ్చర్యంగా అడిగింది.

"ఈ మధ్య జనం డైరెక్టుగా తీసిన సినిమాలు చూడడం మానేశారు.... డబ్బింగ్ సినిమాలే బాగా చూస్తున్నారు...."

రజని అవునన్నట్టు తల ఆడించింది.

శివాజీ కాసేపు బుర్రగోక్కుని చెప్పాడు.

"పోనీ మనం.... షాలిమార్ దగ్గిర ట్రైచేస్తే"

ఆ మాట వింటూనే రజని భయంగా కళ్లు పెద్దవిచేసి గుండెల మీద చేతులు వేసుకుని చెప్పింది.

"అమ్మో..... అది జబ్బార్‌గాడి ఏరియా.... వాడి ఏరియాలోకి వెడితే వాడు కాళ్ళూ చేతులూ విరిచి పారేస్తాడు... నేను మాత్రం రాను...."

"రావా?"

"రాను.... అయినా నిన్న మనం చేసుకున్న దొంగపెళ్ళి తాలూకు డబ్బు అపుడే అవ్వగొట్టేశావా? మళ్ళీ ఎమ్యూజిమెంట్ పార్కుకి వెళ్ళి ఆ డబ్బుల్తో మూడుముక్కలాట ఆడి .... మొత్తం పోగొట్టుకుని ఉంటావు అవునా?"

శివాజీ సమాధానం చెప్పకుండా ముందుకు నడవసాగాడు.

"ఏయ్ నిన్నే ఎక్కడికి?"

శివాజీ మాట్లాడకుండా నడకవేగం హెచ్చించాడు.

"నా మాట విను..... జబ్బార్‌గాడు ఒట్టి రౌడీ వెధవ... వాడితో పెట్టుకోకు...."

శివాజీ ఆమె మాటలు లెఖ్ఖపెట్టలేదు.

"వాడికి ఎదురు తిరిగి ఇంతవరకూ ఎవ్వరూ బ్రతికి బయటపడలేదు...."

షాలిమార్ థియేటర్‌కు చేరుకునే వరకూ రజని బ్రతిమిలాడుతూనే ఉంది. అది చేరుకుంటూనే శివాజీ నిశితంగా ఆ చుట్టుపక్కల ప్రదేశాల్ని గమనించాడు. జనం థియేటర్ ఆవరణనిండా చీమల బారుల్లా క్రిక్కిరిసిపోయారు.

జాకీ ఛేన్ సినిమాలంటే హైద్రాబాద్ జనాలకు మహా క్రేజీ!

వేళ్ళకు వజ్రపుటుంగరాలు, మెడలో బంగారపు ఛెయిను ఖరీదయిన దుస్తులు, బూట్లు ధరించి, ట్రిబుల్ ఫైవ్ సిగరెట్

తాగుతున్న ఒక వ్యక్తి శివాజీని ఆకర్షించాడు. శివాజీ సైగను అర్థం చేసుకున్న రజని ఆ వ్యక్తి దగ్గరికి వెళ్ళి నవ్వుతూ పలకరించింది.

"మీ దగ్గిర ఎక్స్ట్రా టికెట్ ఒకటి ఉందా?"

మాంచి యవ్వనంలో పిటపిటలాడుతున్న ఇరవై ఏళ్ళ సుందరాంగి తనకు తానుగా వచ్చి అడిగినప్పుడు లేదు అని చెప్పడానికి ఆ వ్యక్తికి ఇబ్బందిగా అనిపించింది. అయినా తప్పదు, అతడు ఎక్స్ట్రాటికెట్ లేదన్నట్టుగా తల అడ్డంగా ఊపాడు.

రజని నిరాశగా ముఖం పెట్టి అక్కడ్నించి బయటకు నడిచింది.

ఆ పాటికే శివాజీ పని పూర్తి అయ్యింది. ఇప్పుడు ఒక బరువయిన పర్సు అతడి చేతుల్లోకి వచ్చింది. శివాజీ హుషారుగా నడవసాగాడు. రజని అతడిని అనుసరించసాగింది.

రెండు మలుపులు తిరిగి సన్నటి ఇరుకు సందులోకి ప్రవేశించారు. ఆ సందులో నేరుగా వెడితే జ్వాలా ముఖి సూపర్ మార్కెట్ వస్తుంది. కేవలం పది అడుగులు మాత్రమే వెడల్పు ఉన్న ఆ సందు పూర్తిగా నిర్మానుష్యంగా ఉంది.

ఆ సందులో ఇద్దరూ పది అడుగుల దూరం నడిచారో లేదో ఎదురుగ్గా నలుగురు మాసిన మనుషులు వచ్చి నిలబడ్డారు. వాళ్ళలో ఒకడు జబ్బార్, మిగిలిన నలుగురూ అతడి అనుచరులు. జబ్బార్ కి ముప్పయ్ సంవత్సరాల వయస్సుంటుంది. కళ్ళలో క్రూరత్వం కొట్టవచ్చినట్టు కనపడుతూ ఉంటుంది. దానికి తోడు కుడి చెంపమీద గాటు. మిగిలిన ముగ్గురు కుర్రాళ్ళకీ ఇరవై అయిదు సంవత్సరాల వయస్సు మించదు.

శివాజీ ఆ నలుగురి వంకా నిశితంగా చూశాడు. వాళ్ళలో జబ్బార్ ఒక్కడే తనకు సమవుజ్జీ. మిగిలిన ముగ్గురూ అర్భకులు, అయినా నలుగురు మనుషుల్ని తను ఒక్కడే ఎదుర్కోవడం అంత తేలికకాదు.

"ఇందాక షాలిమార్ లో కొట్టేసిన పర్సు బయటికి తియరాబేవ కూఫ్."

నడుముకు చుట్టిఉన్న సైకిల్ చెయిన్ సర్రున బయటకు లాగి గాలిలో ఝుళిపిస్తూ పెడబొబ్బ పెట్టాడు జబ్బార్.

వెంటనే మిగిలిన ముగ్గురూ దుస్తుల చాటునుంచి ఇనుప రాడ్ లు బయటకు తీశారు.

శివాజీ రెండు అడుగులు వెనక్కువేశాడు. కాళ్ళను నేలకు తన్ని పట్టి పెద్దగా సింహనాదం చేసి ముందుకు దూకాడు. జబ్బార్ గాడు తేరుకునేలోగా వాడి గుండెలమీద ఒక బలమయిన ఫ్లయింగ్ కిక్ తాకింది. ఆ దెబ్బకు తట్టుకోలేని జబ్బార్ బ్యాలెన్స్ తప్పి వెనక్కుపడ్డాడు. అతడి ముక్కులోంచి, నోట్లోంచి రక్తం కారసాగింది. తమ బాస్ కు పట్టిన గతి చూస్తూనే ముగ్గురూ రెచ్చిపోయారు. చేతుల్లోని ఇనుపరాడ్ లు తిప్పుతూ రేచుకుక్కల్లా శివాజీవైపు దూకారు. ఈసారి శివాజీ మరింత వేగంగా పనిచేశాడు.

మెరుపు వేగంతో నేలమీద పడిపోయి తన కాళ్ళతో వాళ్ళ కాళ్ళకు మెలికవేశాడు. జరిగిందేంటో అర్థం అయేలోపే వాళ్ళు రోడ్డు మీద బోర్లా పడిపోయారు. పెద్ద శబ్దం చేస్తూ వాళ్ళ చేతుల్లోని ఇనుపరాడ్స్ నేల మీదికి జారిపోయాయి. ఆ దెబ్బతో ఒకడి ముక్కుపచ్చడి అయింది. మరొకడి ముందు పళ్లు రెండు విరిగి బొటబొటా రక్తం కారసాగింది. కోసుగా ఉన్న ఒక పలుగురాయి ఇంకొకడి నుదిటిమీద అరంగుళం లోతున రంధ్రం చేసింది. ఆ దెబ్బకు వాడు బాధగా అరిచాడు.

శివాజీ ఎంత వేగంతో నేలమీదకు జారిపోయాడో, అంతకంటే రెట్టింపు వేగంతో నొక్కి వదిలిన స్ప్రింగులా లేచి నిలబడ్డాడు. ఈసారి అతడి చేతిలో పొడవాటి ఇనుపరాడ్ వజ్రాయుధంలా మెరుస్తోంది.

జబ్బార్ ఆ పాటికే ఒళ్ళు స్వాధీనంలోకి తెచ్చుకుని లేచి నిలబడి దిమ్మగా ఉన్న తల విదిల్చాడు. తన అనుచరులకు పట్టిన గతి చూడగానే అతడి కళ్ళు చంద్రనిప్పులు కక్కాయి.

"రేయ్ బాఢకవ్! నీకు యియ్యాల చావు మూడిందిరా" అని అరుస్తూ శివాజీ వైపు పరుగుతీశాడు.

రచయితలకి సూచనలు

ఆంధ్ర సచిత్రవారపత్రికకి పరిశీలనార్థం తమ రచనలని పంపే వారు ఈ కింది సూచనలని గమనించ కోరుతున్నాము

రచనలు కాగితానికి ఒక వైపే సిరాతో లేదా బాల్ పెన్ తో రాయాలి కాగితానికి రెండు వైపులా రాసి ఉన్న రచనలని పరిశీలించటం జరగదు

పరిశీలనకి పంపే రచనలు కథలైతే 10 అరఠావు పేజీలకి మించకుండా ఉంటే మంచిది వ్యాసాలు 3 అరఠావు పేజీలు మించరాదు వ్యాసాలు పంపేవారు వాటికి సంబంధించిన బొమ్మలు లేదా ఫొటోలు జతపరిచి పంపటం అవసరం

రచనలు స్వంత రచనలై ఉండాలి అనువాదాలు, అనుసరణలు, కాపీ రచనలు పంపరాదు ఆ మేరకి రచయిత(త్రి) హామీ పత్రం రాసి సంతకం చేసి రచనతో పాటే పంపాలి

రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే రాసి ఉండాలి వ్రాత ప్రతి మీద రచయిత(త్రి) పూర్తి చిరునామా స్పష్టంగా పిన్ కోడ్ తో సహా రాయాలి

కథల పరిశీలనకి 1-2 నెలలు, నవలల పరిశీలనకి కనీసం 6 నెలలు పట్టవచ్చును పరిశీలన అయిన తర్వాత ఏ విషయం ఆయా రచయిత(త్రు)లకి తెలియచేయటం జరుగుతుంది ప్రచురణకి స్వీకరించని రచనలని తిప్పి పంపకోరేవారు తమ రచనతో పాటే స్వంత చిరునామా కల, తగినన్ని తపాలా బిళ్ళలు అతికించిన కవరు జత పరచి పంపాలి లేకపోతే వాటిని తిప్పి పంపటం సాధ్యం కాదు రచనలు తిప్పి పంపే విషయంలో తగిన జాగ్రత్త తీసుకోటం జరుగుతుంది కానీ పోస్టులో పోయే వాటి విషయంలో మేము బాధ్యతని స్వీకరించలేము వాటిపై ఎటువంటి ఉత్తర ప్రత్యుత్తరాలకి అవకాశం లేదు


రచనలు పంపిన వారు తమ చిరునామా మారిన సందర్భంలో వెంటనే ఆ విషయాన్ని మా కార్యాలయానికి తెలియ చేస్తూ ఒక కార్డు రాయటం అవసరం

ఉత్తరాలు, తదితర పాఠకుల శీర్షికలకి రాసే వారు కూడా తమ పేరు, పూర్తి చిరునామా ఇవ్వాలి రచనలు పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి లేకపోతే వాటిని పరిశీలించటం జరగదు

పరిశీలనకి పంపే రచనలని సంపాదకుడు, ఆంధ్ర సచిత్రవారపత్రిక, గాంధీనగరం, విజయవాడ – 520003' అనే చిరునామాకి పంపాలి కవరు పైభాగంలో శీర్షికపేరు రాయటం మంచిది

— సంపాదకుడు

బొమ్మల పజిల్ ఫలితాలు



"ఏమండోయ్ శ్రీవారూ ఒక చిన్నమాట"

సరైన సమాధానం: సినిమా-'మంచి మనసులు'

నటీనటులు-నాగేశ్వరరావు-సావిత్రి

సందర్భం- పెళ్లయిందని, భార్య ప్రసవానికై పుట్టింటికెళ్లిందని అబద్ధమాడి ఎస్.వి. రంగారావు ఇంట్లో అద్దెకు దిగుతాడు నాగేశ్వరరావు. ఆ సంగతి కనిపెట్టిన యింటివారమ్మాయి సావిత్రి అతని భార్య ప్రసవించిందని ఓ దొంగ టెలిగ్రామ్ పంపిస్తుంది. అది చూసుకున్న హీరో యింక అక్కడ వుంటే తన గుట్టు రట్టవుతుందని చల్లగా అర్ధరాత్రి పెట్టె బేడతో జారుకో చూస్తుండగా హీరోయిన్ అతనిని ఆటలు పట్టిస్తూ "ఏమండోయ్ శ్రీవారూ" అంటూ పాట అందుకుంటుంది-

బొమ్మల పజిల్‌లో వందలాది మంది పాఠకులు పాల్గొన్నారు. వారందరికి మా అభినందనలు-చాలామంది సరియైన జవాబు వ్రాశారు. అయితే యించుమించు అందరూ రైటైన సమాధానమే వ్రాశారు. వీరందరి పేర్లు ప్రచురించడం అసాధ్యం కనుక చీట్లు తీసి 25 మంది పేర్లు మాత్రమే ఈ క్రింద ప్రచురిస్తున్నాం.

-ఎడిటర్

<u>లక్కీ పేరు!</u>

వి. జగదీష్ (వరంగల్), జనార్ధనశర్మ (హైదరాబాద్), ఇ. ఉదయకిరణ్ (శ్రీహరికోట), కె. కేదరిరావు (బెరహంపూర్), కాపుగంటి సూర్యకుమారి (విశాఖపట్నం), కె. అన్నపూర్ణ (మానేపల్లి), పి. విజయదుర్గ (మచిలీపట్నం), ఎస్. వి.ఆర్. నాగభూషణరావు (అవనిగడ్డ), ఐ. ఆదినారాయణరావు(చీమకుర్తి), ధనలక్ష్మీబాయి (కర్నూలు), సి.హెచ్. గోపినాధ్ గుప్తా (బెరహంపూర్), జి.వి.బి. లక్ష్మి (విశాఖపట్నం), ఆర్. రమ(విశాఖపట్నం), వి.ఎస్.ఆర్. మౌళి(హైదరాబాద్), కోసూరి వరమేశ్వరి (సికిందరాబాద్), డి.ఎల్. నరసింహారావు (గురజాల), గొట్టాపు దుర్గారావు (గోపాలపురం), ఎస్. లక్ష్మి (కాజీపేట), కె.వి. మధుసూధనరావు (కాకినాడ), పుల్లా వంతుల వేంకటసుబ్బారావు (పాలకొల్లు), ఆర్. ఉమాబాల (విజయవాడ), పులపర్తి శ్రీ భవ్య (అమలాపురం), జి. సుగుణ (నెల్లూరు), సుంకర ఇందిరాదేవి (తుని), కె. ఇంద్రయ్య (తణుకు)

హిట్ లిస్ట్!

సర్రున గాలిని కోస్తూ అతడి చేతులో గిరగిరా తిరుగుతున్న సైకిల్ చెయిన్ ఏ క్షణంలో నయినా వచ్చి యమపాశంలా శివాజీ మెడకు చుట్టుకునేందుకు సిద్ధంగా ఉంది. తనవైపు పరుగుతీస్తున్న జబ్బార్‌ను చూసిన శివాజీ ఏ మాత్రం చలించలేదు. వాడు తన రేంజ్‌లోకి రాగానే శివాజీ వేగంగా చెయ్యిపైకి లేపాడు. అంతకన్నా రెట్టింపు వేగంతో తన చేతిలోని ఇనుపరాడ్ జబ్బార్ వైపు విసిరాడు.

ఆగ్నేయాస్త్రంలా దూసుకువెళ్ళిన ఇనుపరాడ్ జబ్బార్‌గాడి నుదిటికి తగిలి పెద్దశబ్దాన్ని సృష్టిస్తూ కిందపడిపోయింది. బాధగా రెండు చేతుల్తో తలనుపట్టుకున్న జబ్బార్ పెద్దగా అరుస్తూ వెల్లకిలా పడిపోయాడు. అతడితల వెనకభాగం రోడ్డుకు తగలడం, మరుక్షణం స్పృహతప్పడం వెంటవెంటనే జరిగిపోయాయి.

ఇక మిగిలింది జబ్బార్‌గాడి అనుచరులు. వాళ్ళు ఒళ్ళు స్వాధీనంలోకి తెచ్చుకుని లేచి నిలబడ్డారు. వాళ్ళు ఆ పాటికి తనను ఎదుర్కోవడానికి సిద్ధమవుతారని శివాజీకి తెలుసు. అతడి దృష్టి రోడ్డు వారగా నిలబెట్టి ఉన్న ఖాళీ కూరగాయల బండి మీద పడింది.

అతడి ఉద్దేశాన్ని గ్రహించిన రజని చురుగ్గా పనిచేసింది. అప్పటివరకూ ఒక బడ్డీకొట్టు ప్రక్కన దాక్కున్న ఆమె ఛటుక్కున రోడ్డు మీదకు పరుగుతీసి కూరగాయల బండి బలంగా ముందుకు తోసింది. వాళ్ళ ముగ్గురూ జాగ్రత్తపడే లోపే కూరగాయల బండి వేగంగా రావడం, కాళ్ళకు బలంగా కొట్టుకోవడం ఒకేసారి జరిగిపోయాయి. బ్యాలెన్స్ తప్పి ఆ ముగ్గురూ వెనక్కుపడిపోయారు. వాళ్ళలో ఇద్దరు ఆ పడిపోవడంతో అలాగే చలన రహితంగా ఉండిపోయారు. మూడోవాడు రెండు సార్లు తలకదిల్చి స్పృహకోల్పోయాడు.

శివాజీ పక్కకు చేరుకుని రజని మెచ్చుకోలుగా అతడి భుజం మీద తట్టింది.

శివాజీ ఆమె బుగ్గలు నిమురుతూ అన్నాడు. "ఇలాంటి సమయంలో సినిమాలో అయితే కనక హీరోహీరోయిన్లు ఒకళ్ళనొకళ్ళు బలంగా వాటేసుకుని డ్యూయట్లు పాడుకుంటారు తెల్సా?"

"నా దగ్గిర నువ్వు పచ్చిమాటలు మాట్లాడమాక" అంటూ రజని శివాజీ తలమీద చిన్న మొట్టికాయవేసింది.

శివాజీ జేబులో నుంచి పర్సు బయటకు తీశాడు. అందులో ఉన్న ఇరవై అయిదు రూపాయల నోట్లు ఇద్దరూ చెరిసగం పంచుకున్నారు.

"యదవనాయాలు. వాడి వేషం చూసి వెయ్యికి తక్కువ ఉండవనుకున్నాను. విజిటింగ్ కార్డులూ, పాత సినిమాటిక్కెట్లూ తప్ప మరేం లేవు యదవనాయాలవి.... యదవనాయాలు..."

పర్సు దులుపుతున్న శివాజీ వేళ్ళకు మడతలు పెట్టిన ఒక ఇన్విటేషన్ కార్డు చేతికి తగిలింది. 'వి.ఐ.పి. ఎడ్మిట్-2' అనే స్టాంపు వేసి ఉన్న ఆ కార్డులోని విషయం పూర్తిగా చదివిన శివాజీ మనస్సులో ఏదో ఆలోచన మెదిలింది. దాన్ని జేబులోకి తోసి మూతలేని మ్యాన్ హోల్‌లోకి పర్సు విసిరేశాడు.

అక్కడి నుంచి ఇద్దరూ చెరొక ఆటోలో ఇళ్ళకు చేరుకున్నారు.

(ఇంకా వుంది)



న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు



అడ్వొకేట్: బి.భాస్కరరావు ఎం.ఎ., ఎల్.ఎల్.బి.

గొట్టిపు దుర్గారావు, గోపాలపురం.

ప్రశ్న: ఇంటిమీద డబ్బు తీసుకొని రశీదు ఇచ్చారు. ఇప్పుడు డబ్బు తీసుకోవలేదని అబద్ధాలాడుతున్నారు. ఈ సమస్యనెలా పరిష్కరించాలి?

జవాబు: మీరు ప్రోమిసరీనోటు వ్రాయించుకొని సాక్షుల సంతకాలతో అప్పు ఇచ్చినట్లయితే మూడు సంవత్సరముల లోపల కోర్టులో దావా వెయ్యవచ్చును. మీరు డబ్బు ఇచ్చి రశీదు తీసుకున్నారు. వివరాలు పూర్తిగా వ్రాయలేదు. డబ్బు తిరిగి ఇచ్చివెయ్యవలసినదని లాయరు నోటీసు పంపించండి. డబ్బు తిరిగి ఇవ్వనప్పుడు కోర్టులో వెంటనే దావా వెయ్యండి.

శ్రీకొండ నవీన్, గూడూరు.

ప్రశ్న: కోర్టు మాన్యుయల్ వివరణలు ఉదాహరణలతో తెల్పుదురని ప్రార్థించుచున్నాను.

జవాబు: రేండమ్ హౌస్ డిక్షనరీలో మాన్యుయల్ అంటే సమాచారము అందించే హేండ్ బుక్ అని అర్థం ఇచ్చారు. మద్రాసు లా జర్నల్ వారు "సివిల్ కోర్టు మాన్యుయల్" అని 1976 ఎడిషన్ ప్రచురించారు. అందులో సివిల్ కోర్టులకు సంబంధించిన అన్ని చట్టములు, నిబంధనలు, కేస్ లాతో కూడా ప్రచురించారు. లాయర్లకు ఈ మాన్యుయల్ ఉపయోగకరంగా ఉంటుంది. ఇక సివిల్ ప్రొసీజర్ కోడ్ మీద, ఆస్తుల బదిలీల చట్టము మొదలగు అనేక చట్టముల మీద వ్యాఖ్యానములతో, పాతకేసుల వివరాలతో పెద్ద గ్రంథములు ప్రచురణ సంస్థలు ప్రచురించారు. నేను కూడా ఆంధ్రప్రదేశ్ కో ఆపరేటివ్ సొసైటీల చట్టమునకు (1964) వ్యాఖ్యానములు, కేస్ లా ఉదహరించి వ్రాశాను. ఈ పుస్తకం విశాఖపట్నం ఆంధ్రా లా హౌస్ వారు 1987 లో ప్రచురించారు. సుప్రీమ్ కోర్టు (1981-85) డైజెస్టు, మరియు 1986 సుప్రీమ్‌కోర్టు డైజెస్ట్‌కూడా వ్రాసి విశాఖ లా పబ్లిషర్స్ తరపున ప్రచురించాను. ప్రస్తుతం వినియోగదారుల రక్షణ చట్టమునకు (1986) వ్యాఖ్యానము, కేస్ లాతో వ్రాశాను. ఈ పుస్తకం కూడా విశాఖపట్నం ఆంధ్రా లా హౌస్ వారు ప్రచురిస్తున్నారు. లాయర్లకు, కోర్టులకు వ్యాఖ్యానములు, కేస్ లాతో ఉన్న లా గ్రంథములు చాలా అవుసరం. కోర్టు మాన్యుయల్ కూడా అటువంటిదే.

జి. కృష్ణమోహన్, తాడిపత్రి.

ప్రశ్న: 1987లో మా నాన్న అన్నకూతురికి, మా అమ్మ తమ్ముడికి పెండ్లి అయినది. 1989 నవంబర్‌లో మా అక్క అంటించుకొని చనిపోయినది. 1988లో డాక్టర్లు 10, 15 ఏళ్ల వరకు ఆమెకు పిల్లలు పుట్టరని చెప్పారు. ఈ విషయముమీద మా అక్క, మా మామ పోట్లాడి మాట్లాడడం మానివేశారు. 1989 నవంబర్‌లో ఉదయం 9 గంటలకు మా మామ ఆఫీసర్ దగ్గరకు వెళ్లాడు. 9 గంటల 30 నిమిషాలకు ఇంటికి వచ్చినప్పటికి అక్క కాల్చుకొని చనిపోయినది. మామామ అక్క, అమ్మ వీధిలో కూర్చున్నది. మా పెదనాన్నకు ఈ విషయం తెలిసి మా మామ, అక్కను కిరసనాయలుపోసి చంపివేశాడని అనంతపురం పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చాడు. మా అక్క కిరసనాయిలు పోసుకొని చనిపోయినదా, లేక ఆమెను చంపినాడా తెలియజెయ్యవలెను.

జవాబు: పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు ఇచ్చిన తర్వాత, దర్యాప్తు జరిపి కోర్టులో కేసు దాఖలుచేసి వుంటారు. కనుక ఇప్పుడు ఎటువంటి అభిప్రాయము తెలియపర్చకూడదు.

ఎస్. చిన్నారెడ్డి, మదనపల్లి.

ప్రశ్న: నా అక్క కుమార్తె జయమ్మకు 6 సంవత్సరముల క్రిందట రెడ్డప్పతో వివాహం హిందూ సాంప్రదాయం ప్రకారంగా జరిగింది. మూగదైనప్పటికి వివాహం చేసుకున్నాడు. ఇంకా సంతానము కలుగలేదు. కర్నాటక రాష్ట్రమునకు చెందిన రామలక్ష్మమ్మను ఒక దేవాలయంలో మరొక వివాహం చేసుకున్నాడు. అందుచేత మదనపల్లి సబ్ జడ్జి కోర్టులో కేసు పెట్టారు. ఈ రెండవ వివాహం చెల్లునా? తెలియపర్చవలెను.

జవాబు: మీ కేసు కోర్టులో పెండింగుగా ఉన్నది. కనుక సమాధానం ఇవ్వడం సాధ్యంకాదు.

టి. లక్ష్మీకాంతమ్మ, ఏలూరు-1

ప్రశ్న – నా భర్తకు నేను రెండవ భార్యను నాకు ఇద్దరు కుమార్తెలున్నారు నాకు 1968లో నా భర్తకు మొదటి భార్య ఉండగా వివాహమైనది నా భర్త తండ్రి చనిపోక ముందు ఇండ్లు, కొన్ని ఆస్తులు దస్తావేజు ద్వారా 1960లో సంక్రమింపజేశారు నా భర్త సదరు ఆస్తిని 1970లో మొదటి భార్యకు దాఖలు పరిచారు నా పెద్ద కుమార్తె మేజరు అయి మూడు సంవత్సరములు దాటిపోయినవి నా ఇద్దరు కుమార్తెలు పార్టిషన్ దావా వేసి వాటా సంపాదించుకో గలరా? తెలుపవలెను

జవాబు:– మీ భర్తకు మొదటి భార్య ఉండగా మీరు వివాహం చేసుకొనడం భారతీయ శిక్షాస్మృతిలోని 494 సెక్షన్ క్రింద నేరము చేసినట్లు అవుతుంది. కనుక మీ కుమార్తెలకు ఆస్తి హక్కు లేదు. అయితే క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125 సెక్షన్ ప్రకారం అక్రమ సంబంధం అయినప్పటికి మైనర్ కుమార్తెలకు, జీవన భృతి చెల్లించాలి. కాబట్టి మీ మైనర్ కుమార్తెకు జీవన భృతి చెల్లించాలని కోర్టులో పిటిషన్ పెట్టవచ్చును. ○

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయచట్టం ప్రశ్నలు జవాబులు

ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

మ్యారేజస్ ఆర్...

-రాధ

'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్' అంటారు. కాని, నేడు 'మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ మేగజైన్స్' అంటాను నేను, అంది రాధ "ప్రతాపరుద్రుడు" సెట్‌లో.

కారణమడిగితే, ఆమె నవ్వుతూ చెప్పిందిలా-

"కొందరు పాత్రికేయులు కలిసి నాకో పెళ్ళిచేసి, అమెరికాకే రవాణా చేసేటట్లు న్నారు.

నటీనటుల మధ్య ప్రణయాలను సృష్టించి, పరిణయాల వరకూ తీసుకెళ్ళి ప్రళయాలను కలిగించే పెళ్లిళ్ళ పేరయ్యలు మేమే అన్నట్లుంది కొందరు పాత్రికేయుల- ముఖ్యంగా తమిళ పాత్రికేయుల ధోరణి.

ఏ తార అయినా జోడు లేకుండా ఒంటరిగా ఉండడం పాపం ఆ పాత్రికేయులకు మహాకష్టంలా వుంటుందేమో! అందుకే ఒకరికొకరికి ముడిపెట్టి పాఠకులకు అందించడంలో పోటీ పడుతున్నారు.

ఒక్కోసారి ఆ వార్తలు చదివిన కొందరు తారలు నిజంగానే చంచలచిత్తులు కావచ్చేమో!

ఇందులో మంచీఉంది; చెడూ ఉంది

ఒకవేళ నటుడు, నటి మనస్సుల్లోనే ఇష్టపడ్డారనుకోండి. ఆ ఉద్దేశ్యాన్ని పరస్పరం తెలియజేసుకోవడానికి వాళ్ళు తటపటాయిస్తున్న సమయంలో- ఇలాంటి వార్తలు వాళ్లకు ధైర్యం కలిగించవచ్చు. అలా అలా పెళ్ళికి దారి తీయవచ్చు.

ఇక చెడు అంటారా! ఎన్నో....!

"ఫలానా తారకు పెళ్ళట! పెళ్ళయ్యాక ఆమె నటిస్తుందో-లేదో!" అని నిర్మాతలు భయపడి ఇక ఆమెను బుక్ చేయడానికి వెనుకంజ వేయవచ్చు. పాత నిర్మాతలైతే తమ చిత్రాల్లో ఆమె వర్క్‌ను త్వరగా ముగించమని హైరాన పెట్టవచ్చు.

"నాకిప్పుడు పెళ్ళీలేదు; పెడాకులూ లేదు. అంతా వదంతులే!" అని ఓ నటి ప్రెస్‌మీట్ హడావిడిగా ఏర్పాటుచేసి, పాత్రికేయులకు తెలియపరచవలసిన అవసరం ఏర్పడుతుంది.



ఒక నటుడ్ని ప్రేమించిందే అనుకుందాం. ఈ వార్త గనక అచ్చయి రచ్చకెక్కితే, వాళ్ళ వివాహం జరగకుండా ఉభయుల తల్లిదండ్రులూ అడ్డుపడవచ్చు. వాళ్ళిద్దరూ ఒకే చిత్రంలో నటించకుండా, ఎక్కడా కలుసుకోనివ్వకుండా- అసలు ఆ నటుడితో ఆ నటి ఫోన్‌లో సైతం మాట్లాడనివ్వకుండా తగిన కట్టుదిట్టాలు చేయవచ్చు. ఇలా జరిగిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి కదా?

నా విషయానికే వద్దాం... ఈ పాత్రికేయులు ఇంతవరకు నాకెన్ని పెళ్ళిళ్లు చేశారో! మొట్టమొదట కేరళలో నాకో సంబంధం చూశారు. ఆ తర్వాత మా అక్క అంబిక అమెరికాలో నాకో వరుడ్ని చూసిందన్నారు.

ఒక విషయంలో మాత్రం నేను అదృష్టవంతురాల్ని. ఇంతవరకు నా జీవితాన్ని ఏ హీరోతోనూ ముడిపెట్టలేదు!

మరి పెళ్ళెప్పుడు?

నాకు తప్పకుండా పెళ్లి జరిగి తీరుతుంది. నేనూ అందరిలాంటి ఆడదాన్నే కదా? ఆ సుముహూర్తం ఎప్పుడు వస్తుందో ఎవ్వరూ చెప్పలేరుగా!

నా బాగోగుల గురించి మా తల్లిదండ్రులకన్నా ఎక్కువ శ్రద్ధవహించే వారెవరున్నారు? వాళ్ళు నాకు మంచి సంబంధాన్ని చూస్తారు.

ఈలోగా నేను తొందరపడి ఎవరికైనా ఎందుకు మనసివ్వాలి?

దేనికైనా సమయం రావాలి. అవునా? ఆ సమయం అదే వస్తుంది. అప్పుడే నా వివాహం.

కళ్యాణమొచ్చినా, కక్కొచ్చినా ఆగదన్న విషయం ఎవరికీ తెలియనిదికాదు.

ఈలోగా పాత్రికేయులు లేనిపోనివి రాసి, మంగళవాద్యాలు మ్రోగించి, మూటాముల్లెతో నన్ను ఏ అమెరికాకో సాగనంపే ప్రయత్నం చేయడం వృధా ప్రయాసే. ఏమంటారు?

ఐతే ఒకటి... పెళ్ళయ్యేలోగా నేను

ష్టటిగా సాధించవలసినవి ఎన్నో వున్నాయి. ఇప్పుడు నా దృష్టంతా ఆ లక్ష్యంమీదే. అంతకుమించిన కోరికలు ప్రస్తుతం నాకు లేవు

మీ కోరికలు ఈ నూతన సంవత్సరంలో నెరవేరాలని భగవంతుని ప్రార్థిస్తాను.



పాఠకులకు
"ఉగాది" శుభాకాంక్షలు!

రాధ

(-జి.వి.జి.)

విముక్తి • జిట్టప్రకాష్ రావు

తల్లి కళ్లలో కన్నీరు చూడగానే నాలుగేళ్ల సరిత హృదయం విలవిలలాడింది. "అమ్మా ఏడవ కమ్మా" ఏడుపు గొంతుతో అంటూ తల్లి కళ్ల నుండి కారిన కన్నీటిని తుడవసాగింది.

సరిత గొంతులోని బాధను గుర్తించిన ఇందిర బలవంతంగా ఏడుపు దిగమింగుకొంది.

"నాన్న, తాతయ్య, నాన్నమ్మ మంచివారు కాదు కదమ్మా, ఎప్పుడూ నిన్ను కొడుతూ వుంటారు" అంతకు ముందు వారంతా తన తల్లిని కొట్టడం వల్ల వాచి పోయి ఎర్రగా కందిపోయిన బుగ్గల వైపు, చేతుల వైపు జాలిగా చూస్తూ అంది సరిత.

"తప్పమ్మా పెద్ద వారిని అలా అనకూడదు". అంది ఇందిర.

"తాతయ్య నడిగి డబ్బులు తెచ్చిస్తే నిన్ను కొట్టనన్నారుగా. వెళ్లి తీసుకొని రావచ్చు కదమ్మా" అంది సరిత.

"తాతయ్య దగ్గర డబ్బులు లేవమ్మా" బాధగా సరితను దగ్గరకు తీసుకుంటూఅంది ఇందిర.

"మరి డబ్బులు ఎవరిస్తారు"

"నువు బాగా చదివావంటే ఆ తరువాత పెద్ద ఉద్యోగం వస్తుంది. అప్పుడూ నీకు అంత డబ్బులు ఇస్తారు. ఆ డబ్బులు వీళ్ళకు ఇచ్చేస్తావుగా" అంటూ అడిగింది.

"అలాగే ఇస్తాను" అంది సరిత.

★ ★ ★

ఇందిర భర్త రంగనాధం. ఆఫీసులో గుమాస్తా ఉద్యోగం. వారికి ఇద్దరు సంతానం. నాలుగేళ్ళ వయసుకల కూతురు సరిత, కాన్వెంటులో యు.కె.జి. చదువుతోంది. ఒక సంవత్సరం వయసుగల కొడుకు సతీష్.

పెళ్ళైనప్పటి నుండి ప్రతి సంవత్సరము ఏదో ఒక సాకుతో రంగనాధం డబ్బు అవసరమంటూ ఐదు నుండి పదివేల రూపాయల వరకూ ఇందిరను తీసుకొని రమ్మనేవాడు. భర్త కోరిన విధంగానే తల్లి తండ్రుల నడిగి డబ్బు తీసుకొని వచ్చేది ఇందిర.

రెండవ కాన్పుకై తల్లి తండ్రులుంటున్న గ్రామానికి వెళ్ళింది ఇందిర. సతీష్ పుట్టాడు. అత్తగారింటికి బయలుదేరడానికి కొద్ది రోజుల ముందు భర్త తీసుకొని రమ్మని చెప్పిన ఐదు వేల రూపాయల గురించి తల్లి తండ్రులతో చెప్పింది.

ఇందిర తండ్రి సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. ఇందిర అత్తగారింటికి బయలుదేరు రోజున ఐదు వేల రూపాయలు చేతికిస్తూ "ఇందిరా మా పరిస్థితి కాస్త అర్థం చేసుకోమ్మా. పెళ్ళి కెదిగిన నీ చెల్లెలు, చదువుకొంటున్న నీ తమ్ముడి ఖర్చుల గురించి నీకు చెప్పనక్కరలేదనుకొంటాను. ఈనాలుగేళ్ళు మీ భర్త అడిగిన డబ్బు లేదనకుండా ఇవ్వడంవల్ల ఇంతవరకూ మా కంటూ ఒక్క పైసాకూడా మిగల పెట్టుకోలేక పోయాయి. ఈసారి పంటల్లో కొద్దిగా నష్టం కూడా కలిగింది. ఇప్పుడు నీవడిగిన మొత్తంలో మూడు వేల రూపాయలు అప్పు చేసి తీసుకొని వచ్చాను. ఇక మీదట మీ ఆయన అడగకుండా చూసుకో" అని చెప్పాడు ఇందిర తండ్రి.

"ఇందిరా, ఇక మీదట అడిగినా మేము ఇచ్చే స్థితిలో లేము" అంది ఇందిరతల్లి.

ఇందిర అత్తగారింటికి బయలుదేరింది. సతీష్ వయసు ఒక సంవత్సరము పూర్తి కాసాగింది. తల్లి తండ్రుల సలహామీద ప్లాటు కొనడానికి తక్కువ పడిన పదివేల రూపాయలను ఇందిరను పుట్టింటికెళ్ళి తీసుకొని రమ్మన్నాడు రంగనాధం. ఇందిర తన తల్లి తండ్రుల ఆర్థిక పరిస్థితి తెలిపి వారినిక ఎట్టి పరిస్థితిలోనూ డబ్బులడగదలచుకోలేదని తెలిపింది.

ఇందిర చెప్పింది విన్న భర్త, అత్తమామలకు విపరీతమైన కోపం కలిగింది. ఎలాగైనా సరే ఇందిర చేత ఆ డబ్బు తెప్పించాలనుకొన్నారు. అప్పటి నుంచి అకారణంగా తప్పు పట్టడం కొట్టడం ప్రారంభించారు. కొడ్తున్నప్పుడు ఇందిర నన్ను కొట్ట వద్దండి అంటూ వేడుకొంటే "నీవు మేమడిగిన డబ్బులు తీసుకొనిరా. అప్పుడు నిన్ను కొట్టము" అని చెప్పేవారు.

భర్త, అత్తమామలు కలసి తనను డబ్బు కోసం పెడుతున్న కష్టాల నుండి బయటపడటానికి వారితో ఎదిరించే ధైర్యం లేకున్ననూ, ఎట్టి పరిస్థితిలోనూ తన తల్లి తండ్రులకు ఇక్కడి విషయాలు తెలియపరచ కూడదన్న మొండి నిర్ణయానికి వచ్చింది. తనకిక ఈ నరకం నుండి విముక్తి లేదనుకొంది. వారై మారితే తప్ప అంతవరకూ ఈ నరకంలోనే గడపక తప్పదనుకొంది. ఇలాంటి సమస్య వస్తే చట్టం ద్వారా పరిష్కరించుకొనవచ్చునన్న ఆలోచన రాలేదు.

★ ★ ★

నాలుగు నెలలు గడిచింది. ఎవరిలోనూ ఏ విధమైన మార్పురాలేదు. భర్త అత్తమామలు పెడుతున్న చిత్ర హింసలను ఇందిర భరించుతూనే వుంది.

ఆరోజు మధ్యాహ్నం భోజనం చేసి వచ్చి సీట్లో కూర్చున్న రంగనాధంకు మేనేజరు పిలుస్తున్నాడన్న ప్యూను పిలుపు విని మేనేజరు రూములోనికి ప్రవేశించాడు.

"రంగనాథం,నువ్వింతటి నీచుడవనుకోలేదు. డబ్బు కోసం ఇంత కర్కోటకంగా ప్రవర్తిస్తావా. కట్నం కేసులో ఇరుక్కుంటే నీ జీవితానికే కాదు, నీ ఉద్యోగానికి కూడా ముప్పు వస్తుంది. డి.ఎస్.పి. దగ్గర్నుంచి ఫోను వచ్చింది చూడు" అంటూ ఫోను అందించాడు మేనేజరు.

వణుకుతున్న కంఠంతో "సార్, నమస్తే సార్. నేను....రంగనాథంను మాట్లాడుతున్నాను" అన్నాడు.

"ఓ! నువ్వేనా రంగనాథంవి. నేను డి.ఎస్.పి. చక్రపాణిని మాట్లాడుతున్నాను. నీవు నీ భార్యను ఇంకా కట్నం కోసం

ఉగాది బాల

రతీపతి వింట వేపపూలు
ప్రతియింట పచ్చ తోరణాలుగాగ
మామిడి మధువులు గ్రోలి
కోకిల గళము విప్పగ
మయూర పింఛము మరిపించు
కోమలాంగులు కోలాటమాడగ
ప్రభాతవేళ ప్రమోద హేల
ఉగాది బాల ఉయ్యాల లూగ!


—చంద్ర

హింస పెడుతున్నట్లు తెలిసింది. మొదటిసారి వార్నింగ్ ఇచ్చి క్షమిస్తున్నాము. ఇకమీదట నీ భార్యను మునుపటిలా బాధించినట్లు తెలిసిందంటే విన్ను, నీ తల్లితండ్రులను జైల్లో వేసి నీ భార్య అనుభవించిన నరకాని కన్నా వెయ్యి రెట్లు నరకాన్ని చూపిస్తాను. మర్యాదగా ఇక మీదటయినా మంచి భర్తగా నడుచుకుంటే బ్రతికిపోతావ్. నీ గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వుంటాము."

తన మీద ఎవరు రిపోర్టు చేసారో అడగాలనిపించినా భయం వల్ల అడగలేకపోయాడు. ఫోనుపెట్టిన శబ్దం విని వణుకుతున్న చేతులతో ఫోను పెట్టేసి ముఖానపట్టిన చెమటను తుడుచుకొన్నాడు రంగనాథం.

మేనేజరు రంగనాథంను బాగా చివాట్లు పెట్టి ఆ తరువాత హితబోధ చేశాడు. చివరగా "ఈ క్షణం నుంచీ నువు మారాలి. ఇప్పుడే ఇంటికెళ్ళి ఇంతకుముందు నేను చెప్పిన విధంగా నడుచుకో" అంటూ పర్మిషన్ ఇచ్చి ఇంటికి పంపాడు.

నిజానికి మేనేజరు హితబోధ చేయడానికి ముందే అంటే ఫోనులో డి.ఎస్.పి. చెప్పింది విన్న మరుక్షణమే కట్నం కేసులో ఇరుక్కుంటే జైలులో పోలీసుల హింస-సంఘంలో చులకనగా చూడుట-ఉద్యోగానికి ముప్పు-మొదలగు వాటి గురించి వూహించిన రంగనాధం ఇక జన్మలో భా ర్యను హింసించను అన్న నిర్ణయానికి వచ్చాడు.



తమ కొడుకు రంగనాథం తమ ముందే కోడలు ఇందిర' దగ్గర క్షమాపణ కోరడం, ఇకముందుఎప్పటికీ బాధపెట్టనని ప్రమాణం చెయ్యడం, ఎవరో అజ్ఞాత వ్యక్తి డి. ఎస్.పి.కి మన గురించి ఫిర్యాదు చేసారంటూ మధ్యాహ్నం ఆఫీసులో జరిగిందంతా చెబుతూ 'ఇకమీదట ఇందిరను బాధపెట్టవద్దు' అంటూ ఇందిర ముందే చెప్పడం వారికి అవమానమనిపించింది. అంతేకాకుండా డి.ఎస్.పి. తమ గురించి కూడా చెప్పడంవల్ల కల్గిన భయంతో ఇక్కడుండడం మంచిది కాదనిపించింది. తల్లిదండ్రులు అప్పటికప్పుడే తమ గ్రామానికి బయలుదేరుతామని పట్టుబడితే రంగనాథం సరేనన్నాడు.

'తమ కుటుంబ విషయం డి.ఎస్.పి. వరకు ఎవరు తీసుకెళ్ళారు?' అన్న ప్రశ్న వారందరిలో జవాబు దొరకని ప్రశ్నయింది.

తల్లితండ్రులను బస్సు ఎక్కించడానికి రంగనాథం వారితో బయలుదేరాడు.

జరిగినదంతా చూస్తున్న ఇందిరకు సంతోషంగా వుంది. భర్త సినిమాలో లాగా డి.ఎస్.పి. ఫోను చేసిన వెంటనే మారిపోవడము ఆశ్చర్యంగా వుంది. పోలీసులంటే మధ్యతరగతి కుటుంబానికి చెందిన నేరస్థులు ఎంతగానో భయపడుతారని తెలుసుకొంది. ఎవరో తన గురించి డి.ఎస్.పి.కి తెలియపరచి తన కష్టాల నుండి విముక్తి కలిగించడానికి కారకులైన ఆ అజ్ఞాత వ్యక్తికి మనసులోనే శతకోటి నమస్కారములు తెలుపుకొంది.

★ ★ ★

"ఆఫ్రికన్ అవ్వ"

నేటి ఆధునిక మానవుని అసలు 'జన్మభూమి' ఆఫ్రికానా?

అమెరికాలో ఇటీవల జరిగిన 'ఆంథ్రోపాలజిస్టుల' సమావేశం ఈ ప్రశ్నకు 'అవుననే' జవాబిస్తోంది మరి!

కొత్తగా లభించిన కొన్ని శిలాజాలు, ఇతర జీవశాస్త్ర సంబంధమైన సాక్ష్యాధారాలను బట్టి చూస్తే ఆధునిక మానవుల ఆవిర్భావం గత 2 లక్షల సంవత్సరాలలో ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలో జరిగి... ఆ తర్వాత వారు ప్రపంచంలోని అన్ని భాగాలకు వలస వెళ్లడం జరిగిందని విశదమవుతున్నట్లు శాస్త్రజ్ఞులు పేర్కొన్నారు.

ఇటీవల "అమెరికన్ అసోసియేషన్ ఫర్ ది అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్" సమావేశంలో పాల్గొన్న ఆంథ్రోపాలజిస్టులు మానవ పరిణామక్రమానికి సంబంధించిన 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' సిద్ధాంతాన్ని కూడా చర్చించారు. నేటి మానవాళి సమస్తం 'సబ్-సహారన్ ఆఫ్రికా'లో నివసించిన ఒకే ఒక్క స్త్రీ నుంచి ఉద్భవించిన వారని ఈ 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' సిద్ధాంతం పేర్కొంటోంది. దీనిని కొందరు జన్యుశాస్త్రవేత్తలు ఇటీవల ప్రతిపాదించారు.


ఈ సిద్ధాంతం ప్రకారం 'ఆఫ్రికన్ అవ్వ' (ఈవ్)కు జన్మించిన మానవులు ఆఫ్రికా నుంచి వలస వెళ్లిపోయి గత లక్ష సంవత్సరాలలో యూరప్, ఆసియా అంతటా విస్తరించారని భావిస్తున్నారు.

కాగా ఆధునిక మానవులు తొలుత ఆఫ్రికాలో ఆవిర్భవించారనడాన్ని సమావేశంలో పాల్గొన్న ఆంథ్రోపాలజిస్టులలో అధికభాగం అంగీకరించారు. అయిదు భౌగోళిక ప్రాంతాలైన ఆసియా, యూరప్, ఆస్ట్రేలియా, న్యూగినియాలకు చెందిన 147 మంది మహిళలకు సంబంధించిన 'మిటోకాండ్రియల్ డి.ఎన్.ఎ.' నమూనాలను విశ్లేషించిన అనంతరం జన్యుశాస్త్రవేత్తలు 'గార్డెన్ ఆఫ్ ఈవ్' సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు.

కోతుల నుంచి మనిషి ఆవిర్భవించి 50 లక్షల నుంచి 60 లక్షల సంవత్సరాలవుతున్నదని భావిస్తుండగా...ఆధునిక మానవుని ఆవిర్భావానికి దోహదం చేసిన 'అవ్వ' పుట్టినతేదీ గత లక్ష సంవత్సరాల నుంచి 2 లక్షల సంవత్సరాలలో వుండ వచ్చునని జన్యు శాస్త్రవేత్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఆఫ్రికాలో తొలి ఆధునిక మానవునికి సంబంధించిన శిలాజాలు ఆఫ్రికా దక్షిణ ప్రాంతంలోని 'క్లాసీస్ రివర్ మౌత్ కేవ్' వద్ద లభ్యమయ్యాయని కూడా పరిశోధకులు తెలిపారు. ఇవి గత 80,000 నుంచి 115,000 సంవత్సరాల మధ్య కాలానికి సంబంధించినవని కూడా భావిస్తున్నారు.

[దీనిమీద - మన శాస్త్రాల ఆధారంగా విజ్ఞులెవరైనా క్లుప్తంగా ప్రతిస్పందన రాస్తే - ప్రచురణామోదం పొందినవాటిని వీక్లీలో వేస్తాము - ఎడిటర్]

విముక్తి



అప్పుడే స్కూలు నుండి వచ్చిన సరిత "ఉదయం బడినందు జరిగిన ఫంక్షన్ నందు కలర్ పెన్సిల్ బాక్స్, ఓ బొమ్మల పుస్తకం నాకు బహుమతిగా ఇచ్చారు" అంటూ సంచి లోంచి సర్టిఫికేట్స్‌తోపాటు పెన్సిల్ బాక్స్, బొమ్మల పుస్తకాన్ని చూపించింది.

ఇందిరకు ఆనందంగా వుంది. 'ఈరోజు జీవితంలో మరిచిపోలేని రోజు. అన్నీ తనకు సంతోషం కలిగించే వార్తలే' అనుకొంది.

ఉదయం జరిగిన స్కూలు వార్షికోత్సవ సంగతులు చెబుతుంటే ఆనందంతో వింటోంది ఇందిర.

"అమ్మా, ఆ ప్రైజులిచ్చిన అంకుల్ ప్రైజులిచ్చిన తరువాత నన్ను 'గుడ్‌గర్ల్' అంటూ ముద్దుపెట్టుకొని 'సరితా నువ్విలాగే బాగా చదివి ఎప్పుడూ ఫస్ట్‌రాంక్ వస్తూ వుంటే బోలెడన్ని ప్రైజులు, ఆడుకొనే బొమ్మలు ఇస్తారు' అన్నారు. అప్పుడు నేను 'అంకుల్ నేను బాగా చదివి ఫస్ట్ వస్తాను. అయితే నాకు ప్రైజులు వద్దు. బొమ్మలు వద్దు డబ్బులిస్తారా' అనడిగాను. 'ఎందుకమ్మా' అనడిగారు ఆ అంకుల్. 'మా తాతయ్య దగ్గర డబ్బులు లేవుగా! మా తాతయ్యకు బదులు నేను డబ్బులిచ్చానంటే మా అమ్మను ఎవరూ కొట్టరుగా' అన్నాను.

అమ్మా, ఆ అంకుల్ చాలా మంచి వారమ్మ. మీటింగ్ అయిపోయిన తరువాత నన్ను హెడ్‌మాస్టరు రూముకు పిలిపించి నాకు స్వీట్లు ఇచ్చి తినమన్నారు. అప్పుడు ఆ అంకుల్ 'మీ అమ్మను ఎవరు కొట్టారు? ఎప్పుడు కొట్టారు? ఎందుకు కొట్టారు' అంటూ అడిగారు. నేను అంతా చెప్పాను. ఆ అంకుల్ పేరు డి.ఎస్.పి. అంకుల్....."

అంతవరకు తన కష్టాల నుండి విముక్తి ప్రసాదించడానికి కారకులయిన దేవుడు ఎవరో అనుకొని పలువిధాల నమస్కరించిన ఇందిరకు ఆ దైవం తన కూతురు సరితని ఇప్పుడు తెలిసింది. కృతజ్ఞత, ఆరాధన నిండిన కళ్ళతో చూస్తూ తన హృదయానికి సరితను గాఢంగా హత్తుకొని ముద్దులు కురిపించసాగింది.

○



ప్రసవవేదన పంచుకున్న



మజహర్ ఖాన్

సాధారణంగా సినీతారల వైవాహిక జీవితం అంటే జనంలో ఒక విధమైన చులకన భావం వుంది. సినీతారల చుట్టూ వుండే వాతావరణం, వారి పరిస్థితులు, కొందరి తారల వైవాహిక జీవిత ఘోర వైఫల్యాలు ఇవన్నీ సినీతారల వైవాహిక జీవితం పట్ల ప్రేక్షకులలో సద్భావం కలగకపోవటానికి కారణం అనిపిస్తుంది.

ఇటీవలి సినిమా జంటల్లో సఫలమైన వైవాహిక జీవితం గడుపుతున్న జంటగా జీనత్ అమన్, మజహర్‌ఖాన్‌ల పేర్లు చెప్పుకోవచ్చు జీనత్ అమన్‌లాంటి ఒక అగ్రస్థాయి నటి ఒక ఆదర్శ గృహిణిగాను, తల్లిగాను మారుతుందని ఎవరైనా అనుకున్నారా! మజహర్‌ఖాన్‌లాంటి పురుషుడు ఆమెను ప్రేమించటం, ఇచ్చిపుచ్చుకోవటం లాంటివి నేర్పాడంటే అతిశయోక్తి కాదేమో

వరికి ఇటీవలనే రెండవ కుమారుడు జన్మించాడు అందులో పెద్ద విశేషమేమి లేదు ఏ భర్తా చేయ సాహసించని పనిని అతను చేశాడు తన భార్య ప్రసవవేదనలో తానూ దగ్గరుండి పాలుపంచుకున్నాడు ఆమె ప్రసవవేదన పడుతుంటే ఆమెను ఓదారుస్తూ, ఆ కార్యక్రమాన్నంతా దగ్గరుండి చూసి తన ధైర్య వచనాలతో ఆమె బాధను కొంతవరకు తగ్గించగలిగాడు స్త్రీ బిడ్డకు జన్మనివ్వటం చూసిన ఎవరైనా స్త్రీ బలహీనురాలు అని అనలేరు అంటున్నాడు ఈ సందర్భంగా ఆ విషయాన్ని గూర్చిన కొన్ని ప్రశ్నలకు మజహర్ ఇచ్చిన జవాబులు పాఠకులకు ఆసక్తికరంగా వుంటాయని ఇక్కడ ఇస్తున్నాము

ప్ర.- మీ శ్రీమతి ప్రసవ సమయంలో దగ్గరే వుండాలని మీరు అనుకున్నారా, లేక ఇది ఆమె కోరికా?

జ.- నేను ఆ అనుభవంలో నా భార్యతో పాలుపంచుకోవాలనుకున్నాను అందువలన ప్రసవ సమయంలో ఆమె ప్రక్కనే వున్నాను ఇది రెండవసారి మా అజాన్ పుట్టినపుడు కూడ నేను ఆమె ప్రక్కనే వున్నాను మా అజహర్ పుట్టినపుడు మాత్రం (మొదటి భార్య రూబియానాకు పుట్టిన కొడుకు) నేను ఆమె ప్రక్కన లేను ఆమె అందుకు ఒప్పుకోలేదు కాని జీనత్ ఇందుకు సంతోషంగా అంగీకరించింది

ప్ర.- ఈ సమయంలో మీ అనుభవమేమిటి?

జ.- ఒక జీవి ఈ ప్రపంచంలోకి రావటం అనేది చాలా ఆశ్చర్యం కలిగించేది మన కళ్ల ముందు ఒక జీవి స్త్రీ గర్భం నుండి బయటకురావటం అనేది ఒక దివ్యమైన అనుభూతి ఆ సమయంలో స్త్రీ యొక్క పూర్తి భిన్నమైన రూపాన్ని చూస్తాం బిడ్డకు స్త్రీ జన్మనివ్వటం చూసిన ఏ మగవాడైనా స్త్రీ బలహీనురాలు అనలేడు

ప్ర:- పురుషులు అనుకునేట్లు అది చాలా కష్టమైనదా?

జ.- నిజంగా కష్టమైనదే పురుషులు రెండు రోజులు వరసగా పని వత్తిడి ఎక్కువయితే వీపు నొప్పి, నడుం నొప్పి అంటూ బాధపడతారు కాని స్త్రీలు 9 నెలలు ఒక బిడ్డను తమ గర్భంలో మోసి, పురుషుల ఆశాన్ని తమ మాతృత్వ కాంక్షను తృప్తిపరిచేందుకు ఆ బిడ్డకు జన్మనివ్వటం నిజంగా నమ్మశక్యం కాని సాహస కార్యం పురుషుడు ఒక స్త్రీని బిడ్డకు జన్మనిచ్చేటపుడు చూసిన తరువాత "ఇంకా నయం ఇదంతా నేననుభవించవలసిన అవసరం లేదు. అమ్మో! అని అనుకోకుండా వుండలేడు

ప్ర:- ప్రసవ సమయంలో ఆమె పడే బాధ చూసి మీకు చీకాకు కలగలేదా?

జ:- లేదు. నాకు అసలు అలా అనిపించలేదు. పైగా నా భార్యను అటువంటి బాధాకరమైన స్థితిలో చూడలేక పోయాను. నా ప్రియమైనవారు కష్టపడుతుంటే చూడలేను. నా బాధను దాచుకుని ఆమెకు ధైర్యం చెపుతూ ప్రోత్సహించాను. ఆమె తెల్లవారు ఝామున 2-30 గంటలకు లేబర్ రూమ్‌కు వెళ్ళింది. 5 గంటలకల్లా ప్రసవించింది. ఈసారి త్వరగా ప్రసవం అయింది. ఏ మగవాడైనా ఇదంతా చూసి అమ్మో ఇంక పిల్లలు వద్దు అనుకుంటాడు. కాని ఆరు నెలల తరువాత ఇంకొకళ్ళు వుంటే బాగుంటుందేమో అనిపిస్తుంది. జీనత్‌కు ఇంకొక ఆడపిల్ల కావాలనుంది.

ప్ర:- స్త్రీ బిడ్డను జన్మనివ్వటం పురుషుడు చూస్తే, స్త్రీపురుష సంబంధాల్లో శృంగార భావం తగ్గుతుందంటారు. నిజమేనా?

జ:- అలాంటిదేం లేదు. అదంతా మన మనసుని బట్టి వుంటుంది. ఇది నా సెక్సు జీవితానికేం అడ్డం కాలేదు. నా దృష్టిలో గర్భవతియైన స్త్రీ ప్రపంచంలోని మనోహర దృశ్యాల్లో ఒకటి. అందునా ఆమె భార్య అయితే ఇంక చెప్పక్కరలేదు.

ప్ర:- మీరిద్దరూ వివాహం చేసుకున్నప్పుడు అతడిలో ఏమి చూసి ఆమె పెళ్ళి చేసుకుంటున్నది అనుకున్నారు. మరి మీరిద్దరూ ఒకరిలో ఒకరు ఏం చూశారు?

జ:- ఆమె నాలో ఏం చూసిందో, నేను ఆమెలో ఏం చూశాను అనే స్థితి. మా వివాహ సమయానికి మేమిద్దరం దాటి వచ్చాం. మాదేమి టీనేజ్ ప్రేమకాదు. మా కళ్ళలోని మెరుపులు, తళుకులు చూసి ప్రేమించటం లాంటివేమీ లేవు.

మేమిద్దరం మంచి స్నేహితులం యిప్పటికీ. మా వ్యక్తిత్వాలు చాలా భిన్నమైనవిగా కనిపించినప్పటికీ మా ఇష్టాయిష్టాలు, ఆలోచనా విధానం అంతా ఒక్కటే.

ప్ర:- మీ వివాహ సమయానికి జీనత్ టాప్ స్టార్. అపుడు మీరు పైకి వస్తున్న నటులు. ఇది మీ వైవాహిక జీవితంలో ఏమైనా వొత్తిడికి కారణమైందా? ఇపుడు మీరు టాప్ స్టార్ అయ్యారు. ఈక్వేషన్ మారింది కదా?

జ:- జీనత్ వివాహ సమయానికి టాప్‌స్టార్ అయ్యుండటం నాకంటే నిర్మాతలకు ఎక్కువ విచారం కలిగించి వుండొచ్చు. దేవుని దయవలన ఒక్క నా మొదటి కొడుకు అజహర్ విషయంలో తప్ప యింక ఏ విషయంలోను నేను తప్పు చేసినట్లు భావించటం లేదు. నేను పెరిగిన వాతావరణాన్ని, నా వ్యక్తిత్వాన్ని చూసి గర్విస్తాను. నా భార్యను నాకు చేతనైనంతగా సుఖపెట్టాలని చూస్తాను మేము నా తల్లిదండ్రులతోనే నివసిస్తున్నాం. నేను ఆమెను నటించవద్దని ఎపుడూ శాసించలేదు. అదృష్టవశాత్తు నేను మార్లన్ బ్రాండోతో పోటీ పెట్టుకుంటున్నాను కాని జీనత్ అమన్‌తో కాదు. ఆమె అంతట ఆమే నటించటం మానివేసింది. మాది సాంప్రదాయిక కుటుంబమే గాని మూర్ఖ సాంప్రదాయాలతో కూడినది కాదు. జీనత్ ఇప్పటికీ మంచి చిత్రాలైన 'గవాహ' లాంటి చిత్రాల్లో చేస్తున్నది.

ప్ర:- ఆర్థిక విషయాల్లో మీరు ఎలా వుంటారు? నీ డబ్బు, నా డబ్బు అంటారా లేక మన డబ్బు అనుకుంటారా?



నోముల పంట 'అజ్హార్'తో...

జ:- నేను డబ్బు విషయంలో ఎపుడూ గట్టిగా వుంటాను. దురదృష్టవశాత్తు మనం డబ్బుకు అధిక ప్రాధాన్యతనిచ్చే సమాజంలో వున్నాం. నేను నా స్నేహితుల కోసం చాలా చిత్రాల్లో ఉచితంగా నటించాను. పరిశ్రమ నుంచి నాకు చాలా డబ్బు రావాలి. నేనెపుడూ అడగలేను. నిజానికి జీనత్, నేను ఈ విషయమై ఎప్పుడూ దెబ్బలాడుకుంటాము. ఆమె ఆ విషయాల్లో చాలా గట్టిది. నేనలా వుండలేను.

నా చిత్రం 'గాంగ్' ఒకటిన్నర కోటి అవుతుందని అంచనా. కాని రేపొద్దున అది అపజయం పాలయితే, దాని నుండి నన్ను నా భార్య కాపాడాలని అనుకోను. అది తప్పని కాదు. నా మనస్తత్వం అలాంటిది. అందుకనే 'గాంగ్' మీ మొదటి చిత్రమా అంటే అది నా చివరి చిత్రం కూడా అవొచ్చు అంటాను

ప్ర:- కొద్ది సంవత్సరాల క్రితం మీకు చాలా మంది అమ్మాయిలతో సంబంధాలుండేవని అనుకునేవారు. మరి ఈ రోజున అలాంటివేం వున్నట్లు లేవు కదా! దీనికి కారణం మీరు క్రొత్త జీవితం ప్రారంభిద్దామనుకోవటమా, ఇష్టం లేకపోవటమా, టైమ్ లేకపోవటమా?

జ:- దీనికి కారణం అప్పటికీ, యిప్పటికీ, జీవిత గమ్యంలోనూ, ప్రాముఖ్యతల్లోనూ మార్పు రావటం. నాకు గతంలో యువతులతో స్నేహాలు లేవని అనను. అమ్మాయిలు నాకు ఎపుడూ మంచి స్నేహితులు. నేను ఆరోగ్యంగా వున్న మగాణ్ణి. చిన్నతనంలో మగతనాన్ని చూపించుకోవాలని, ఆడస్నేహితులు ఎక్కువగా వుండాలని అనిపిస్తుంది. కాని ఇపుడు అది తలుచుకుంటే చాలా సిల్లీగా అనిపిస్తుంది. ఈ రోజు నా ధ్యేయం నా పిల్లలు. నేను విజయం సాధించాలని, వారి కోసం ఏదో సంపాదించాలని, ఒక తండ్రిగా గర్వించాలని వుంది. నా విజయాన్ని వారి కళ్ళలో చూడాలని వుంది. అదే నా నిజమైన ధ్యేయం ఈ రోజు.

- జె. శాంతి

సీరియల్

వజ్రసంకల్పం

సాతవాహన

(గత సంచిక తరువాయి)

అతను చిన్నగా నవ్వి రివాల్వింగ్ ఛైర్లో తాపీగా వెనక్కివాలాడు. పింకీ కళ్ళు అతన్నే తదేకంగా చూస్తున్నాయి. ఆ ప్రశ్న అడుగుతుండగా తన మనసులో కలుగుతున్న వుద్వేగం బయటికి తెలియనీయడంలేదు. సాధ్యమైనంత అమాయకంగా మొహం పెట్టింది.

తనడిగిన ప్రశ్నకు సమాధానం తనకు తెలియందేంకాదు. ఆమెకు క్షుణ్ణంగా అన్నీ తెలుసు. అయినప్పటికీ తన కన్నీ తెలుసుననే విషయం అతనికి తెలియడం ఆమెకిష్టంలేదు. తను సాధించదల్చుకున్న పని సాధ్యమైనంత అమాయకంగా ఏమీ తెలియనట్టే సాధించుకోవాలి.

కొంతకాలం క్రితం 'టైమ్' పత్రిక క్యూబిక్ జిర్కోనియా అంటె ఏమిటో విపులంగా ఓ వ్యాసం ప్రచురించింది. సామాన్యులెవరికీ క్యూబిక్ జిర్కోనియా అంటే ఏమిటో అర్థం తెలీదు. పింకీ ఓ అమెరికన్ మేగజైన్లో ఆ ఆర్టికల్ చదివింది - కాబట్టే ఆమెకి బాగా తెలుసు. క్యూబిక్ జిర్కోనియా గురించి రాస్తూనే ఆ పత్రిక శక్తిధర్, ఫొటోతోసహా కొన్ని వివరాలు ప్రచురించింది. ఆ మేగజైన్లో వచ్చిన ఆ ఆర్టికల్ పింకీకి చాలా ఆసక్తి కలిగించింది. కానీ, ఆ ఫోటోలో వున్న అందమైన యువకుడి కారునే ఆ వుదయం తను యాక్సిడెంటు చేసిందన్న విషయం ఆ సమయంలో ఆమెకు తెలీదు. కానీ, అతని పర్సుకొట్టేసి అందులో అతని విజిటింగ్ కార్డు చూస్తూనే ఆమెకు అంతా పూర్తిగా అవగాహనకొచ్చేసింది. ఆ మేగజైన్లో ఫోటో వచ్చిన వ్యక్తితో తనకు పరిచయం కలుగుతుందని కల్లోకూడా అనుకోలేదు.

క్యూబిక్ జిర్కోనియా అన్న పదం ఎప్పుడైతే ఆ విజిటింగ్ కార్డుమీద చూసిందో ఆ క్షణంలోనే ఆమెకు తనా విషయం గురించి ఆ మేగజైన్లో చదివిన రిపోర్టంతా మనసులో సినిమా రీల్లా గిరగిరా తిరిగింది. అదే క్షణంలో అప్రయత్నంగానే ఒక అద్భుతమైన పథకం ఆమె మనసులో రూపుదిద్దుకుంది.

ఆ పథకమే సక్సెస్ చెయ్యగలిగితే...!

ఆ విషయం గురించి ఆలోచిస్తుంటేనే ఆమెకు చాలా ఎగ్జైటింగ్‌గా అనిపిస్తోంది.

ఆమె కళ్ళలో వుత్సుకత చూసి అతను మరోసారి చిన్నగా నవ్వేడు.

"చెప్పండి, క్యూబిక్ జిర్కోనియా అంటే ఏమిటి?" రెట్టించి అడిగింది.

అతను నవ్వుతూనే తన రివాల్వింగ్ ఛైర్లోంచి నెమ్మదిగా లేచినిలబడ్డాడు.

"ఆ ప్రశ్నకు సమాధానం చెప్పేముందు నిన్ను ఓ వింత లోకంలోకి తీసుకెళ్లాలి - అప్పుడుగానీ క్యూబిక్ జిర్కోనియా అంటే ఏమిటో నీకర్థం కాదు" అన్నాడు.

"వింత లోకమా?!" కళ్ళు పెద్దవిచేసి మరింత అమాయకంగా మొహం పెట్టేస్తూ విచిత్రంగా చూసిందామె.

అతను తలూపేడు.

"రా చూపిస్తాను," అన్నాడు కుడి చెయ్యి ముందుకు చాస్తూ.

పింకీ ఒక్కక్షణం ఆ చేతివంక సూటిగా చూసి సందేహించకుండా ఆ చెయ్యందుకుని తనుకూడా లేచి నిలబడి అతని వెంట నడిచింది.

అతనామె చెయ్యి మృదువుగా అలా పట్టుకుని హుందాగా ముందుకు నడుస్తూ వెళ్ళి ఆ గదిలో వున్న నిలువెత్తు పెయింటింగ్ ముందు నిలబడ్డాడు.

చూస్తూనే అది ఎమ్.ఎఫ్. హుసేన్ చిత్రించిన పెయింటింగ్ అని గుర్తించింది పింకీ. హుసేన్ ప్రపంచ ప్రఖ్యాతిచెందిన భారతీయ చిత్రకారుల్లో ఒకడు. తెల్లగా సన్నగా పొడుగ్గా వెండిలా తళతళామెరిసే ఒత్తైన తల వెంట్రుకలూ గడ్డంతో గొప్ప ఇంటలెక్చువల్‌గా కనిపించే ఎమ్. ఎఫ్. హుసేన్ పెయింట్ చేసిన గుర్రాలు ప్రపంచ ప్రఖ్యాతిచెందాయి. పైకి చూడ్డానికి అతి నిర్లక్ష్యంగా కనిపించే ఆయన బ్రష్ స్ట్రోక్స్ ఆధునిక చిత్రకళకు ప్రాణం పోసినట్టుగా వుంటాయి. ఎదుర్గా వున్న పెయింటింగ్‌లో ఆయన చిత్రించిన గుర్రం ఒకటి హుందాగా నిలబడివుంది. ఆ గుర్రంపైన కూర్చున్న రౌతు అంతకంటే హుందాగా వున్నాడు.

పింకీ ఆ నిలువెత్తు పెయింటింగ్ ముందు సమ్మోహితురాలిలా కొద్దిసేపుచూస్తూ నిలబడిపోయి అతని వైపు తలతిప్పి చూసింది.

అతనా పెయింటింగ్ ముందు ఎందుకు నిలబడ్డాడో ఆమెకు నిజంగా అర్థంకాలేదు.

అతనామెవైపు చూడకుండా పెయింటింగ్ పక్కనే వున్న స్విచ్ నొక్కాడు. చూస్తుండగానే ఆ నిలువెత్తు పెయింటింగ్ నిశ్శబ్దంగా పక్కకు జరిగిపోయింది. పింకీ అప్రయత్నంగా ఒకడుగు వెనక్కివేసి అతని వైపు విస్మయంగా చూసింది.

"తెలుగు థ్రిల్లర్ సినిమాలో రహస్య ద్వారం వంటిదా ఇది?" నవ్వడానికి ప్రయత్నిస్తూ అడిగింది.

"కాదు, మోడరన్ టెక్నాలజీకి నిదర్శనం. నిజానికి అవతలున్న గదిలో రహస్యం ఏమీలేదు. కానీ, ఆ గది ప్రత్యేకతకి ఈ ద్వారం ఒక నిదర్శనం. లోపలికి పద," నవ్వుతూనే అన్నాడతను.

పింకీ కొద్దిసేపతన్ని విస్మయంగానే

ఇంతవరకూ సాగినకథ -: 27 విశ్వంభరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. వజ్రపాణిని దెబ్బతీసేందుకు విశ్వంభరవర్మ ఎదురు చూస్తుంటాడు. జైలర్ సత్యం కూతురు పింకీ-జూడా ద్వారా వజ్రపాణి దగ్గరున్న వజ్రం గురించి తెలుసుకొని మణిపురం కొండల్లో వున్న అతని హవేలీకి పయనమవుతుంది. వజ్రపాణివల్ల మానసికంగా దెబ్బతిన్న సీలిమకు అతనిపై ప్రతీకారం తీర్చుకుంటావని అభయమిస్తుంది. క్యూబిక్ జిర్కోనియా ఇండస్ట్రీస్ అధినేతశక్తిధర్‌ను కలుసుకున్న పింకీ ఆ కంపెనీ వ్యవహారాలను కూపీలాగుతుంది.

చూస్తుండిపోయి మౌనంగా అనుసరించింది.

అంతే!

లోపల కనిపించిన దృశ్యానికి వులిక్కిపడి కాళ్ళు నేలకంటుకుపోయినట్టుగా అక్కడే నిలబడిపోయింది.

"ఏం అలాగే నిలబడిపోయావ్? ఆశ్చర్యంగా వుందా?" అడిగాడు శక్తిధర్.

పింకీ సమాధానం చెప్పలేదు. అక్కడే అలాగే నిలబడిపోయి సమ్మోహితురాలిలా ఆ గదంతా కలయజూసింది. ఆమె కళ్ళు వజ్రాల్లా మెరుస్తున్నాయి.

ఇటువంటి అద్భుతమేదో ఈ గదిలో చూస్తుందని ఆమె ముందుగానే అంతరాంతరాల్లో వూహించింది. అయితే ఆ అద్భుతం ఇంత అద్భుతంగా వుంటుందని ఆమె వూహించలేదు. ఆ గదిలోని దృశ్యం చూస్తుంటే ఆమె హృదయం ఒక్కక్షణం లయతప్పి స్పందించసాగింది.

అతను ఆమె చెయ్యి మృదువుగా నొక్కి ముందుకు నడిచాడు.

"రా !"

ఆమె మౌనంగా అతన్ననుసరించింది.



శక్తిధర్ ఆ గదిమధ్యన నిలబడి ఒకసారి తృప్తిగా తన చుట్టూ కలయజూశాడు. అతన్తోపాటే ఆమెకూడా ఆ గదిలోని ప్రతి వస్తువునీ శ్రద్ధగా పరిశీలనగా చూడసాగింది.

ఆ గది నిజానికో గదిలా లేదు. ప్రపంచ

ప్రఖ్యాతిచెందిన ఏదో ఓ పెద్ద మ్యూజియం హాలులా వుంది. పైకప్పునుంచి ఖరీదైన షాండ్లియర్లు వేలాడుతున్నాయి. నేలమీద ఒక్కంగుళం కూడా ఖాళీలేకుండా ఈ మూలనుంచి ఆ మూలకు మెత్తని తివాచీ పరచివుంది. ఆ తివాచీ మీదుగా నడుస్తుంటే మేఘాల మీద నడుస్తున్న అనుభూతి కలుగుతోంది. గోడలకు రకరకాల పెయింటింగ్స్ అలంకరించివున్నాయి. అవన్నీ ప్రపంచంలోకెల్లా గొప్ప చిత్రకారులు సృష్టించిన కళాఖండాలని చూడగానే గుర్తించింది పింకీ.

అయితే ఆమె దృష్టిని ఆకర్షించినవి మాత్రం అవేవీకావు.

ఆ గదిలో ఏవైపు చూసినా అద్దాల షోకేసులు వరసగా నిలబెట్టివున్నాయి. అద్భుతమైన నగిషీలు చెక్కిన టేబుళ్ళు నాలుగు మూలలా హుందాగా నిలబడి వున్నాయి. వాటి మీద కూడా పెద పెద్ద షోకేసులున్నాయి.

ఆ అద్దాల షోకేసులన్నింటిలోంచి వెలువడుతున్న కాంతి పింకీ కళ్ళు చెదరగొడుతోంది.

ధగద్ధగాయమైన కాంతి.

ఆ కాంతిని చూసే పింకీ ఆ గదిలో అడుగుపెడుతూనే స్వప్నావశిష్టురాల్లా నిలబడిపోయింది.

ఆ మహాకాంతి వేటిలోంచి వస్తోందో చూడగానే ఆమె గుర్తించింది.

వజ్రాలు!

కళ్ళు మిరుమిట్లు గొలిపే మహావజ్రాలు!

శక్తిధర్ ఆమె చెయ్యి పట్టుకుని ఓ షోకేసు దగ్గరికి తీసుకెళ్లాడు.

అద్దంలో మొహం కనిపించే విధంగా పాలిష్ చేసిన ఓ విశాలమైన టేబుల్‌మీద ఒకే ఒక్క పెద్ద షోకేసు ఎత్తుగా నిలబడివుంది.

ఆ షోకేసులోకి కళ్ళప్పగించి చూసిన పింకీ వళ్ళు ఒక్కసారిగా ఝల్లుమంది.

వజ్రసంకల్పం

ఆ షోకేసులో వున్నదేమిటో చూడగానే గుర్తుపట్టిందామె.

"అదేమిటో తెలుసా?" చూపుడు వేలు పెట్టి ఆ షోకేసులోకి చూపిస్తూ అడిగాడతను.

ఆమె అతి ప్రయత్నం మీద కళ్ళు పైకెత్తి అతని వైపు చూసింది. ఆ వస్తువును చూసిన విభ్రాంతి ఆమె కళ్ళలో స్పష్టంగా కన్పిస్తోంది. ఆ విభ్రాంతిలో తెలుసన్నట్టుగా తలవూపబోయి ఒక్కసారిగా ఆగిపోయింది. ఆమెలోని వివేచన ఆమె వెన్ను తట్టకపోయివుంటే అదేమిటో తనకు తెలుసునని చెప్పేసి వుండేది. అతని కళ్ళలోకి అస్పష్టంగా చూస్తూ తెలీదన్నట్టుగా తలూపింది.

"సరిగ్గా చూడు. దీని ఫోటో పత్రికల్లో ఎక్కడో చూసి వుంటావు," మృదువుగా అన్నాడతను.

ఆమె మరోసారి తల అడ్డంగా వూపి, "చూడలేదు," అంది. ఆ మాట అబద్ధం.

"ఆల్ రైట్ అదేమిటో నేను చెబుతాను," అతని కళ్ళు మరోసారి ధగధగలాడిపోతున్న ఆ కిరీటం మీద లగ్నమయ్యాయి.

"ఇది బ్రిటిష్ మహారాణి కిరీటం!" నెమ్మదిగా అన్నాడు.

పింకీ మాట్లాడలేదు.


కళ్ళప్పగించి ఆ కిరీటం వైపే చూస్తుండిపోయింది.

"అదేమిటో తెలుసా?" ఆ కిరీటంలో ప్రధానంగా వెలిగిపోతున్న మహావజ్రం వైపు చూపిస్తూ అన్నాడతను.

అప్పుడూ పింకీ మాట్లాడలేదు.

"అది...."

నెమ్మదిగా, చాలా నెమ్మదిగా అన్నాడు.



"కో....హి....నూ....ర్....!"

అంతే!

అప్పటివరకూ అతి ప్రయత్నంమీద అణిచిపెట్టుకున్న మహాశ్చర్యం ఇక అదుపుచేసుకోలేక పోయిందామె.

"కానీ.... కానీ.... ఇదెలా సాధ్యం?"

అప్పటివరకూ ప్రసన్నంగా వున్న అతని మొహం గంభీరంగా మారింది.

"మనిషి తల్చుకుంటే సాధించలేనిదంటూ ఏమీ వుండదు!" అన్నాడు.

"అంటే?"

"నీ కళ్ళెదుట కనిపిస్తున్నది అసలైన కిరీటం కాదు. ఆ కిరీటం మోడల్!"

"అంటే....? అంటే.....?"

"ఆ కిరీటంలో కన్పిస్తున్నది అసలైన కోహినూర్ కాదు"

"మరి?"

"అదే....క్యూబిక్ జిర్కోనియా!"

".........!"

"అర్థం కాలేదా?"

"లేదు"

"చెప్తాను....జూబ్లీ, కల్లినాన్, హోప్, స్ప్యూన్‌మేకర్-ఈ వజ్రాల పేర్లైనా కనీసం వినే వుంటావు."

ఆమె తలూపింది.

"ఆ మహా వజ్రాలన్నీ ఈ గదిలోనే నువ్వు ఒకేసారి చూడొచ్చు. కానీ అవన్నీ నేచురల్ డైమండ్స్ కావు. క్యూబిక్ జిర్కోనియా!"

"అంటే...., ఇమిటేషన్......"

"నోనో" గబ గబా అన్నాడతను. క్యూబిక్ జిర్కోనియా అంటే వజ్రాలు కావని నేననలేదు. కాకపోతే ఆ మహా వజ్రాల షేపుల్లో కట్ చేశాం అంతే! కానీ, కోహినూర్‌తో కానీ, కల్లినాన్‌తో కానీ, జూబ్లీతో కానీ ఈ వజ్రాలేవీ తీసిపోవు. నూటికి నూరుపాళ్ళూ ఇవి వజ్రాలే!"

"ఇది సాధ్యమా?"

"అదే చెబుతున్నాను-మనిషి తల్చుకుంటే సాధించలేనిది లేదు. సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగలడు. ఇవన్నీ అసలు సిసలైన వజ్రాలే. కాకపోతే, మనిషి తయారు చేసిన వజ్రాలు! క్యూబిక్ జిర్కోనియా అంటే అదే!"

"మనిషి వజ్రాలు తయారు చేయగలడా?"

"ఇన్నాళ్ళూ ఆ విషయం పరిశోధనల్లోనే వుండిపోయింది. వజ్రాల్ని కూడా తయారు చెయ్యొచ్చునని నేను నిరూపించాను."

"అద్భుతం!"

"ఇంకా వజ్రాలు చూద్దూగాని రా!"

ఆమె యాంత్రికంగా అతన్ననుసరించింది.

ఒక్కో వజ్రాన్ని చూపిస్తూ అతను ముందుకు సాగిపోతున్నాడు. వాటిని చూపిస్తూనే ఆ వజ్రాల పేర్లు-ఆ పేర్లున్న అసలు వజ్రాల చరిత్రతో సహా చెప్పుకుంటూ పోతున్నాడు.

"ఇందాక కోహినూర్ వజ్రం ఎలా వుంటుందో చూశావుగా. ఇప్పుడు అలాంటి పేసే వున్న మరో వజ్రాన్ని చూడు. ఈ వజ్రం పేరు దర్యాయినూర్. కోహినూర్ అంటే 'కాంతి పర్వతం'అన్నట్టుగానే దర్యాయినూర్ అంటే 'కాంతి సముద్రం' అని అర్థం. ఈ దర్యాయినూర్ కథ ఓ పెద్ద మిస్టరీ. టావెర్నియర్ పేరెప్పుడైనా విన్నావా?"

"విన్నాను. పదిహేడో శతాబ్దంలో ఇండియాని సందర్శించిన ఫ్రెంచి వర్తకుడు" చెప్పింది పింకీ.


"వెరీగుడ్ టావెర్నియర్ ఇండియా కొచ్చినప్పుడు గ్రేట్ టేబుల్ అనే ఓ గొప్ప వజ్రాన్ని చూసినట్టు రికార్డు చేసి పెట్టాడు. గ్రేట్ టేబుల్ ఆ తర్వాతేమైపోయిందో ఎవరికీ తెలీదు. బహుశా 1739లో పర్షియాకు నాదిర్షా దోచుకుపోయి వుండాలి. 1791లో హార్ఫోర్డ్ జోన్స్ అనే వ్యక్తి ఈ దర్యాయినూర్ని చూసి ఇది టావెర్నియర్ వర్ణించిన గ్రేట్ టేబుల్ని పోలి వుందని రాశాడు. కేరెట్లలో మాత్రం చాలా తేడా వుంది. 1827లో సర్ మాల్కమ్ జోన్స్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. 1966లో ఓ నిపుణు ల బృందం దర్యాయినూర్ని పరీక్షించి అది గ్రేట్ టేబుల్ని పోలి వుండడం కాదు-వాస్తవంగా అదే గ్రేట్ టేబుల్ అని నిరూపించారు. నిజానికేం జరిగి వుంటుందంటే ఎవరో గ్రేట్ టేబుల్ని గుర్తు తెలియకుండా వుండడం కోసం రెండు ముక్కలుగా కోసి వుండాలి. వాటిలోంచి వచ్చిన పెద్ద భాగం ఈ దర్యాయినూర్. ఇది 185 కేరెట్ల వజ్రం. దీని పక్కనే వున్న ఆ చిన్న వజ్రం చూశావా-అది 'నూరులైన్' 60 కేరెట్ల వజ్రం. గ్రేట్ టేబుల్‌లోంచి కోసిన చిన్న భాగం అదే అయి వుండాలని కూడా ఆ నిపుణు ల బృందం అభిప్రాయం. ఈ రెండు వజ్రాలూ ఇరాన్లో వున్నాయి."

"బ్యూటిఫుల్," అంది పింకీ.

శక్తిధర్ ఆమెకి మరో వజ్రం చూపించాడు.

"టావెర్నియర్ మొగల్ చక్రవర్తుల దగ్గర చూసినట్టుగా రాసుకున్న మరో గొప్ప వజ్రం షాజహాన్. గ్రేట్ టేబుల్‌లాగే అదీ మాయమైపోయింది. ప్రస్తుతం అదెక్కడుందో ఎవరికీ తెలీదు"

"ఆ కథ నాకు తెలుసు," నెమ్మదిగా



అంది పింకీ.

"టావెర్నియర్ చూసిన షాజహాన్ వజ్రం బహుశా ఇలాగే వుండి వుండాలి. అతని వర్ణన అనుసరించి కట్ చేసిన వజ్రం ఇది. 'షాజహాన్' ఎలా వుండేదో దీన్ని చూసి తెలుసుకోవచ్చు," అన్నాడు శక్తిధర్.

పింకీ ఆ వజ్రాన్ని కళ్ళప్పగించి చూసింది. షాజహాన్ వజ్రం ఎలా వుండేదో తన కళ్ళతో చూడగలనని ఆమె కల్లో కూడా వూహించలేదు.

శక్తిధర్ ఆమెకి మరో వజ్రాన్ని చూపించాడు.

"ఇది హోప్ డైమండ్. శాపగ్రస్తమైన వజ్రంగా దీనికి చాలా చెడ్డ పేరుంది."

"దీని చరిత్ర కూడా నాకు తెలుసు," నవ్వింది పింకీ.

శక్తిధర్ మరో చోటికి నడిచాడు.

"ఈ రెండు వజ్రాలు చూడు వాటిలో పెద్దది కల్లినాన్-*I.* దీన్నే స్టార్ ఆఫ్ ఆఫ్రికా అని కూడా అంటారు. ప్రపంచంలో కెల్లా అతి పెద్ద వజ్రం ఇదే. దాని పక్కనున్నది దాని చెల్లెలు కల్లినాన్-*II.* ఈ రెండూ ఒకే ముడి వజ్రంలోంచి కోశారు."

ఇద్దరూ మరో వజ్రం దగ్గరికెళ్ళారు.

"ఇది జూబ్లీ డైమండ్. ప్రపంచంలోని ఇతర మహా వజ్రాలన్నింటి కంటే పర్ఫెక్ట్‌గా కట్ చేసిన వజ్రం ఇదే. అందువల్ల ప్రపంచంలోని మహా వజ్రాలన్నింటిలోకీ అందమైన వజ్రం కూడా ఇదేనని నిపుణు ల అభిప్రాయం. నిన్న మొన్నటి వరకూ ప్రపంచంలోని మొదటి నాలుగు పెద్ద వజ్రాల్లో ఇది నాలుగోదని రికార్డుల్లో కెక్కింది. కానీ, ప్రస్తుతం ఇది అయిదో స్థానంలోకి దిగిపోయింది."

పింకీ చప్పున తలపైకెత్తి చూసింది.

"ఎందు వల్ల?" చురుగ్గా ప్రశ్నించింది.

అతని మొహంలో ఎలాంటి మార్పు లేదు. తన ధోరణిలో తాను చెప్పుకుంటూ పోతున్నాడు-

"నిన్న మొన్నటిదాకా మొదటి నాలుగు పెద్ద వజ్రాల లిస్టులో మొదటిస్థానంలో 530 కేరెట్ల కల్లినాన్-1, రెండో స్థానంలో 317 కేరెట్ల కల్లినాన్-2, మూడోస్థానంలో 277 కేరెట్ల నిజాం, నాలుగోస్థానంలో 245 కేరెట్ల జూబ్లీ (ఖచ్చితంగా చెప్పాలంటే 245.35 కేరెట్లు) వర్సగా వచ్చేవి. ఇప్పడాలిస్టులో కల్లినాన్-1 స్థానం తప్ప మిగతా అన్నింటి స్థానాలూ మారిపోయాయి."

"అంటే?"

"ఇటీవలే-అంటే, 1984లో ఎవరికీ తెలీని ఓ మహా వజ్రం హఠాత్తుగా బయటపడింది. అదెక్కడ్నించి వచ్చిందో ఎవరికీ తెలీదు. దాని పుట్టు పూర్వోత్తరాలు ఇప్పటికీ రహస్యంగానే వుండిపోయాయి. ఆ వజ్రం పేరు 'గోల్డెన్ జ్యుబిలీ'. అదెన్ని కేరెట్లుంటుందో తెలుసా? **(ఇంకా వుంది)**

శ్రీ 'ప్రమోద'లో మీ యోగం!

ఈ 'ప్రమోద నామ సంవత్సరం అరవై సంవత్సరాల చక్రంలో నాల్గవది నారవ సంహి'తాది గ్రంథాలలో 'ప్రమోచ' అని ఉన్నది గాని, కొందరనుకొన్నట్లు 'ప్రమోమాత గామ ఈ వత్సరమున సస్య సమృద్ధి రాజు కుజుడు, మంత్రి శని, సేనాధిపతి శుక్రుడు, సస్యాదిపతి కుజుడు ధాన్యాదిపతి రవి, అర్ఘ్యాదిపతి శుక్రుడు మేఘాధిపతి శుక్రుడు, రసాదిపతి గురుడు,నీరసాదిపతి చంద్రుడు, శుభ పలితమే అదికమైన రాజకలహం, యుద్ధ బీతి మనస్తాపాదులు లేకపోలేదు ప్రయాణ ప్రమాదాలు ఉండవచ్చు అదిక ధరల బాధ తగ్గదు 'ప్రమోద వర్షే సుజనానృపాశ్చ' అని చెప్పవచ్చు లోకం సుబిక్ష మగుగాక!సర్వులూసుఖశాంతి వంతులగుదురు గాక!'ప్రమోద'మన, సంతోషముగదా! 'ప్రమోదా'బ్ది ప్రమోదవంతమై అలరారు గాక! 'ఆనంద ప్రదమగుగాక! అని ఆశింతుము

మేషం : 'పన్నెండు' రాశుల వారికి భోగభాగ్యాదులు జన్మ లేక నామ నక్షత్రములతో రాశులను తెలిసికొని 'ప్రమోద' వత్సర పలములు గ్రహింతురు గాక! మేష రాశి వారికి 'గురుబలం' విశేషంగా లేదు 'శని' జూన్ 20 తా నుండి విశేష ఫలదాత యోగాభివృద్ధికి, ధన వసతికి కారకుడు భాగ్య మబివృద్ధి నందును, సుఖశాంతులు, ఆనందోత్సాహాలు, ఆట పాటలు, చిత్రరంగాను కూలతకు ఆస్కారం కుజుడు అర్ధ సంవత్సరం వరకు లాభదాయకుడు 'జూలై' నుండ ఆరోగ్య రీత్యా జాగ్రత్త పడవలె అనవసర ప్రయాణాలు ఆపుకోవలెనని గ్రహించాలి ఉద్యోగ వృత్తులందు జాగరూకత వహించవలె 'రవి, బుద, శుక్రులు' శుబ ఫల ప్రదాయకులు వ్యాపారలాభం, విలాస వస్తు సేకరణ, కొందరకు గృహ నిర్మాణావకాశం పాత్రికేయులకు, పంపిణీ దారులకు, చిత్ర నిర్మాతలకు వత్సర పూర్వార్ధం లాభదాయకమే ఆదాయం 3, వ్యయం 14 బాగములు

వృషభం : వృషభ రాశి జాతకులకు 'గురుని' ఆశీర్వబలమున 'జూన్' వరకు ధనలోప మున్నది గతముకన్న మేలే బాగ్య యోగం అధికం వస్తు సేకరణకు ఆస్కారం సుఖశాంతులు, ఆనందం, కుటుంబ వృద్ధి, ధనధాన్య వృద్ధి, లాంటి సుఖములకు ఆస్కారం వత్సరమంతా 'శని'కి గ్రహశాంతి అవసరం వ్యవహార, ఆస్తి సంబంధ చిక్కులకు ఆస్కారం జాగ్రత్త! 'రాహు కేతువులు' యోగదాయకాలగుట గమనింతురు గాక! దీర్ఘరోగులు పుంజుకొందురు కొందరు గృహ నిర్మాణమునకు ఉద్యుక్తులగుట గమనింపదగిన ముఖ్యాంశం 'అక్టోబరు' నుంచి వత్సరాంతము వరకు, వ్యాపార లాభం వృత్తి పెంపు, ఉన్నత పదవులకు ఆస్కారం, రాజకీయంగా అనుకూలత, శుభ కార్యాలోచనలు, ఆదాయ వ్యయములు సమం గ్రహింతురు గాక!

మిధునం : ఈ రాశి నాధుడు 'బుధుడు' స్థితుడు గురుడు 'జూలై' వరకు, గురుని రాశి స్థితి మంచిదిగాదు ఆరోగ్యరిత్యా అధిక శ్రద్ధ వహించాలి. దీర్ఘ వ్యాధులవారు మరీ జాగ్రత్త పడాలి 'జూలై 20 తా' నుండి గురుడు సువర్ణమూర్తి యగుటచే సర్వ విదాలా అనుకూలత, యోగాధ్యం 'జూన్ వరకు 'శని' అనుకూలుడుగాడు శుక్ర, బుధులు సంవత్సర మంతయు సువర్ణ మూర్తులు శుభదాయకులు, ధనదాయకులు, సంపద్దాయ కులు, 'ఆర్ద్ర' నక్షత్ర జాతకులు బహు జాగ్రత్తగా ఉండవలె శుబకార్యాలోచన లుంటాయి. వివాహాది కార్యములకు ఆస్కారం 'రాహు కేతువులకు' జపాదులు అవసరం ఆదాయ వ్యయాదులు సమం తగాదాలు రాకుండ చూడనగును

కర్కాటకం :- రాశ్యాధిపతి చంద్రుడు 'జూలై' నుండి గురుని స్థితి అత్యుత్తమం యోగదాయకం ఆనందదాయకం శుబ కార్యాలోచనలుంటాయి వ్యాపారస్తులకు యోగం 'జూలై'కి ముందు అనారోగ్య లక్షణాలుండవచ్చు గ్రహ జపం అవసరం 'శని' స్థితి ఆరవరాశి యందగుట శుభదాయకం భూ సంపద, వ్యాపార లాభం, ఆనందం, కళారంగావకాశాలు, పాత్రికేయులకు, పంపిణీదారులకు, చిత్ర నిర్మాతలకు యోగాధ్యం 'డిశంబరు' వరకు 'ఉత్తర' నక్షత్ర జాతకులకు శత్రు బాద జాగ్రత్త! ఆదాయం 14, వ్యయం 2 గా గ్రహించి, శ్రమించి, మేలుపొందండి

సింహం : 'రవి' రాశ్యాధిపతి ఈ వత్సరం తామ్రమూర్తి అయినా లాభస్థితిచే లాభదాయకుడు శుభదాయకుడు ఆరోగ్య వృద్ధికరుడు సంపదాబివృద్ధి కొందరకు సత్సంతాన ప్రాప్తి 'శని'కి షష్ఠ స్థితి మంచిది యోగదాయకం ఈ వత్సరం 'కేతుగ్రహ, శాంతి అవసరం తద్వారా ఆరోగ్య లాభం మే 22 నుండి ఉద్యోగస్తులకు, కళాకారులకు, పంపిణీదారులకు, పత్రికాధిపతులకు, పనిపాటలు చేయు వారికి అనుకూలం, గ్రహించాలి 'ఉత్తర' వారు అధిక జాగ్రత్త పడవలె. రాజకీయ నాయకులకు మేలు ఆదాయం 2, వ్యయం 14 గా గ్రహించండి. శ్రమించండి

కన్య : రాశి నాధుడు బుధుడు ఈ రాశి ఈ సంవత్సరమంతా గురు బలయుతం. గురునకు ఉచ్ఛస్థితి బహు లాభప్రదుడు ఆరోగ్యదాయకుడు. చిత్రరంగాన శ్రమించు వారికి మేలు. పంపిణీదారులకు యోగం చిత్ర నిర్మాతలకు యోగం రాజకీయ వాదులకు మేలున్నదని, లాభదాయకమని గ్రహించాలి ఉద్యోగ లాభమంటే 'ప్రమోషన్'కు అనుకూలం శుభ కార్యములు యింట జరుగుట నిశ్చయం సభా గౌరవాదులు, మొత్తంలో హాయి ఆనంద ప్రమోదాలే ఆగస్టు 10 తా నుండి 'కుజ' బలయుత దినాలు భూ లాభం అదిక పంటకు ఆధారం అయినా 'శని' వేగంగా పనులు జరుగనివ్వడు తరచు అడ్డంకులు రావచ్చు 'శని' జపం అవసరం 'నీలాంజన సమాభాసునకు' మ్రొక్కవలె 'బుధ, శుక్రులు' నవంబరు నుండి అనుకూలురు ఆదాయానికన్న వ్యయమే అధికం

తుల : రాశ్యాధినాధుడు 'శుక్రుడు' 'మార్చి' నుండి యోగదాయం అంతటి నుండి ప్రతి నెలా 14 తా నుండి జరుగు దినాలు లాభదాయకాలు, శుభదాయకములు 'జూలై నుండి విద్యా విజయం, ఆటపాటలందు ప్రావీణ్యత అదికమగును ఆరోగ్య లాభం సర్వే సర్వత్రా చెప్పనగు 'రాహు కేతు గ్రహాలు వత్సరమంతా అనుకూలురు 'గురుడు' భాగ్యమున స్థితుడై అనేక రితుల మేలు చేయనున్నాడు

'స్వాతి'వారు రాజకీయరంగాన శ్రమించువారు. వ్యాపార రంగాన [illegible] శ్రమించు స్త్రీ పురుషాదులకు మేలు 'మార్చి నుండ

ఉగాది విందు

స. వేపపూ చిరుచేదు వెక్కసంబౌ దుఃఖ
రాజిని దిగమ్రింగునో జగరపు
పులుపు మామిడి ముక్కకలగల్పు తింత్రిణీ
ఫలమెంతొ సహనమ్ము గలుగజేయు
కదళీ ఫలాసారక్రమ మాదుర్యమ్ము
బ్రతుకులో తీపిని బయలుపరచు
పుండ్రేక్షు మధురసాభోగమ్ము జీవన
స్వారస్య సంగ్రాహ్యసరణి జెప్పు

తే గీ తిక్త మదురామ్ల రుచియుక్తి (దేలు నీయు
గాది పచ్చడి విందుగా నందికొనుడు
తెలుగు ప్రజలారా! ఘనకీర్తి కలితులార!
పూర్ణబావ సంబరితానుబూతి చయము

— కొండా సుబ్బారావు

ఆగస్టు' వరకు వ్యాపారస్థులకు అధిక లాభం. సంవత్సరాంతాన శుభకార్య ప్రస్తావనలు ఆదాయం 2, వ్యయం 8 గా గుర్తించవలె.

వృశ్చికం : రాశ్యాధిపతి 'కుజుడు' మార్చి నుండి 'శని' స్థాన మార్పు అయిదు నెలలపాటు మేలు శని బాధ నుండి కొంతలో కొంత విముక్తి మొత్తానికి అంతో యింతో బాధ 'శని' ద్వితీయ స్థితి వలన 'డిశంబరు' దాకా ఉండకపోదు. ఆపైన అంటే 14-1-1991 తరువాత 'త్రి, షట్, ఆయః మందః స్థితః శుభం' అనే న్యాయంతో, మూడు పూలు ఆరు కాయలుగా జీవితం విస్తరిస్తుంది, గ్రహించండి 'ఏప్రిల్' నుండి నాల్గు మాసాలు చేపట్టి కార్యసాఫల్యం, అందం, ఆనందంగా, శుభదాయకంగా, శుభ ప్రస్తావనలు యింట విలసిల్లగలవు. వ్యాపారం బాగా సాగుతుంది పత్రికాధిపతులకు మేలు ఆదాయం 8, వ్యయం 14

ధనుస్సు : రాశ్యాధిపతి గురుడు కొంతకాలం సప్తమస్థితి కొంతకాలం, వత్సర పర్యంతం అష్టమ స్థితి. 'శని' నాల్గు నెలలు యిక్కడ ద్వితీయాన, పిమ్మట వత్సరాంతం వరకు రాశిలో స్థితుడు ఒడిదుడుకులు సామాన్యం. ఇంట శుభం జరుగుట నిశ్చయం ధన లోపం లేదు, రాదు. ఏవో చిలిపి జగడాలు ఉంటాయి. పత్రికా పర్యవేక్షకులకు మేలు. పాత్రికేయులకు మేలు. పంపిణీదారులకు లాభం. ఆదాయ వృద్ధి. ఆరోగ్య పెంపు. 'శని గురు గ్రహాల' ఆరాధన శాంతిదాయకం 'రాహుకేతువులు' చిక్కులు కల్పింపనున్నారు. జాగ్రత్త వహించుట మేలు. ఆదాయం 11, వ్యయం 5.


మకరం : 'శని' వ్యయ స్థితుడై చాల బాధించాడుగా. పద్న యిబ్బందులు చాలుననిపిస్తుంది. 'సమయం అనుకూలం కానినాడు' మానవ యత్నం ఏం ప్రయోజనం. గురునకు మాత్రం 'సువర్ణమూర్తిత్వం' ఇకనేం? సర్వవిధాలా మేలు ఆదాయ వృద్ధి ఆరోగ్య వృద్ధి డిశంబరుదాకా శనికి శాంతి అవసరం ఆగస్టు నుండి ఒకటి రెండు నెలలు విశేషాదాయం వ్యాపార రూపంగా, వ్యవహార రూపంగా మేలున్నది నిర్మాతలకు లాభం, పంపిణీదారులకు మేలు ఉద్యోగమందు యిబ్బంది పడువారికి మేలే 'శుక్ర' గ్రహాశీస్సులున్నాయి కూడ. కళారంగాన మేలున్నది ఏమయినా ఆదాయం 2, వ్యయం 14, గ్రహించాలి

కుంభం : కుంభ రాశ్యాధిపతి 'శని' కుంభంలో 'శని' జనన కాలమందుండినా, బహు దుర్లభం లక్షాధిపత్యం అయిన నాల్గు నెలలపాటు లాభ స్థానాన తదుపరి వ్యయాన, మకరంలో, తన యింట ఉంటున్నందున మేలే ఆరోగ్య వృద్ధి, ఐశ్వర్య వృద్ధి, గృహ యోగం. సత్కారాదులు. గురుడు పంచమ షష్ఠములందు, శుక్ర, రవి, చంద్రు కలసి యోగం యివ్వనున్నారు. శుభం జరుగును వ్యాపార లాభం. వ్యవహార విజయం చిత్రరంగానుకూలత ధన వసతి. చంద్రునకు, శుక్రునకు మూర్తిత్వం విశేష శుభదాయకం, సెప్టెంబరు 2 తా నుండి అని గ్రహింతురు గాక! ఆదాయ వ్యయాలు సమం. ఆదాయం 14, వ్యయం 14

మీనం : ఈ వత్సరమంతా మీనరాశి వారు బహుధా ప్రశంసింపబడుతారు నిత్య కల్యాణ వైభవం, ధన లాభం, వృత్తి లాభం, కళ్యాణ వైభవాదులు, సభా గౌరవాదులు విద్యావేత్తల పరిచయాదులు దూర బంధు సమాగమం. యత్న కార్యసిద్ధి భూ లాభం, గృహలాభాదులు పత్రికా రంగానుకూలత. ఒక్క గురుడే చాలు మేలు చేయుటకు 'బృహస్పతి' పదిమంది పెట్టు డిశంబరు 14 నుండి 'శని' రజతమూర్తియై మేలు చేయును రాజకీయంగా విశేష ఫలదాయకుడగును వ్యాపారాన అధిక లాభం ఆశించవచ్చు సంవత్సరమంతా నిత్య కల్యాణ భాజకమే. 'ఆదాయం 11, వ్యయం 5' అని భావించవలె.

శుభం భూయాత్
స్వస్తి సర్వేషాం సమస్త
సన్మంగళాని భవంతు
శ్రీర్జయతు

—విద్వాన్‌కోట సత్యరంగయ్యశాస్త్రి



హాస్య నవలిక

ఇంటికి దీపం ఇల్లాలే!

— పి. కుసుమా రెడ్డి

(గత సంచిక తరువాయి)

మంచం మీద పడుకొని అదే పనిగా ఆలోచిస్తున్నాడు మురళి. అటో.. ఇటో తేల్చుకోవాలని పొద్దుట నుండి ఏకాంతం కోసం ఎదురుచూస్తున్నాడు. ఈ పెళ్లయ్యాక ఎక్కడికైనా సరదాగా ప్రోగ్రాం పెడితే, ఏరోజైనా రచన ముద్దుగా వచ్చిందా? లేదు. ఎప్పుడూ కాగితాలు... పుస్తకాలు. ఇవే ప్రపంచంగా మసులుతుంది కాని భర్త అనేవాడు ఉంటాడు వాడు మగవాడే కొన్ని కోరికలు ఉంటాయి అని ఏనాడైనా ఆలోచించిందా!

ఎప్పుడైనా కాస్త మూడ్ బావుండి,వంటి మీద చెయ్యివేస్తే చాలు సెన్సార్ వాళ్లు కత్తెరవేసినట్టు అత్తయ్య ఉన్నారు మావయ్యా ఉన్నారంటూ భయాన్ని సిగ్గునీ ఒలకబోస్తూ ఏవో సాకులు చెబుతుంది.

మొన్నటికి 'మొన్న సంసారాలు.. సఖ్యతలు' అంటూవ్యాసం వ్రాసింది. జనం మెచ్చుకున్నారు. పాఠకులు అభిమానంతో ఉత్తరాలు కురిపించారు. కాని తన సంసారంలో సఖ్యత గురించి ఆలోచించదు.

ఆలోచనాలోచనాలతో ఉన్న మురళిని 'ఏవండి' రీఫిల్ అయిపోయింది అంటూ పిల్చింది.

అసలే వేడిలో ఉన్న మురళి ఉడికిపోతూ 'నీకు బుద్ధుందా' అని అడిగాడు.

ఊహా ప్రపంచం నుండి తేరుకొని వచ్చింది రచన.

"ఏమైంది మీకు"

"ఏమీ కాలేదు. ఈవేళ నుండి సన్యాసం పుచ్చుకుందాం అనుకుంటున్నాను"

"ఏమిటి! మీరా! సన్యాసమూ! ఒక పూట భోజనంలో ఎప్పుడైనా కాస్త లోటు వస్తే కల్లుతాగిన కోతిలా గంతులు వేసి డాన్స్ కట్టే మీకు సన్యాసమా! అయినా ఇప్పుడు అంత అకస్మాత్తుగా నేను కాస్త సాహిత్యంలో ఎదుగుతున్నానని... నలుగురిలోనూ పేరు ప్రతిష్టలు తెచ్చుకుంటున్నానని మీ ఏడుపు. అయినా ఈరోజు ఏమిటనుకున్నారు. మంగళవారం. నాకు అచ్చివచ్చిన రోజు కాదు".

"అచ్చోగిచ్చో తెలియదు గాని, తెల్లవారి లేచిందగ్గరనుండి అందర్నీ చంపుతున్నావు. ముందుగా మా అమ్మని, నాన్నని, ఆడపిల్లలు లేరని...నిన్ను ఓ కూతురిగా భావించి వాళ్లు చూసుకుంటుంటే దాన్ని నువ్వు అలుసుగా తీసుకున్నావ్. ఆరోజు ఏంవండుతావో, ఎలా వుంటావో నాకు తెలియదు. అసలు అచ్చొచ్చిన రోజంటూ నీకు ఏదైనా వుందా? ముచ్చటగా; అప్యాయంగా ఏనాడైనా దగ్గరకి వచ్చావా?

ఎప్పుడూ నవ్వుతూ,నవ్విస్తూ వుండే మురళి కళ్లెర్ర చేసేసరికి ఉక్రోషంతో. ..టేబుల్ లైట్ గోడకేసి పగలగొట్టింది రచన.

మురళి మరి మాట్లాడలేదు. 'ఇచ్చిన డోస్ సరిపోతే సరేసరి లేకపోతే యింతే సంగతులు అనుకున్నాడు' మనసులోనే.

*   *   *   *   *

మధుకర్ పట్టుబట్టి హాస్పిటల్ కి తీసుకువెళ్లిన నాటి నుండీ మంగళ ఏదో పోగొట్టుకున్నట్టు ఉంటోంది.

మధుకర్ మాత్రం ఏమీ ఎరుగనట్టు, జరగనట్టు మామూలుగానే ఉంటున్నాడు.

భద్రకాళి మాత్రం తన మాట విననందుకు సణుగుతూనే ఉంది.

ఇవన్నీ మనసుకు అంటి పెట్టుకుని... పట్టించుకునే స్థితిలో మంగళలేదు. ఓ మధ్యాహ్నం భక్తి సినిమా వచ్చిందంటూ మేట్నీకి వెళ్లింది భద్రకాళి.

ఆ వెనుకాలే కొద్ది సేపటికి రచన వచ్చింది. రచన వచ్చింది అంటే కారణం లేకుండా రాదు భర్త కొట్టినా, మాట్లాడటం మానేసినా రచన రచనల ప్రవాహం ఆగలేదు.

ఆమె రచనలు వరుసగా ఈమధ్య 7, 8 పత్రికలలో అచ్చువేస్తున్నామని సమాచారాలు అందాయి. ఆమె ఆనందానికి అవధులు లేవు. మంగళతో మాట్లాడాక ఎన్ని అచ్చు అయ్యాయో బేరీజు వేసుకొంది ఒకసారి. ఫర్వాలేదు. బాగా పని చేసింది అందుకే మంగళ యింటికి వచ్చింది.

రచన వెళ్లేసరికి లోపల మంగళ కళ్ళు ఎర్రగా ఉబ్బి ఉన్నాయి.

"అదేవిటి, అలా వున్నారు?"

"ఏవీ లేదండి. కాస్త ఒంట్లో నలతగా ఉంది"

"నలత ఎందుకుండదు. మీ ఆయన అబార్షన్ చేయించారటగదా? అసలు మీరు ఈ పనికి ఎలా ఒప్పుకున్నారు? చదువుకున్నారు. మగజాతి అంతేనండి. స్త్రీని అనుక్షణం అణగద్రొక్కడానికి ప్రయత్నిస్తుంటారు. నేను మటుకు యిలాంటివి అంటే యిష్టపడనండి. అసలు రాజీ అనే ప్రసక్తి నా జీవితంలో లేదు. ఎందుకంటే ఒకసారి సర్దుబాటు ఎప్పుడు వస్తుందో...అప్పుడే అందరిలో ఎగబాటు కావలసి వస్తుంది. రెండు రోజులు కోపగించి ఆయనే పూరుకుందురు కదా! అంత తొందరగా ఎలా ఒప్పుకున్నారు?!"

'రచనకీ విషయం ఎలా తెలిసిందా....తెలిసినా కాస్తయినా మొహమాటం లేకుండా ఎలా అడిగిందా?'అని ఆశ్చర్యపడింది మంగళ.

"ఛ! అదేమిటి? మరీ యిలాబేలగా ఉండకూడదు. మగవాళ్ల సంగతి మీకు తెలియదు. గట్టిగా అయితే అన్నం తినరు. అంతమాత్రానా కొంపలు మునిగిపోవు. గంగలో దూకమన్నా దూకడం అవివేకం."

మెత్తమెత్తగా మందలిస్తూ, ఆప్యాయత రంగరించిన ఆమె మాటలకు పగిలినకుండలా భళ్లున ఏడ్చేసింది.

నెమ్మదిగా సర్దిచెప్పి రెండు మెతుకులు తినిపించింది. మొహం కడుక్కురమ్మని బాత్ రూమ్ లోకి పంపించింది. రెండు కప్పుల 'టీ' పెట్టి, ఆమె చేతికి బలవంతాన ఒకటి యిచ్చి తనొకటి అందుకుంది.

ఆడవాళ్లకి ఓదార్పు కొండంతబలం. మనసు గాయపడినప్పుడు సాటి స్త్రీల సానుభూతి టానిక్ లా పని చేస్తుంది. యిప్పుడు అదేస్థితిలో వుంది మంగళ.

అప్పటికే తను వచ్చి పావుగంట అవడంతో వెళతానని లేచింది రచన. రచన వెళ్లగానే బాత్రూములో ఉదయం నానబెట్టిన బట్టలు గుర్తుకొచ్చి, ఓపిక లేకపోయినా బ్రష్ చేయడం మొదలుపెట్టింది మంగళ.

ఫ్యాంట్ జేబులో ఏదో మెత్తగా చీటీలా కనబడగానే 'అయ్యయ్యో' అనుకుంటూ పైకి లాగింది.

అది మధుకర్‌ని ఉద్దేశించి వ్రాసిన ఉత్తరం. ఒకరి ఉత్తర చదవడం సంస్కారం కాకపోయినా, ఏమిటో చూడాలన్న ఆతృత -నలిగిపోయిన ఆమె మనస్సును జయించింది.

డియర్ బావా,

ఆరోజు మనిద్దరం పంచుకున్న తీపిగుర్తులు మర్చిపో లేక ఉత్తరం రాస్తున్నాను. అన్నట్టు అక్క అడగలేదా? అన్నిరోజులు ఎందుకుండిపోయారని. బావా! పెళ్లిచేసుకుంటానని, వెళ్లగానే ఉత్తరం రాస్తావని ఎన్నో కథలు చెప్పావు. మన పెళ్లికి అక్క ఒప్పుకుంటుందంటావా? ఒప్పుకున్నా, ఒప్పుకోకపోయినా నేను నీదాన్నే! కాదంటారా? ఉత్తరం అందిన వెంటనే నువ్వు రావాలి. నువ్వు చాలా పిరికి వాడివి బావా, అక్క తిడుతుందని కాలేజీకి రాయమన్నావు ఉత్తరం. ఏ మనిషికైనా తెగింపు ఉండాలి బావా, తెగింపు కావాలి. నీ రాకకోసం వేయికన్నులతో ఎదురుచూస్తుంటాను.

నీ ప్రియాతి ప్రియమైన

నచ్చలి.

ఉత్తరం చదివిన మంగళ శరీరం చెమటతో తడిసి ముద్దయింది. కళ్లుబైర్లు కమ్మాయి. అచేతనంగా అలా కూలబడిపోయింది.

'ఎంత మోసం! ఎంతదగా! ఒకే మనిషిలో రెండు వికృత రూపాలు! పెళ్లికి ముందు తీపి తీపి కబుర్లు చెప్పాడు.ఎన్నిమధురమైన కోరికల్ని రగిలించి ఊహల పల్లకీలో ఊరేగించాడు? ఆ మనిషి యింత మోసగాడా?'

నిజంగా తలుచుకుంటేనే జుగుప్స కలుగుతుంది.

పువ్వు పువ్వుకీ తిరిగే తుమ్మెద లాంటి వాడు మగాడు. తనతోటి పుష్పాని కంకితమైన తుమ్మెదను తను కూడా ఆహ్వానించడం పుష్పం తప్పకానీ-తుమ్మెదను నిందించి ఏం లాభం? కానీ మధుకర్ మాత్రం??

పుణ్యానికి వెళితే పాపం ఎదురయిందని, తన పుట్టింటివాళ్ల కష్ట సుఖాలు చూస్తానంటూ వెళ్లిన మధుకర్ ఇలా చెయ్యడం భావ్యమా?!

తన చెల్లెలే తన జీవితాన్ని కాల నాగులా కాటు వేస్తుందని ఊహించి వుంటే, తన జాగ్రత్తలో తను ఉండేది. ఇప్పుడు తనేం చెయ్యాలి? నా జీవితాన్ని ఎందుకు పాడు చేశావు? నా కాపురాన్ని నిలబెట్టు అని చెల్లెల్ని బ్రతిమాలడం అంత తెలివి తక్కువతనం మరొకటిలేదు.

చిన్నప్పుడు అక్కబట్టలు కురచ అయిపోయాయని తనను కట్టుకోమని తండ్రి దండించడం... తను అక్కవి కట్టుకోనని మొరాయించడం జరిగేది. మాసిపోయినా వేసుకోడానికి యిష్టపడేది కానీ అక్క బట్టలు వేసుకోడానికి సమ్మతించేది కాదు.

తల్లి మాత్రం తన ఆత్మాభిమానం అర్థం చేసికొని ఎక్కడో ఒకచోట అప్పు చేసి కొత్తవి కుట్టించేది. అలాంటిది తన వస్తువును మరొకరు ఎంగిలిపడ్డారని తెలిసికూడ ఊరుకోగలదా?

మధుకర్‌ని నిలదీసి అడిగితే?!

ఇంత నమ్మించినవాడు మరో మంచి క్లిక్ అయ్యే కథ అల్లడని నమ్మకం ఏమిటీ? ఆ కథ కూడా తనకి తెల్సు.

'వయసులో వుండి పెళ్లి పెటాకులు చెయ్యకుండా... ఉండమంటే వుంటుందా? మీదపడింది. అవకాశాన్ని వదులుకోలేకపోయాను' అంటే?- ఈ సంజాయిషీకి తన దగ్గర సమాధానం లేదు. అందుకే ఏం చేస్తే బావుంటుంది?

అంతంలేని ఆలోచనలు ఆమె మస్తిష్కంలో కదం తొక్కుతున్నాయి.

"ఏవిటోయ్! అలా ఏకాంతంలో కూర్చుని దీర్ఘాలోచనలో పడిపోయావ్? కొంప తీసి పక్కింటి రచనాదేవిగారిలా ఏదన్నా రాస్తున్నావేమిటి?!'

"................"

"ఏం, కోపమా, నీ మాట వినలేదని?



అయినా నువ్వే పసిపాపలా వుంటే వేరే చంటి పిల్లలు ఎందుకోయ్?"

ఆ సరసం ఒకప్పుడు మధురంగా వుండే దేమోకాని.... ఇప్పుడు జుగుప్స, అసహ్యం ఒక దాని వెంట ఒకటి కళ్లెం విప్పిన గుర్రంలా పరుగెత్తుతున్నాయి.

అంతే ఒక్కసారి అతన్నుండి, నాగుపామును చూసి జడిసినట్టు దూరంగా జరిగింది.

ఆమె నుండి సమాధానం రాలేదు. కాని వెంటనే చెప్పుతీసి కొట్టినట్టు విసురుగా ఉత్తరాన్ని అతనిమీదవేసి కొట్టింది.

"ఏమిటిది? "

"ఏవుంది. తమరు చేసిన ఘనకార్యానికి వారం రోజులలో వస్తే బహుమతి యిస్తుందట. తీసుకోడానికి వెళ్తారా?" ఆమె కంఠంలో వెటకారం, కోపం, ప్రతిధ్వనించాయి.

ఉత్తరం చదవమంటే చదవడానికి అతనేమీ వెర్రివాడు కాదు. ఎందుకంటే ఆ ఉత్తరాన్ని యింతకుముందే లక్షసార్లు చదివాడు. ఎదుటి మనిషి జీవితాన్ని క్షణంలో చదవగల నేర్పరి.

"నీకు నామీద అనుమానమా?"

"అబ్బే కాదు. అపర శ్రీరామచంద్రుడనే నమ్మకం మరింత ఎక్కువైంది. నా జీవితంతో ఎందుకిలా ఆడుకున్నారు? మన స్ఫూర్తిగా యిష్టపడి చేసుకొని ఈ రోజు అవకాశం వచ్చిందని మరో దోవ తొక్కారు. సున్నితమైన నా మనసుమీద దెబ్బ తీశారు. జీవితంలో దేన్ని అయినా సహిస్తాను కానీ మోసాన్ని సహించలేను. నాకు ఎంగిలి వస్తువులంటే అసహ్యం."

"అయితే ఏంచేస్తానంటావు యిప్పుడు?"

"నేను ఏం చేస్తానన్నది మీకు అనవసరం. మీరు చేసిన పని ఏమిటని అడుగుతున్నాను."

ఇంటికి శాపం ఇల్లాలే!

"ఏమిటి పెద్ద ప్రమాదం. ఏదో ముంచుకుపోయినట్టు ఏడుస్తావు? ఆ అమ్మాయి నన్ను కావాలనుకొంది. నేను యిష్టపడ్డానంతే!"

"అంటే మిమ్మల్ని యిష్టపడిన వాళ్లందరికి మీరు యిష్టం అవడానికి సిద్ధపడతారన్నమాట."

"సిద్ధపడటానికి ఏం ఉంది? కొత్త రుచులు కోరుకోవడం మనిషి నైజం. నేను అలాగే బలహీనపడ్డాను."

"బలహీనపడ్డం తేలికేనండి. కాని దానికి కడుపో...కాలో వస్తే చేరదీయడానికి మీరు సిద్ధపడుతున్నారా?"

"..............."

"ఏం మాట్లాడరు. హు....భార్యనే తల్లి కాకూడదని .... ఆనందాలు కరువు అవుతాయని అంటే నిజమనుకున్నాను. కాని ఈ ఆనందం అని తెలిస్తే, గొడ్డుమోతులా కాకుండా, కనీసం ఓ బిడ్డకి జన్మనిచ్చి ఉండేదాన్ని. అన్నట్టు నాదగ్గర వద్దనుకున్న ఆనందం అక్కడ దొరుకుతుందిలెండి."

"వ్యంగ్యం....కసి కలగలిపిన గొంతుతో అంది మంగళ."

"మధుకర్ మౌనం ఆమె గుండెల్ని కుదిపేసింది."

మధుకర్ ఎదురుచూడని పరిణామం అది. అందుకే కొత్త ఆలోచనలకి పునాది వేస్తున్నాడు.

** ** ** ** ** **

మరుసటి రోజు ఉదయం మధుకర్ లేచే సరికి మంగళ కనబడలేదు కాని ఒక ఉత్తరం కనిపించింది.

మిస్టర్ మధుకర్,

మీరు చేసిన మోసం నేను మర్చిపోలేను. అలాగని కలిసి బ్రతకడం నావల్ల కాదు. మంచికో...చెడ్డకో మీరు నానుండి, నాలో ఊపిరి పోసుకుంటున్న మీ ప్రతిరూపాన్ని మీ అంతట మీరే తొలగించారు. ధన్యవాదాలు. అందని వాటికి పరుగులు పెట్టడం...చేజారిన వస్తువును ఇంకో మనిషి దొంగిలిస్తే, తిరిగి పుచ్చుకొనే తత్వం నాది కాదు. పువ్వుల వెంట పరిగెత్తి వాటి మకరందాన్ని జుర్రుకోవడం తుమ్మెదకు సహజలక్షణమే అయినా కనిపించిన ప్రతి పువ్వు తన కోసమే చూస్తుందని అనుకోవడం పొరపాటు. శరీరానికి గాయమయితే మచ్చ మిగులుతుంది. మనసుకి గాయం తగిలితే మందులేదు. అందుకే చావడం పిరికితనమే అయినా దానినే ఆశ్రయించక తప్పడం లేదు.

ఉత్తరం చదివిన మధుకర్ మొహంలో నెత్తురుచుక్క లేదు. విషయం తల్లికి చెప్పాడు మధుకర్.

అసలు విషయం విన్న భద్రకాళి నిప్పుమీద పడ్డ కోతిలా ఎగిరిపడింది.

17

తెల్లని మోకాళ్లుదాటని స్కర్టు...ఆపైన జాకెట్టుతో శీర్షాసనం వేస్తున్న భార్యని....వేయిస్తున్న కోడలిని చూసేసరికి బి.పి. పెరిగిపోయింది లక్ష్మణరావుకి.

"ఏమేవ్. నీకు వంటిమీద స్పృహ ఉందా లేక...."

"స్పృహకేం? నిక్షేపంలా ఉంది. అసలు ఏమిటి మీ ఉద్దేశ్యం? ఏదో వళ్లు తగ్గడానికి ఎక్సర్‌సైజు చేస్తున్నాను. అదేదో పెద్ద నేరం అయినట్టు మిడిగుడ్లు వేసుకొని ఆ చూపేమిటి?"

"ఆ...నువ్వు లేవూ, చెవులపిల్లి మొహం వేసుకొని. అయినా ఎలిమెంటరీ స్కూల్లో చిన్నపిల్లలు వేసుకున్నట్టు ఆ డ్రస్సేమిటి?"

"ఆ! మరే పాపం. బీచ్ దగ్గర గుండీలు తీయడానికి వెళ్లినప్పుడు ఆ ఇంగ్లీషు పిల్లవరో డ్రాయరు....బాడీ తొడుక్కొని ఈదటానికి వెళుతుంటే, మీరు అదే పనిగా చూస్తూ దాన్ని పొగిడేవారు కాదేమిటి?"

"నీ అనుమానం అంటించా. నీకు ఇంగ్లీషు రాదనుకొని బుద్ధి చెడి ఏదో అన్నాను. ఇప్పుడు అనమంటే అంటావేమిటి?"

లక్ష్మణరావు రుసరుసలాడుతూ వుంటే సుబ్బలక్ష్మి శవాసనం కూడా పూర్తి చేసింది.

అక్కడే కూర్చుని వీళ్లిద్దరి సంభాషణ తిలకిస్తున్న రచన ముసిముసిగా నవ్వుతూ, అత్తగార్కి ఫ్లాస్కు తెరచి పొగలు కక్కుతున్న కాఫీ అందించింది.

"రేఖా సెంచరీ!"

సుప్రసిద్ధ హిందీ సినీ నటి రేఖ బొంబాయికి చెందిన ఒక ప్రముఖ పారిశ్రామికవేత్తను వివాహం చేసుకొన్న విషయం పాఠకులకు విదితమే. రేఖ వివాహం విషయమై ఆమె తండ్రి అయిన ప్రముఖ నటుడు జెమినీగణేశన్‌ను వ్యాఖ్యానించమని పత్రికలవారు కోరినప్పుడు "రేఖకు బహుశా ఇది నూరవపెళ్లి కావచ్చుననుకుంటా. రేఖ పెళ్లి చేసుకున్న సమాచారం స్పష్టంగా నాకు తెలియదు. పత్రికల్లో ఆ వార్త పడటంవల్ల ఆ వార్తను చూసి తెలుసుకున్నాను. అసలు ఈ వివాహ వార్త నిజమా, అబద్ధమా అనేది కూడా నాకు తెలియదు. ఇలాంటి వివాహాలు దేవునికి కూడా చెప్పకుండా జరుగుతూ ఉంటాయి. పైగా హనీమూన్‌కి రేఖ లండన్‌కి వెళ్లవలసిన పనిలేదనుకుంటా!" అంటూ ఒక చమత్కారాన్ని విసిరాడు రేఖ తండ్రి తమిళ నటుడు జెమినీగణేశన్. అతనికి కాదల్ మన్నన్ అన్న బిరుదు వుంది తార సావిత్రికి భర్త

—శాంతి

తనకి కాఫీ యిస్తే తన రచనలు అచ్చి రాదంటూ తనకి కాఫీ మానేసి...భార్యకి యివ్వడం చూసిన లక్ష్మణరావుకి అనిపించింది. చిన్నపిల్లలచేత తమ పబ్బం గడుపుకోవడానికి బెల్లం ముక్కో, చెకోడీలో ఎర చూపి తమ పనులు అతి చాకచక్యంగా చేయించుకొనే కొంతమంది పెద్దలు గుర్తుకు వచ్చారు.

అయితే యిక్కడ చిన్న తేడా ఉంది. తన సెంటిమెంట్స్‌ని అడ్డుపెట్టుకుని అత్తగార్ని ఒక సాధనంగా చేసుకొన్న రచన వయస్సు 25 ఏళ్లు...సుబ్బలక్ష్మి వయసు 58 ఏళ్లు.

18

"అమ్మో! అమ్మో! ఎంత పని జరిగిందే నాకోడలా! ఏదో పుట్టింటిమీద దృష్టి మళ్లిందంటే రాత్రికి రాత్రే పంపింటాం. కాని నీకు ఏక్సిడెంట్ జరుగుతుందని కలలో కూడా ఊహించలేదే కోడలా.... నీ చావు వార్త విని నేను తట్టుకోలేకపోతున్నానే కోడలా" అంటూ శోకాలు తీస్తున్న భద్రకాళి ఏడ్పులకి జనం పోగయ్యారు.

"ఏవయిందండి? ఆరుగంటల వరకూ మంగళగారు యింట్లోనే ఉన్నారు కదా! అసలు ఇంటికి ఎప్పుడు వెళ్లారు?" ఆరా తీస్తున్న రచనకి కళ్లల్లో నీళ్లు రాకపోయినా, ముక్కుచీదేస్తూ చెప్పింది భద్రకాళి.

"రాత్రికి రాత్రే వాళ్ల చెల్లెలకు జ్వరంగా ఉందని మావాడు మామూలుగా చెప్పాడు. ఇహ చూస్తే కాని వీలులేదని మంకుపట్టు పట్టింది. అబ్బాయి వెళ్లి బస్సులో దిగబెట్టి వచ్చాడు. తెల్లారేలోగా ఈ టెలిగ్రాం వచ్చింది."

"అలాగా బాధపడకండి. కష్టం వచ్చినప్పుడు గుండె దిటవు చేసుకోవాలి." సుబ్బలక్ష్మి ఓదార్పు.

"మీ అబ్బాయి ఎక్కడండీ?"

"పెళ్లాం చావు కబురు వినగానే మతిపోయినట్టు అయిపోయి అత్తవారింటికి వెళ్లాడండీ! అలసట వచ్చినట్టు కాసేపటికి ఏడ్పు ఆపేసి జనానికి కోడలు బ్రతికిఉండగా జరిగిన ముచ్చట్లు చెప్పడం ప్రారంభించింది."

ఇలాంటి విషయాల్లో భద్రకాళిలాంటి ఆడవాళ్లకి మంచి నేర్పరితనం ఉంటుంది. జనం సానుభూతి....కేష్ చేసుకోవాలని ప్రయత్నిస్తారు కానీ......అవేమీ ఫలించలేదు.

** ** ** ** ** **

"ఏవండోయ్. ఈవిషయం విన్నారా?"

"ఏ విషయం?"

"అదేనండి. కోడలి నవలకి సెకండ్ ప్రైజ్ వచ్చిందట".

అయితే మళ్లీ ఏ దేవుడికో నాచేత బస్కీలుతీయించాలని మొక్కుకొని ఉంటుంది."



ఆనందాంబుధి

వసంత ఋతువు ఆగమనం
వధూవరుల గుండెలలో ఆనందం
వినిపించెను కోకిల మధురగానం
వనమంతా ప్రతిధ్వనించెను ప్రణయ రాగం!
తాత్కాలిక ఆకర్షణ కారాదు ప్రేమంటే
తనువుల కలయికే కాదు ప్రణయమంటే
తరుణి అధరామృత స్వాదనే కాదు ప్రేమంటే
తనివి తీరని కామోత్కృష్టతే కాదు ప్రణయమంటే
ప్రియురాలి కౌగిలిలో పెన్నిధి
పవిత్ర ప్రేమకది కావాలి పునాది
పడతి కోరేది సదా ప్రియుని సన్నిధి
పది జన్మలకది కావాలి ఆనందాంబుధి!

-ఎ.వి.జి.యస్. మూర్తి

"ఛ. అదికాదండీ! మీకో జత మంచిబట్టలు తీయించిందండి, నాకో జత దుద్దులు కొంది."

"ఏ బట్టలు తీసినా నేను మాత్రం కట్టుకోలేను. ఎందుకంటే నీకు తీసింది కదా! ఆసనాల డ్రెస్సే....యిద్దరూ మేచ్‌గా ఉండాలనీ నాకు కూడా తీసి వుంటుంది."

"మీరు కోడల్ని అలా తీసి పడేయకండి. ఒక మంచి పనిచేసిందండీ కోడలు."

"ఏమిటో రచనావ్యామోహానికి గుడ్‌బై చెప్పిందా. లేక మనువడికో, మనువరాలికో గ్రీన్ సిగ్నల్ యిచ్చిందా?"

"అదేమీ కాదు. కాని....మీరు అయ్యప్పస్వామి దీక్ష తీసుకుంటారని రేపు తీసుకొస్తానని స్వామికి మాట యిచ్చిందట. రేపు మీకు స్వామి మాలలే యిస్తారట."

"నావల్లకాదు. నేను తీసుకోను." నిక్కచ్చిగా చెప్పాడు లక్ష్మణరావు.

"అక్కడ స్వామిదగ్గర మాట యిచ్చింది. యిప్పుడు మాట తప్పితే బావుండదు. దీనికి ఉపవాసాలేవీ ఉండనవసరం లేదు. ఒక పూట తినాలి. చాపమీద పడుకోవాలి. చెప్పాలు........"

ఆమె మాట పూర్తికాలేదు. కాని లక్ష్మణరావు కొరుకుడుపడలేదు. మర్నాడు లక్ష్మణరావు మామూలుగా ఉన్నాడు. రచన మాత్రం భోజనం చేయలేదు. సుబ్బలక్ష్మి లక్ష్మణరావును సణుగుతూనే ఉంది. ఏమీ పట్టించుకోలేదు.

కాని ఆ మధ్యాహ్నం రచనది ఓ ఆర్టికల్ ఒకటి తిరిగిరావడంతో యింట్లో చిటపటలు ప్రారంభం అయ్యాయి.

నాలుగురోజులు నిరాహారదీక్ష ఏకధాటిగా చేసి తన పంతం నెగ్గించుకొంది రచన. లక్ష్మణరావు దీక్ష తీసుకోక తప్పలేదు.

రచన మళ్లీ కొత్త నవల మొదలుపెట్టింది. పేరు 'కలంలో కాలనాగులు'.

ఒంటిపూట భోజనం మాట ఎలా ఉన్నా, కిందపడుకోవడం పెద్ద నరకంలా ఉంది లక్ష్మణరావుకి. పైగా భార్య కోడలికి సపోర్టు పలకడంతో గోరుచుట్టుమీద రోకలి పోటులా ఉంది. ఏం చేయాలి... ఈ పిచ్చికి విరుగుడేమిటా అని ఆలోచిస్తూ ఉండిపోయాడు లక్ష్మణరావు.

** ** ** ** ** **

"అత్తయ్యా! ఈ విషయం మీకు తెలుసా?"

"ఏమిటమ్మా!"

"మంగళ ఏక్సిడెంట్ కాలేదు. అదంతా భద్రకాళిగారి కల్పన. మంగళ చెల్లెలుని ప్రేమించాడట మధుకర్. అందుకే

మంగళ..."

"ఊ....మంగళ."

"ఆత్మహత్య చేసుకొంది."

"ఆత్మహత్య చేసుకొందని నీకు ఎవరు చెప్పారు?"

"మీ అబ్బాయికి మధుకర్‌కి బాగా కావాల్సిన వాళ్లు చెప్పారట. పెళ్లాం చచ్చిపోయిందని ...ఆరోజు వెళ్లాడని భద్రకాళిగారు చెప్పారు కదా! అది నిజం కాదట. తల్లీ కొడుకులు ఆడిన కట్టుకథ అట."

"వీడి మొహం మండ. తలవొంచుకొని నడుస్తుంటే ఎంతో బుద్ధిమంతుడనుకున్నాను. ఇంత దౌర్భాగ్యుడా? పాపం ఆ పిల్ల చాలా నెమ్మదస్తురాలు. ఆ రాక్షసి ఎంత ఏడ్పించినా నోరెత్తి మాట్లాడి ఎరుగుదు."

"అయినా ఆ చెల్లెలకు సిగ్గుందా? అక్కను చంపి అస్థానంలో తను పెళ్లికూతురిగా కూర్చోవడానికి సిద్ధపడిందంటే స్త్రీకి స్త్రీయే శత్రువు అనిపిస్తుంది."

"పోస్ట్" అన్న కేకతో యిద్దరి నోళ్లూ మూతపడ్డాయి.

"ఆ కవరు ఏమిటమ్మా?"

కవరు చూస్తూనే రచన మొహం నల్లగా మాడిపోయింది.

కవరు తిరిగి వచ్చిందో....లేక మరేమిటో తెలియదు. కాని రచన ఉన్నట్టుండి దబ్బున పడిపోవడంతో సుబ్బలక్ష్మి కంగారుపడి భర్తని పిల్చింది.

"ఏమిటే ఏమైంది" అంటూ వచ్చాడు కాని పక్కనపడి ఉన్నకవరు... ఈ పడిపోవడం చూసేసరికి విషయం అర్థమయింది లక్ష్మణరావుకి.

వెంటనే కవరు విప్పి చూశాడు లక్ష్మణరావు.

రచయిత్రి రచనా దేవిగార్కి నమస్కారం.

నేను మీ అభిమానిని. ఇంకా చెప్పాలంటే మీ పక్కింటి మధుకర్‌గారి భార్య మంగళకి వరుసకి చుట్టాన్ని ఆమె ఈ మధ్యే డ్రైన్‌లోనుండి గోదావరిలోపడి మరణించిన విషయం మీకు తెలుసనుకుంటాను. ఆమె చెల్లెల్ని మధుకర్ ప్రేమించడమే. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే ఇలాంటి సంఘటనతో మీరు మరో నవల వ్రాసుకోవచ్చని. అసలు విషయం ఏమిటంటే, మూడురోజుల క్రితం మీకు నవలల పోటీలో రెండవ బహుమతి వచ్చినట్టు టెలిగ్రాం యిచ్చింది నేనే. ఇలా ఎందుకిచ్చాను అని మీరు అనుకోవచ్చు. మీరు సెంటిమెంట్స్‌తో మీయింట్లో వాళ్ళని తెగ విసిగిస్తారట కదా! ఆ విషయం కూడా తెలిసిన మీ బారినపడ్డ మిత్రులొకరు చెప్పారు. సస్పెన్సులలో మా పాఠక మహాశయులని చంపుతారు ఎప్పుడు మీ రచయిత(త్రు)లు. అందుకే మిమ్మల్ని బోల్తా

ఇంతకీ శాపం ఇల్లాలే!

కొట్టించాలని ప్రయత్నం చేశాను. బహుశా ఫలించి ఉండకపోవచ్చు. ఎంతయినా మీరు రచయిత్రికదా, చనువు తీసుకొని నొప్పించినందుకు అన్యథా భావించకండి.

ఇట్లు
ఓ పాఠక మహాశయుడు.

ఉత్తరం చదివిన లక్ష్మణరావు మనసు ఆనందంతో నిండిపోయింది.

"ఏమిటి అలా బెల్లంకొట్టిన రాయిలా నిలబడ్డారు? పిల్లకోషవచ్చి పడిపోయింది. డాక్టర్‌ని తీసుకురండి."

డాక్టరు... ప్లీడరు ఏమీ అవసరం లేదు. నువ్వు కంగారుపడి నన్ను కంగారు పెట్టకు.

"మీది మనసుకాదు. బండరాయి"

"పోనీ. అలాగే అనుకో! దీక్షవద్దు మొర్రో అంటే విన్నావా! బలవంతాన నాకు ఈ శిక్ష వేశారు. బయటకు వెళ్ళాలంటే జోళ్ళు వేసుకోవడానికి కుదరదు. అవి లేక పోతే నేను నడవలేను."

"ఇంతకీ అమ్మాయి ఇలా ఎందుకు పడిపోయిందంటారు."

"ఎందుకు పడి పోయిందని నీ అనుమానం"

"ఏదన్నా కవరు తిరిగి వచ్చిందంటారా"

"ఎవడో పాఠక మహాశయుడు మీకోడలి నెత్తిమీద మొట్టకుండా... బొప్పి కట్టించాడు."

"అంటే..."

"ఏవుంది మొన్నటి బహుమతి నిజంకాదట. ఎవరో కోడలి మనస్తత్వాన్ని పరీక్షించాలని పత్రికనుంచి యిచ్చినట్టుగా దొంగ టెలిగ్రాం యిచ్చాడట..."

మదర్

లోకాలన్నీ
చీకటులైనా సరే
అమ్మతోడుగా నుండే
కమ్మని బ్రతుకు చాలు!
దరిద్రమెంత
సముద్రమైనా సరే
అమ్మ నీడన పండే
జన్మధన్యము చాలు!
చుక్కల తీరు
లెక్కలేని వారెందరున్నా సరే
చక్కని 'మదర్'
ఒక్కరుంటే చాలు!

-స్నేహశాంతి

లక్ష్మణరావు మాటలు పూర్తి కాకుండానే రచన నిస్త్రాణగా మూలిగింది.

"కాస్త వేడిగా 'టీ'యో... పాలో చూసియివ్వవే"

లక్ష్మణరావు సూచన మేరకు వంటింటివైపు పరిగెత్తింది సుబ్బలక్ష్మి.

* * * * * * * * * * * * *

మానస నర్సింగ్‌హోమ్‌లో ఒక స్పెషల్ రూమ్‌లో బెడ్‌మీద అసహనంగా పడుకున్న భద్రకాళి పక్కగదిలోంచి విన్పిస్తున్న మూలుగులకి అదిరిపడింది. డెలివరీ కేసేమోనన్న అనుమానం వచ్చి సిస్టర్‌ని అడిగింది.

సిస్టర్ చెప్పినవార్త విని నిర్ఘాంతపోయింది భద్రకాళి- పాతికేళ్ళ అమ్మాయిని ఒళ్ళుకాలితే హాస్పిటల్లో చేర్చారట!

ఇదేదో వరకట్నం కేసే అయి ఉంటుంది అనుకుంటూ భద్రకాళిలేని ఓపిక తెచ్చుకొని నాలుగడగులు వేసి పక్కగదిలోకి చూసింది.

అక్కడి దృశ్యాన్ని చూసి భద్రకాళి ప్రాన్నపడిపోయింది.

ఆవళ్ళు కాలిన అమ్మాయి ఎవరోకాదు. రచన. పక్కనే మురళి సుబ్బలక్ష్మి కూర్చుని పరిచరియలు చేస్తున్నారు.

అడుగులు చప్పుడు విని తలెత్తి చూసిన మురళి.

"మీ రెప్పుడొచ్చారు"అని పలకరించాడు.

"రెండు రోజులయింది బాబూ! చేసుకున్న దానికి చేసుకున్నంత మహాదేవ అని చచ్చి ఏలోకాన ఉందో నా కోడలిని షేను పెట్టిన ఉసురు నాకు తగిలింది. కొత్త కోడలు నా బెదిరింపులని లెఖ్ఖచేయక నన్ను హాస్పిటల్ పాలు చేసింది బాబూ" అంటూ చీర చెంగుతో కళ్ళొత్తుకొంది.


"ఊరుకోండి పిన్నిగారూ! రాతని ఎవరూ తప్పించ లేరనుకోండి మా రచన దేవుడి దగ్గర తన రచనలుపెట్టి హారతి యిస్తుంటే చీరంటుకొని యిలా గాయాలతో బాధపడుతోంది. మన చేతుల్లో ఏం ఉంది చెప్పండి."

"అయ్యో! అలాగా బాబూ! యింకా ఈ ప్రమాదం ఎందుకు జరిగిందో ననుకున్నాను" అని భద్రకాళి సానుభూతి చూపిస్తుండగానే రచన కళ్ళు తెరచి భర్త రెండు చేతులు తన చేతుల్లోకి తీసుకొంది.

"క్షమించండి. నా సెంటిమెంట్లతో మిమ్మల్ని బాధ పెట్టడమే కాకుండా ఈగతి తెచ్చుకున్నాను. యింటిని చక్కదిద్దుకొన్న యిల్లాలు యింటికి దీపం అయితే బాధ్యత మరిచిన యిల్లాళ్ళు నిజంగా శాపమే కదండీ. నేను...." ఆమెను మరి మాట్లాడ నివ్వలేదు మురళి.

(అయిపోయింది)

టి. ఎల్. కాంతారావు అకాల మృతి



సుప్రసిద్ధ విమర్శకుడు, విజయవాడ సిద్ధార్థ కాలేజీ తెలుగు అధ్యాపకుడు శ్రీ తలగడదీవి కాంతారావు (48) రెండు మాసాల అస్వస్థత తరువాత హైదరాబాద్ నుంచి విజయవాడ కారులో తిరిగివస్తూ మార్గం మధ్యలోనే అంతిమశ్వాస వదిలారు– ఆంధ్ర సచిత్ర వారపత్రికలో 'కొత్త గొంతులు' అన్న శీర్షికను చక్కగా నిర్వహించిన శ్రీ టి. ఎల్. కాంతారావు వివిధ వ్యాసాల ద్వారా మా పాఠకులకు సుపరిచితులు. ఆధునిక కవిత్వం మీద మంచి అవగాహనతో అనేక విమర్శలు, గ్రంథ సమీక్షలు చేసిన శ్రీ కాంతారావు 'సాహిత్యోపనిషత్' సాహిత్య హింసావలోకనం అనే వ్యాస సంపుటాలను ప్రకటించారు. మంచి వక్త – సాహితీ లోకంలో ఎందరికో సన్నిహితుడు అయిన శ్రీ కాంతారావును కోల్పోయి దుఃఖసాగరంలో మునిగివున్న శ్రీమతి కాంతారావుకి వారి ముగ్గురు సంతానానికి మా ప్రగాఢ సానుభూతిని అందిస్తున్నాము. సాహితీ లోకానికి ఎంతగానో సేవ చేయవలసి వున్న శ్రీ కాంతారావు అకాల మృతి సాహితీలోకానికి తీరని లోటు.

–ఎడిటర్

సర్వాంగ సుందరం!

చల్లా సుబ్రహ్మణ్యంగారి 'లవ్‌గేమ్' మా హృదయాలతో గేమ్ ఆడుతోంది. ఇంకా పాఠకుల శీర్షికలు కూడా బాగుంటున్నాయి. ముఖ చిత్రాలంకరణ విషయంలో తీసుకుంటున్న శ్రద్ధ అమోఘం. ఆంధ్ర సచిత్ర వారపత్రికలో కథలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్టు కనబడుతుంది. కథలు చాలా బాగుంటున్నాయి. "యువతా! కవితా!!" శీర్షికలోని కవితలు యువ హృదయాలను తట్టి లేపుతున్నాయి.

ఆంధ్ర సచిత్ర వారపత్రికను మీ(మా) అందరి కోసం మరింత సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతారని ఆశిస్తున్నాం. ఇంత మంచి పత్రిక నందిస్తున్న ఎడిటర్‌గారికి, సంపాదకవర్గానికి మా కృతజ్ఞతలు!

–వశిష్ఠ, టి. అప్పారావు (తుని)

మనసులో మాట

23-2-1990 ఆంధ్ర సచిత్ర వారపత్రికలో పార్టీ నిరంకుశత్వానికి ఆఖరి ఘడియలు సోవియెట్ యూనియన్ గురించి సంపాదకీయంలో కుండబద్దలు కొట్టినట్టు రాశారు. ఆంధ్ర సచిత్ర వారపత్రికలో ఇటీవలే సంపాదకీయాలు విజ్ఞానదాయకంగా ఉంటున్నాయి. సంపాదకీయాలు చదవాలంటే ఆంధ్ర సచిత్ర వారపత్రికలోనే చదవాలనే ఇంటరెస్టు, ఆసక్తి మాలో కలుగుతున్నది.

రామజన్మభూమి పేరుతో పార్లమెంట్ ఎన్నికలు ముందు వివాదం ఆధారంగా ఒక రాజకీయ పార్టీ తంతే బూర్లగంపలో పడ్డట్టు ఒక్కసారిగా 88 పార్లమెంట్ సీట్లు చేజిక్కించుకొని ఫ్రంట్ గవర్నమెంటు పలక తన చేతిలో పట్టుకొని కూర్చుంది అని నిజాన్ని నిర్భయంగా 'తాజా కాలమ్' ద్వారా వీరాజీగారు రామజన్మభూమి రహస్యాన్ని

పోస్ట్ బాక్స్

(4 వ పేజీ తరువాయి)

చాలా చక్కగా రాశారు. 'తాజాకాలమ్' కోసం ప్రతీవారం ఎదురుచూస్తుంటాను. పత్రిక రాగానే ముందుగా 'తాజాకాలమ్' చదివితీరవలసిందే నేను. పత్రికలో చాలా కొత్త మార్పులు తీసుకొనివచ్చారు. పత్రికస్థాయిని పెంచారు. లక్షలాది పాఠకుల హృదయాలను దోచుకునే విధంగా మంచి మంచి శీర్షికలు ప్రవేశపెట్టారు. కథల విషయంలో శ్రద్ధ చూపుతున్నారు. ఈనా ఉత్తరాన్ని ప్రచురిస్తారనే ఉద్దేశంతో రాసిన మాటలు కావు ఇవి. పత్రికలో వచ్చిన సరికొత్త మార్పునుబట్టి ఒక నిజాన్ని నిర్భయంగా బయట పెట్టాలనే తలంపుతో మనసులోని మాటలను ఈ ఉత్తరం ద్వారా వెలిబుచ్చుకున్నాను.

మూత్రపిండాల మార్పిడి గురించి చాలా విషయాలు తెలియజేసారు. ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఒక మంచి సబ్జెక్ట్‌పై ఇంటర్వ్యూ ప్రచురించారు. మూత్రపిండాల వ్యాధి గలవారికి ఈ ఇంటర్వ్యూ చదివితే చాలా విషయాలు క్షుణ్ణంగా తెలుసుకో గలుగుతారు. 'టున్ టున్' గురించి చాలా విషయాలు సుంకర భాస్కరరావు సేకరణ వ్యాసం ద్వారా తెలియబర్చారు. క్రీడాకారుల ముఖచిత్రాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వండి.

–న్యాయపతి రమేష్‌బాబు, హైదరాబాదు

దెయ్యం కథ

'ఎవరు దెయ్యం' కథను ఇ. టి రామారావుగారు ఆసక్తికరంగానే వ్రాసారు.

–అభిలాష్, విరాజి, కిన్నెర (ద్రాక్షారామ)

ధన్యవాదాలు

హలో డాక్టర్ నేనేమి చేయాలి శీర్షిక ద్వారా డాక్టర్ రవీంద్ర బాబు గారి సలహాలు పత్రిక పాఠకులందరికి దైవ ప్రసాదంలా పని చేస్తున్నాయి. వారికి మా ధన్యవాదాలు.

– గట్టు గంగారాం, ఔరంగబాద్

డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్! డ్రగ్స్



బల్విందర్ సింగ్

సియోల్ ఒలింపిక్స్‌లో కెనడా ఎథిలెట్ బెన్ జాన్సన్ 100 మీటర్ల పరుగులో అద్భుతముగా పరుగెత్తి ప్రపంచ క్రీడారంగంలో సంచలనం సృష్టించిన కొన్ని గంటల్లో అతను మాదక ద్రవ్యాల ప్రభావమువలన పరుగుపోటీలో అద్భుతముగా పరగెత్తగలిగాడని తెలుసుకున్న ప్రపంచం ఔరా! అన్నది.

కొద్ది రోజుల క్రితం ఆక్‌లాండ్‌లో జరిగిన కామన్వెల్త్ క్రీడల్లో భారత క్రీడాకారులు ప్రతిభ చూపుట అందిరికి ఆశ్చర్యము కలిగించినది. అందులో ముఖ్యముగా మనం వెయిట్ లిఫ్టింగ్‌లో సాధించుచున్న పతకాలు యావద్భారతము కొనియాడినది. మన వెయిట్ లిఫ్టర్ సుబ్రతొపాల్ మాదక ద్రవ్యాలు ఉపయోగించినట్లు ప్రత్యేక పరీక్షలో నిర్ధారణ అగుటతో అతను బంగారు పతకం కోల్పోవటమేగాక భారతదేశం ఆశ్చర్యములో మునిగినది. మనం కూడా మాదక ద్రవ్యాలు ఉపయోగిస్తున్నాము అని తెలుసుకున్న మన జాతి యిది నమ్మలేని నిజంగా, అవమానంగా భావించింది.

కోచ్‌ల ప్రోత్సాహం

మన దేశంలో మాదకద్రవ్యాలు క్రీడాకారులు ఉపయోగించుట, విదేశీ, 'కోచ్'లు మన జట్లకు శిక్షణ ఇచ్చుట ప్రారంభమయినప్పటి నుండి మొదలు అయినది. నేడు , మన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ పోటీలలో సహితం మాదక ద్రవ్యాలు ఉపయోగించి అద్భుతాలు, నూతన రికార్డులు సృష్టించుచున్నారు. పతకాలు సాధించుటకు అడ్డదారులు వెతుకుచున్న మన క్రీడాకారులు, కోచ్‌లు మాదక ద్రవ్యాలు ఉపయోగించటాన్ని యువ క్రీడాకారులలో పోత్సహించారు.

గత ముప్పై ఏళ్లుగా మన క్రీడాకారులు మాదక ద్రవ్యాలకు అలవాటు పడినట్లుగా అనుమానముయున్నది. మన దేశంలో ఇందుకై ప్రత్యేక వైద్య పరీక్షా కేంద్రాలు లేకపోవుట, మన క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో విజయాలు సాధించుట అంతగా లేకపోవుటచే బయటపడలేదు. కామన్వెల్తు గేమ్స్‌లో మనం సాధించిన విజయాలు మన గుట్టును బహిరంగపరిచాయి.

1968 మెక్సికో ఒలింపిక్స్‌కై మన దేశ అథెలెట్ జట్టు ఎంపిక సమయంలో దూరపు పరుగువీరుడు క్రిపాల్‌సింగ్ 10,000 మీటర్ల పరుగు సెలక్షన్‌లో అద్భుతముగా పరుగెత్తి ప్రపంచ రికార్డుకు దగ్గరగా వెళ్లాడు. ఆరోజు ఢిల్లీ నేషనల్ స్టేడియంలో జరిగిన ఎంపికలో పాల్గొన్న వారు అందరు క్రిపాల్‌సింగ్ ప్రతిభను చూచి ఆశ్చర్యపోయారు. కాని కొద్దిసేపులోనే క్రిపాల్ ప్రవర్తనపై అందరికి వింతగా అనిపించినది. స్టేడియంలో 'సీటింగ్ ట్రయర్స్'పై అతని ప్రవర్తన, అందరిని తిట్టుట, త్రాగినవాడు మైకంలో ప్రవర్తించినట్లు చేయుట, అతనినోటి నుండి నురగ వచ్చుట మాదక ద్రవ్యాల 'పిల్స్' ఉపయోగించి దాని ప్రభావమువలన అద్భుత ప్రతిభ చూపినట్లు నిర్ధారణ అయినది. మూడు సంవత్సరాలు క్రీడారంగమునకు దూరముగా యున్నాడు. ఆరోజు మాదక ద్రవ్యాల ఉపయోగమువలన ఆరోగ్యం క్షీణించి అనేక వ్యాధులతో బాధపడుచున్నాడు.

హేమర్ త్రోలో భారతవీరునిగా కొనియాడబడిన ప్రవీణ్‌కుమార్ కూడా మాదక ద్రవ్యాలకు బానిస అనవచ్చును. అతను పోటీ సమయములలో కొన్నిసార్లు సృష్టించిన రికార్డులు, వింత ప్రవర్తన, తప్పుడు త్రోలు దీనిని ధృవపరుస్తున్నాయి.

మహిళల్లో కూడా....

తెలుగు వనిత 1975-85 దశాబ్ద కాలములో అగ్రగామి ఆంధ్ర అథెలెట్‌గా ఖ్యాతి పొందిన కృష్ణబోస్ కూడా మాదక ద్రవ్యాల బానిస. 1982 ఢిల్లీ ఆసియా క్రీడలకు ముందు కృష్ణబోస్ మంచి ప్రతిభ చూపినది భావి భారత క్రీడాకారిణిగా గుర్తింపు పొందినది 1982 సెప్టెంబర్‌లో ఆసియా క్రీడలకు ముందు జరిగిన 'ట్రయల్ గేమ్స్'లో కృష్ణబోస్ 800మీ, 1500మీ, పరుగులలో అప్పటి మన మేటి అథెలెట్‌గా గీతాజుత్షిపై విజయం సాధించి అందరి మెప్పు పొందినది

1982 ఆసియా క్రీడల (ఢిల్లీ)లో ఆమె విఫలమగుట, తోటి క్రీడాకారిణులు ఆమె మాదక ద్రవ్యాలు ఉపయోగించుట గురించి బహిరంగం చేసారు

మన షాట్‌పుట్ వీరులు బహదూర్ సింగ్, బల్వీందర్‌సింగ్ 1982 ఢిల్లీ ఆసియాడ్, 1989 ఏషియన్ ట్రాక్ అండ్ ఫీల్డ్ పోటీలలో వీరు 18 మీటర్లకు పైగా షాట్‌పుట్ విసిరారు. కాని విదేశి పర్యటనలలో వీరు అంత దూరము విసరలేకపోవటానికి కారణం విదేశీ పర్యటనలో మాదక ద్రవ్యాలు ఉపయోగిస్తే తమ గుట్టు బహిరంగం అవుతాయి అనే భయంతో కావచ్చును. బహదూర్ సింగ్ అంతర్జాతీయ పోటీలలో పాల్గొనుటకు అంతగా ఆసక్తి చూపకపోవుటకు యిదే కారణం

1982 ఆసియా క్రీడలలో 800 మీటర్ల విజేత చార్లెస్ బొర్రమిమో, యిది వరకటి ఆసియా విజేత సురేష్ యాదవ్‌లు మన దేశంలో పోటీలలో మాదక ద్రవ్యాలువాడినట్లు వినిపించింది. లాంగ్ జంప్ వీరుడు టి.సి మోహన్ టెహరాన్ ఆసియాడ్‌లో 8-07 మీటర్లు దూరము దూకి వైద్య పరీక్షనుండి' తప్పించుకున్నాడు.

డ్రగ్స్‌వాడిన ప్రముఖులు

1986 సియోల్ ఆసియా క్రీడల్లో ఎం జి నాయుడు, తారాసింగ్, బల్వీందర్ సింగ్ (రైల్వే)లు 'నాన్ డ్రొలోన్' అనే అనబోలిక్ స్టెరాయిడ్స్ వాడినట్లు ఆధారాలు కలవు జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య వీరిని బహిష్కరించినది తారాసింగ్, బల్గేరియన్ కోచ్‌లు బీమారి గ్రడిన్రోవ్ ప్రోత్సాహం వలన 'డ్రగ్స్'కు అలవాటుపడినాడు ఇప్పటికి, అనారోగ్యం నుండి కోలుకోలేదు. సర్వీసెస్ ఛాంపియన్ పి కె. మహానంద, బాక్సింగ్ వీరుడు దల్‌జీత్‌సింగ్ కూడా డ్రగ్స్ ప్రభావమునకు బానిసలు. దల్‌జీత్‌సింగ్ కొన్ని మూలికలు వాడినట్లు కోచ్ ఒ పి బహర్ద్వాజ్ అంటున్నాడు కాని సియోల్ ఒలింపిక్స్‌లో దల్‌జీత్‌సింగ్ పోటీలలో పాల్గొనక గదిలో జ్వరము అనియుండుట అనుమానం కలిగించుచున్నది




కృష్ణబోస్

ఫుట్‌బాల్ ఆటగాళ్లు నాజర్‌సింగ్ (1968-75)ను 'చార్సినాజర్'గా ఫుట్‌బాల్ మైదానంలో అనుట, అతను పోటీల సమయంలో మాదక ద్రవ్యాలువాడుట అలాగే బి.ఎస్.ఎఫ్ మిడిల్ ఫీల్డర్ అజబ్‌సింగ్, మహమ్మద్ అక్బర్ (హైదరాబాద్)లు కలకత్తా ఫుట్‌బాల్ మైదానంలో ఆడిన ఆట, వారి ప్రవర్తన అనుమానం కలిగించాయి

మన క్రీడాకారులలో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందినవారు, విదేశీ కోచ్‌లవద్ద ప్రత్యేక శిక్షణ పొందిన వారు ఎక్కువగా మాదక ద్రవ్యాలు వాడినట్లు ఆధారాలు తెల్పుచున్నవి

- ముకరమ్



సుబ్రతాపాల్

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగినకథ -: 32 పాండవులు జూదంలో ఓడిపోయి పన్నెండేళ్లు అరణ్యావాసము, ఒక యేడు అజ్ఞాతవాసము పూర్తిచేసి తమకు అర్ధరాజ్యం యివ్వవలసిందిగా కృష్ణుడిని ధృతరాష్ట్రుడి వద్దకు పంపగా సంధియత్నం విఫలమై యుద్ధం అనివార్యమవుతుంది. కౌరవ, పాండవుల మధ్య జరిగే భీకరయుద్ధంలో హితులు, బంధువులను కోల్పోయి ద్వైపాయనంలో దాక్కున్న దుర్యోధనుడిని బయటకు రప్పించి భీముడు సంహరిస్తాడు. తన తండ్రిని చంపిన వారిపై పగతీర్చుకుంటానని అశ్వత్థామ ప్రతిన చేస్తాడు.

న్యాయమార్గం విడిచి ఇష్టం వచ్చినట్టు శత్రుసంహారం చేద్దామనుకునే వాణ్ణి ఆ అధర్మమే చంపుతుందా?

అశ్వత్థామ ఆలోచనలో పడ్డాడు.

భూతాన్ని గెలిచే మార్గం కోసం తల బద్దలు కొట్టుకుంటున్నాడు. కొద్దిసేపటిక్రితం కృపాచార్యుడు అన్న మాటలు గుర్తుకొచ్చాయి.

'నిద్రపోతున్న వాళ్లను చంపడం ధర్మం కాదు. చూడబోతే రాక్షస ప్రవృత్తి నిన్ను ఆవేశిస్తున్నట్టుంది. న్యాయరహితంగా సంపాదించే కీర్తి, డబ్బు, విజయం కలకాలం వుండవనే నిజం నీకు తెలీదనుకోను. నిజంగానే తెలియకపోతే నా మాట విను.'

విననుగాక వినను. ఈ చివరి క్షణంలో అధైర్యం కలగడానికి వీల్లేదు. ఇప్పుడే అన్నిశక్తులూ కూడగట్టుకోవాలి. ఎవరొచ్చినా రాకపోయినా తనొక్కడే ఒంటరిగా పోరాడుతాడు. తనేమిటో అందరికీ తెలిసేలా చేస్తాడు....

దూరంగా వెళ్లి చెట్టుకింద కూర్చుని నిశ్చలచిత్తంతో శివధ్యానం చేశాడు. నేనీ ఆపదగడిస్తే నీకు నానా భూతబలి ఇస్తాను. నేనే నీకు ఉపహారమవుతాను - అని శివుడికి మనసులో మాట ఇచ్చాడు.

అంతే. ఉన్నట్టుండి ఒక మహాద్భుతం జరిగిపోయింది. ఎదురుగా ఒక బంగారు అరుగూ, దానిమీద మండుతున్న హోమాగ్నీ ప్రత్యక్షమయ్యాయి. భయంకరాకారాలతో ప్రమథులంతా కూడా కనిపించారు. అశ్వత్థామ వాళ్లందరి వంకా చూసి చిరునవ్వు నవ్వుతూ చేతులు జోడించాడు. ఆపద గడవబోతోంది. ఆత్మాహుతే మిగిలింది. శివుడికి తన శరీరాన్ని ఆహుతివ్వడానికి, మండుతున్న అక్కడి హోమాగ్ని చాలదని రథం మీది ధనువులూ బాణాలూ తెచ్చి వేశాడు. భగ్గున పెద్ద మంటలు లేచాయి. 'పార్వతీ పతీ! నన్ను నేను నీకు అర్పించుకుంటున్నాను. అంగిరస కులంలో పుట్టిన ఈ శరీరాన్ని నీకు ఆహుతివ్వగల్గుతున్నందుకు గర్వంగా వుంది నాకు' అని రెండు చేతులూ పైకెత్తి మంటల్లోకి దూకాడు.

చిత్రం. కాలిపోవాల్సిన శరీరం కొలిమిలో బంగారంలా మెరిసింది. శివుడు అశ్వత్థామను కనికరించి మహనీయమైన ఓ ఖడ్గాన్నిచ్చి తేజోరూపాన అతనిలోకి ప్రవేశించాడు. దాంతో అశ్వత్థామకు శివమెత్తింది. మారణ మహాశక్తి అతన్ని ఆవహించింది. కృప కృతవర్మలను శిబిరం వెలుపల నిలబెట్టి ఒక్కడే మళ్లీ ముఖద్వారం వైపు వెళ్లాడు.

ఇదివరకు కనిపించిన భూతం లేదక్కడ. అది మింగేసిన శస్త్రాస్త్రాలన్నీ కూడా యధాప్రకారం అతని దగ్గరకు మళ్లీ వచ్చేశాయి.

లోపలికి నడిచాడతను.

ధృష్టద్యుమ్నుడి మందిరం కోసం ముందు వెతికాడు. కాసేపటికి కనిపించింది.

చాందినీ కట్టి తెరలు వేళ్లాడదీసిన మంచంపైన నిద్రపోతున్నాడతను. మసక దీపపు వెలుతురు పల్చగా మందిరమంతా పరుచుకునుంది.

అశ్వత్థామ అతన్ని కాలితో ఒక తన్ను తన్నాడు. ధృష్టద్యుమ్నుడు కళ్లు తెరిచి చూసి దిగ్గున లేచి మంచున్నాడు. నిద్రమత్తులోవున్న అతన్ని జుట్టుపట్టుకుని కింద పడేసి రొమ్మును మోకాళ్లతో నొక్కిపట్టి ముఖాన్ని పిడికిలితో పొడిచాడు అశ్వత్థామ. అతను నెత్తురు కక్కుకున్నాడు. తరువాత స్పృహ తప్పాడు. అతనికి మళ్లీ తెలివి వచ్చేవరకూ అశ్వత్థామ ఆగాడు. స్పృహ వచ్చాక - తన వింటి నారి తీసి అతని కంఠానికి ఉరితాడులా చుట్టాడు.

నిదానంగా బిగించాడు. ధృష్టద్యుమ్నుడు ఏదో మాట్లాడబోయి, మాట రాక, ఊపిరాడక గిలగిల్లాడాడు.

అతను పైకి లేవకుండా అశ్వత్థామ అతని మెడా, రొమ్మూ రెండు కాళ్లతోటే తొక్కిపట్టాడు.

ధృష్టద్యుమ్నుడు దీనంగా చూశాడు అశ్వత్థామ వైపు.

చేతులెత్తి దణ్ణం పెట్టి గొంతుకెలాగో పెగుల్చుకుని 'గురుపుత్రా! నన్నెందుకింత నిదానంగా చంపుతావు? ఎందుకింతగా హింస పెడ్తావు? చావునైనా నన్ను హాయిగా అనుభవించనీ' అని వేడుకున్నాడు.

అతనెంత వేడినా అశ్వత్థామ గుండె కరగలేదు. 'నోర్ముయ్. నీ క్షేత్ర నీలాంటి గురుహంతకులకు గుణపాఠం కావాలని నిన్నింత నిదానంగా చంపుతున్నాను. నువ్వు నా

తండ్రిని ఎంత దారుణంగా చంపావో అంత దారుణంగానూ నిన్ను చంపుతాను' అని అతన్ని చిత్రహింసలు పెట్టి పెట్టి అతని కంఠాని కున్న ఉరిని కసిదీర బిగించాడు.

ధృష్టద్యుమ్నుడు చావుకేక పెట్టాడు. అది విని అతని దేవేరులూ, అంగరక్షకులూ లేచి వచ్చారు. ధృష్టద్యుమ్నుడు నేల మీద రక్తంలో పడివుండడం చూసి వాళ్ళు వణికి పోయారు.

చాలాసేపు నోటమాట రాక శిలల్లా నిలబడ్డారు. తరువాత పెద్దగా ఏడ్చారు. ఆ ఏడుపులు విని చుట్టుపక్కల శిబిరాల్లోని రాజులందరూ వచ్చారు. వాళ్ళంతా రథం ఎక్కి వెళ్తున్న అశ్వత్థామను చుట్టుముట్టారు. అశ్వత్థామ వాళ్ళందర్నీ ఆడుకున్నంత తేలిగ్గా చంపి పక్కనేవున్న మరో మందిరంలోకి చొరబడి ఉత్తమౌజుణ్ణీ, అతని తమ్ముడు యుధామన్యుణ్ణీ చిత్రవధ చేశాడు. ఇంకో మూడు నాలుగు గంటల్లో తెల్లవారుతుందనగా పాండవులందర్నీ చంపి కసి తీర్చుకునేందుకు సమయం సరిపోదేమోనన్న దిగులేసింది అశ్వత్థామకు.

కత్తి తీసుకున్నాడు. చప్పుడు కాకుండా శిబిరాల్లోకి ప్రవేశించి పాంచాల వంశస్థులందర్నీ ఒక్కడు కూడా మిగలకుండా చేశాడు.

అప్పటికీ తృప్తి కలగలేదు. ఏనుగుల శాలకు వెళ్లి కొన్నిటికి తొండాలు నరికాడు, కొన్నిటికి కుంభస్థలాలు చీల్చాడు. తరవాత గుర్రాల మీదకు దూకి వాటి గిట్టలు నరికాడు. కాళ్ళు నరికాడు. వీపులు చీల్చాడు. ఆయుధాగారాలకు వెళ్లి అక్కడున్న వాళ్ళందర్నీ చేతులకొద్దీ చంపాడు. ఎదిరించిన వాళ్లను కత్తితో కండలు తీశాడు. నెత్తురు మడుగులు కట్టింది. ఆ నెత్తురులో అశ్వత్థామ శరీరమంతా తడిసి ముద్దయిపోయింది! అతన్ని చూసి, పాండవులకు యుద్ధంలో సహాయపడేందుకు వచ్చిన రాజులూ, రాజ బంధువులూ భయపడి పారిపోయారు.

అశ్వత్థామ నవ్వుకుంటూ తిన్నగా రాజ మందిరం దగ్గరకు వెళ్లాడు.

అప్పటికి సేనా నివేశనమంతా మేలుకొంది.

శిఖండీ, ఉప పాండవులూ అశ్వత్థామను వెంబడించారు. పరమేశ్వరుడిచ్చిన ఖడ్గం చేతపట్టుకుని శివమెత్తినట్టు అతను విలయ తాండవం చేశాడు.

ధర్మరాజు కుమారుడైన ప్రతివింధ్యుడి నడుం తెగ్గొట్టాడు. భీమ పుత్రుడైన శ్రుతసోముడి తల ఎగరకొట్టాడు. నకుల సహదేవుల కొడుకులైన శతానీక, శ్రుతసేను లిద్దరినీ నిలువునా చీల్చాడు. అర్జున కుమారుడైన శ్రుతకీర్తిని పట్టి తల నరికాడు. శిఖండిని రెండు చెక్కలు చేశాడు. ఇంత చేసినా అతనికి అలసట అనిపించలేదు. జాలి ఏ కోశానా కలగలేదు.



పాండవులూ, సాత్యకీ, కృష్ణుడూ ఎక్కడైనా కనిపిస్తారేమోనని శిబిరాలన్నీ గాలించాడు. ఎంతవెదికినా కనిపించకపోయేసరికి నిరుత్సాహపడ్డాడు. తను ఈ రాత్రి చంపితీరాలనుకున్న వాళ్లల్లో ముఖ్యమైన ఐదుగురూ ఇంకా బ్రతికే వున్నారన్న ఆలోచన అశ్వత్థామను కృంగతీసింది.

చేసేది లేక బయటకు వచ్చాడు.

కృపాచార్యుడూ, కృతవర్మా శిబిరం వెలుపలే నిలబడి వున్నారు.

తూరుపు తెల తెల వారుతోంది.

ముగ్గురి రథాలూ, దుర్యోధనుని దిశగా దూసుకుపోయాయి.

****

యుద్ధంలో ద్రుపద విరాటులు చనిపోతే వాళ్ల భార్యల్ని ఓదార్చి రావడానికి వెళ్లింది ద్రౌపది. తండ్రిని పోగొట్టుకున్నందుకే చాలా దుఃఖపడింది తను. ఇప్పుడు కొడుకులూ, సోదరులూ, బంధువులూ అంతా ఒక్కసారే పోయారంటే ఆ దెబ్బ నుంచి ఎలా తట్టుకుంటుందో- అని ధర్మరాజు పాంచాల కుమారిని గురించి ఆలోచిస్తుంటే ఇంతలో ద్రౌపది రథం దిగి రావే వచ్చింది లోపలికి.

ఆమెను చూస్తూనే రెండు చేతుల్తోనూ ముఖం దాచుకుని, పెద్దగా ఏడ్చాడు ధర్మరాజు.

ద్రౌపది

ద్రౌపది అడుగులు తడబడ్డాయి. చెమ్మగిల్లిన కళ్లతో పక్కనున్న వాళ్లని నిశ్శబ్దంగా అడిగింది ఏమైందని.

సమాధానానికి బదులు అందరూ కళ్ల నీళ్లు పెట్టుకున్నారు.

ద్రౌపది ఆగి, రెండు నిముషాలు తల వంచుకుని నిలబడి వాళ్ల ఏడుపు వింది. ఆ తరవాత వినలేక 'ఎందుకేడుస్తున్నారు? కృష్ణుడు చేయూత ఇచ్చి నడిపిస్తే అతను తోడూ నీడగా వుండి కాపాడితే ఏ శిఖరమైనా అందుకోవాల్సిన మీరు ఎందుకిలా తల్లడిల్లిపోతున్నారు?' అని అడిగింది భర్తల్ని

ధర్మరాజు తలెత్తి 'పాండవ కుమారులు అయిదుగురూ హతులయ్యారు' అన్నాడు అంటూనే కుప్పకూలిపోయాడు.

ఆ మాట విన్నప్పుడు ద్రౌపది మొహం ఎర్రగా నిప్పులా మారిపోయింది. దిక్కులు పిక్కటిల్లేలా 'ఎవరా రాతి గుండెవాడు?' అని పెద్దగా అరిచింది. ఆమె కంఠం కురుక్షేత్రమంతా ప్రతి ధ్వనించింది.

'అశ్వత్థామ' అని సమాధానమిచ్చాడు అర్జునుడు.

'మీ అస్త్రులకోసం మీ మనస్పర్థలకోసం పసివాళ్లను బలి తీసుకోవడం అన్యాయం' అంది ద్రౌపది రుద్ధమైన కంఠంతో.

అశ్వత్థామలోని ప్రతి అణువునూ మారణ మహాశక్తి ఎలా ఆవహించి ఒకే ఒక్క రాత్రిలో పాండవ పుత్రుల్నీ, ధృష్టద్యుమ్నుడ్నీ పొట్టన పెట్టుకుందో ద్రౌపదికి ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. భీముడి గుండెలమీద వాలి పెద్దగా ఏడ్చింది. ఆమె కన్నీళ్లు తుడుస్తూ మధ్య మధ్య తనూ ఏడుస్తూ క్రితం రాత్రి పాంచాల శిబిరాలలో అందరూ ఆదమరచి నిద్రపోతున్నవేళ అశ్వత్థామ చేసిన అమానుషం గురించి ద్రౌపదికి చెప్పాడు భీముడు.

కోపంతో వూగిపోయిందామె 'నిజమా ఇది - కేవలం మనం గెలిచామన్న ఉక్రోషంతోనే ద్రోణుడి కొడుకు ఇంత పని చేశాడా? నిద్రపోతున్న నా బిడ్డల్ని నిష్కారణంగా, నిర్దాక్షిణ్యంగా చంపడానికి వాడికి చేతులెలా వచ్చాయి?.. ..కానీ మీరలా కాదు. అందరూ చూస్తుండగానే వాడు చేసిన అన్యాయమేమిటో అందరికీ చెప్పి వాడ్ని పశువుని చంపినట్టు చంపాలి. లేకపోతే నేను ఇప్పుడే ప్రాయోపవేశం చేసి ప్రాణాలు విడుస్తాను' అంది.

ద్రౌపది అలా అనడంతో భీముడి మనసులోని ఆలోచనలకు బలం వచ్చింది. 'నకులా రథం సిద్ధం చెయ్యి' అన్నాడు.

(ఇంకా ఉంది)